

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సోమవారం | 28-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 211 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి ఉ. 7.51 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పుబ్బ మ. 3.24 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా.11.33-1.21; దుర్ముహూర్తం: మ.12.21-1.07, మ.2.38-3.24; అమృతఘడియలు: ఉ.8.12-10.00; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 5.41

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



హైదరాబాద్ 536/8 డిక్లేర్డ్
పుదుచ్చేరితో రంజీ

హైదరాబాద్: టాపార్డర్ బ్యాటర్లు రాణించడంతో.. గ్రూప్-బిలో పుదుచ్చేరితో రంజీలో హైదరాబాద్ భారీ స్కోరు చేసింది. కిందటి స్కోరు 290/1తో రెండో రోజు ఆటను కొనసాగించిన హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌ను 536/8 వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు తన్మయ్ (173), రోహిత్ (84) తొందరగానే పెవిలియన్ చేరినా.. హిమతేజ్ (60), తనయ్ (53 నాటౌట్) హాఫ్ సెంచరీలతో జట్టు స్కోరును 500 పరుగుల మార్క్ దాటించారు. అంకిత్ శర్మ 3 వికెట్లు, సతీష్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన పుదుచ్చేరి 2 వికెట్లకు 24 పరుగులు చేసింది. ఆదివారం ఆట ముగిసే సమయానికి గౌరవ్ (0), ఆకాష్ (1) క్రీజులో ఉన్నారు. రోహిత్, అనికేత్ చెరో వికెట్ పడగొట్టారు. మొత్తంగా హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు పుదుచ్చేరి ఇంకా 512 పరుగుల వెనుకంజలో ఉంది.

పాక్ కొత్త కెప్టెన్ రిజ్వాన్



లాహోర్: పాకిస్థాన్ పరిమిత ఓవర్ల కెప్టెన్‌గా వికెట్ కీపర్-బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్‌ను నియమించారు. బాబర్ ఆజమ్ స్థానంలో వన్డే, టీ20 ఫార్మాట్ పగ్గాలను రిజ్వాన్‌కు అప్పగించారు. ఆస్ట్రేలియా, జింబాబ్వేలతో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం జట్లను సెలెక్టర్లు ఆదివారం ఎంపిక చేశారు. కాగా, వచ్చే నెలలో ఆసీస్‌తో జరిగే వన్డే, టీ20ల జట్లలో బాబర్, షహీన్ అఫ్రీది, నసీమ్ షాలకు మళ్లీ చోటుదక్కింది. అయితే, వచ్చేనెల 24 నుంచి డిసెంబరు 5 వరకు జరిగే జింబాబ్వే టూర్‌కు రిజ్వాన్‌తోపాటు కొందరు సీనియర్లకు విశ్రాంతినిచ్చారు. దీంతో ఈ టూర్‌లో వైస్ కెప్టెన్‌గా ఎంపికైన సల్మాన్ అగా జట్టును నడిపించనున్నాడు.

'బి' కేటగిరీకి అఫ్రీది: స్టార్ పేసర్ షహీన్ అఫ్రీదికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు షాక్ ఇచ్చింది. ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్ట్‌లో అఫ్రీదిని కేటగిరి-ఎ నుంచి తప్పించి.. గ్రేడ్-బిలో చేర్చింది. 2024-25 సీజన్‌కు సంబంధించి 25 మందికి సెంట్రల్ కాంట్రాక్ట్‌లు ఇచ్చారు. ఫఖర్ జమాన్, ఇఫ్తికార్ అహ్మద్, ఒసామా మిర్‌లను ఆ జాబితా నుంచి తప్పించారు. పాక్ టెస్ట్ కెప్టెన్ షాన్ మసూద్ కేటగిరి-బిలోనే ఉన్నాడు.

వారసులు వీరేనా?



(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌ను కోల్పోయిన దరిమిలా భారత జట్టు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ అవకాశాలు ప్రమాదంలో పడ్డాయి. పరిస్థితులు అనుకూలించి వచ్చే ఏడాది జూన్‌లో జరిగే తుదిపోరుకు టీమిండియా అర్హత సాధిస్తే..వరుసగా మూడోసారి ఫైనల్‌కు చేరినట్టవుతుంది. ఇక తదుపరి డబ్ల్యూటీసీ సైకిల్ (2025-27) ఫైనల్ నాటికి కెప్టెన్ రోహిత్, అశ్విన్, విరాట్, జడేజాలాంటి స్టార్లు జట్టులో ఉండకపోవచ్చు. కివీస్‌తో రెండు టెస్ట్‌ల్లో ఘోర పరాభవం అనంతరం ఈ సీనియర్ క్రికెటర్ల సత్తాపై ఇప్పటికే చర్చలు మొదలయ్యాయి. రాబోయే డబ్ల్యూటీసీ సైకిల్‌లో భారత్ పరివర్తన దశలో ఉండడం ఖాయం. అయితే స్టార్ బ్యాటర్ల స్థానాన్ని భర్తీ చేసేందుకు సమర్థులైన యువకులు అందుబాటులో ఉండడం కోచ్ గంభీర్‌కు సానుకూలాంశం. కానీ బౌలర్ల విషయంలోనే పరిస్థితి ఆశాజనకంగా లేదు. గాయం నుంచి పూర్తిగా కోలుకొని షమి పునరాగమనం చేసినా.. అతడు కెరీర్ చరమాంకంలో ఉంటాడు. సిరాజ్, ఆకాశ్‌దీప్ ఆకట్టుకుంటున్నా.. బుమ్రా, షమి స్థాయిని అందుకోలేకపోతున్నారు. అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్ భవిష్యత్ ఆశాకిరణాలుగా అంచనా వేస్తున్నారు. కానీ నిలకడ, ఫిట్‌నెస్ లేకపోవడం వారిద్దరికీ ప్రతికూలంగా మారింది. ఇక, ఉమ్రాన్ మాలిక్ విఫలమయ్యాడు. ముకేష్ కుమార్, వైశాఖ్ విజయ్ కుమార్, విద్యుత్ కావేరప్ప ఉన్నా, బ్యాటర్లలో గుబులు పుట్టించేంత పేస్ వీరి బౌలింగ్‌లో కనిపించడంలేదు. అత్యంత వేగవంతమైన బంతులు విసురుతూ మయాంక్ యాదవ్ సంచలనం సృష్టిస్తున్నా గాయాల బెడద ఎదుర్కొంటున్నాడు. ఫిట్‌నెస్ కాపాడుకోగలిగితే మయాంక్‌కు తిరుగుండదు. మరోవైపు సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ కొరత కూడా జట్టును వేధిస్తోంది. హార్దిక్ పాండ్యానేమో టెస్ట్ క్రికెట్‌పట్ల ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో తెలుగు పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ భావితారగా తెరపైకి వచ్చాడు. మరి అతడు తన సత్తాను నిరూపించుకుంటాడేమో చూడాలి.

ఓపెనర్‌గా ఎవరంటే..

రోహిత్ రిటైర్ అయితే..యశస్వీ జైస్వాల్‌కు తోడుగా ఇన్నింగ్స్‌ను ఎవరు ఆరంభిస్తారనేది మరో చర్చ. అభిమన్యు ఈశ్వరన్, రుతురాజ్ గైక్వాడ్, సాయి సుదర్శన్ రేసులో ఉన్నారు. 27 ఫస్ట్‌క్లాస్ సెంచరీలతో ఈశ్వరన్ ముందంజలో ఉన్నాడు. కానీ పెద్ద మ్యాచ్‌ల్లో ఒత్తిడిని తట్టుకోలేడనే అపప్రథ ఈశ్వరన్‌పై ఉంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ధనాధన్ బ్యాటింగ్ చేసే రుతురాజ్ శైలి టెస్ట్ క్రికెట్‌కు నప్పుతుందా అనేది ప్రశ్న. దాంతో ఎక్కువసేపు క్రీజులో నిలవడంతోపాటు చక్కటి టెక్నిక్ కలిగిన సాయి సుదర్శన్ ఉత్తమం. ఓపెనర్‌గానే కాదు నెంబర్ 3లోనూ బ్యాటింగ్ చేయగల సమర్థుడు సుదర్శన్. తదుపరి స్థానం విరాట్ కోహ్లీది. టెస్ట్ అరంగేట్రంలోనే అర్ధ శతకం బాదిన దేవదత్ పడిక్కళ్..విరాట్ స్థానానికి చక్కగా సరిపోతాడు. బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ రాణించే అక్షర్ పటేల్.. ఆల్‌రౌండర్ జడేజాకు ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాడు. కానీ స్పిన్‌కు అనుకూలించని పిచ్‌లపై బౌలింగ్‌లో తేలిపోవడం అక్షర్‌కు మైనస్. పుణెలో 11 వికెట్లు తీయడంతోపాటు 2021 బ్రిస్బేన్ టెస్ట్‌లో బ్యాటింగ్‌తో భళా అనిపించిన వాషింగ్టన్ సుందర్..జడేజా-అశ్విన్‌ల వారసుడిగా భావిస్తున్నారు.

ప్రాక్టీస్‌కు అందరూ రావాల్సిందే!



ముంబై: న్యూజిలాండ్‌తో తొలి రెండు టెస్ట్‌ల్లో భారీ ఓటమి నేపథ్యంలో భారత జట్టు యాజమాన్యం కఠినమైన నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. సాధారణంగా జట్టు స్టార్ ఆటగాళ్లకు ప్రాక్టీస్ నుంచి మినహాయింపు ఉంటుంది. ఇక న్యూజిలాండ్‌తో ఇక్కడ జరిగే మూడో టెస్ట్‌కు సంబంధించి ఈనెల 30, 31 తేదీలను టీమిండియా ప్రాక్టీస్‌కు కేటాయించారు. దీనికి జట్టు ఆటగాళ్లంతా తప్పకుండా హాజరు కావాలని గంభీర్ ఆధ్వర్యంలోని జట్టు యాజమాన్యం ఆదేశించినట్టు తెలిసింది. అంటే స్టార్లు రోహిత్, విరాట్, బుమ్రా సైతం ప్రాక్టీస్‌లో పాల్గొనాల్సిందేనన్నమాట!

రాష్ట్ర ఆర్చరీ అధ్యక్షునిగా రాజు



హైదరాబాద్: రాష్ట్ర ఆర్చరీ సంఘం (టీఏఏ) నూతన కార్యవర్గం కొలువైంది. ఆదివారం ఇక్కడ జరిగిన ఎన్నికల్లో టీఏఏ కొత్త అధ్యక్షునిగా టి. రాజు ఎన్నికయ్యాడు. మెదక్ జిల్లా ఆర్చరీ సంఘం చీఫ్‌గా పనిచేసిన న్యాయవాది రాజు.. ఇప్పటికే రెండుసార్లు టీఏఏ ఉపాధ్యక్షునిగా వ్యవహరించారు. ఇక, టీఏఏ నూతన ఉపాధ్యక్షునిగా లక్ష్మీకాంత్ రాథోడ్, జనరల్ సెక్రటరీగా అర్వింద్ కుమార్, కోశాధికారిగా సత్యప్రసాద్, జాయింట్ సెక్రటరీగా విజయ్‌కుమార్ రెడ్డి ఎన్నికయ్యారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి జగపతి రావు ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు.

'ఎమర్జింగ్' విజేత అఫ్ఘాన్
ఫైనల్లో లంక ఓటమి

అల్‌అమెరాత్ (ఒమన్): ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టీ20 టోర్నీలో అఫ్ఘానిస్థాన్ 'ఎ' జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో అఫ్ఘానిస్థాన్ 7 వికెట్లతో శ్రీలంక 'ఎ' జట్టును ఓడించింది. తొలుత లంక 20 ఓవర్లలో 133/7 స్కోరు చేసింది. సహన్ అరాచిగే (64 నాటౌట్) సత్తా చాటాడు. అనంతరం అఫ్ఘాన్ 18.1 ఓవర్లలో 134/3 స్కోరు చేసి నెగ్గింది. అతల్ (55 నాటౌట్), కరీమ్ జానత్ (33) రాణించారు.

విండీస్‌కు ఊరట విజయం

పల్లెకెలె: ఓపెనర్ ఎవిన్ లూయిస్ (102 నాటౌట్) సెంచరీతో చెలరేగిన వేళ..శ్రీలంక పర్యటనను వెస్టిండీస్ విజయంతో ముగించింది. శనివారం రాత్రి జరిగిన ఆఖరి వన్డేలో విండీస్ 8 వికెట్లతో నెగ్గింది. అయితే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో శ్రీలంక ఇంతకు ముందే కైవసం చేసుకుంది. ఇక వర్షం బారిన పడిన ఈ మ్యాచ్‌ను 23 ఓవర్ల చొప్పున కుదించారు. తొలుత లంక 23 ఓవర్లలో 156/3 స్కోరు చేసింది. లంక ఇన్నింగ్స్ మధ్యలో వర్షం కారణంగా ఐదు గంటలు మ్యాచ్ ఆగిపోయింది. దీంతో విండీస్ లక్ష్యాన్ని 23 ఓవర్లలో 195గా నిర్ధారించారు. అయితే, విండీస్ 22 ఓవర్లలోనే 196/2 స్కోరు చేసి నెగ్గింది.

అర్జున్‌కు ప్రధాని అభినందన

న్యూఢిల్లీ: లైవ్ చెస్ ఎలో రేటింగ్‌లో 2800 మార్క్ అందుకున్న తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. 'అర్జున్.. అద్భుతమైన ఘనతను సాధించావు. నిన్ను చూసి దేశం గర్వపడుతోంది. నీ ప్రదర్శన మరింత మంది యువత చెస్ ఆడేందుకు ప్రేరణగా నిలుస్తుంది' అని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

రాధ పోరాడినా..
రెండో వన్డేలో భారత్‌పై కివీస్ విజయం



సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 50 ఓవర్లలో 259/9 (డివైన్ 79, బేట్స్ 58, గ్రీన్ 42; రాధ 4/69, దీప్తి 2/30).
భారత్: 47.1 ఓవర్లలో 183 ఆలౌట్ (రాధ 48, సైమా 29; డివైన్ 3/27, తహుహు 3/42).

అహ్మదాబాద్: ఆల్‌రౌండర్ రాధా యాదవ్ (4/69, 48) పోరాడినా.. మిగతా బ్యాటర్ల వైఫల్యంతో భారత మహిళ జట్టుకు ఓటమి తప్పలేదు. కెప్టెన్ సోఫీ డివైన్ (79, 3/27) బ్యాట్, బంతితో అదరగొట్టడంతో.. ఆదివారం జరిగిన రెండో వన్డేలో భారత్‌ను 76 పరుగుల తేడాతో చిత్తు చేసిన న్యూజిలాండ్ 1-1తో సిరీస్‌ను సమం చేసింది. తొలుత కివీస్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 259 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు సుజీ బేట్స్ (58), ప్లిమ్మర్ (41) మొదటి వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యంతో పటిష్ఠ పునాది వేశారు. లారెన్ డౌన్ (3), బ్రూకీ హాలిడే (8) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో.. కివీస్ 139/4తో నిలిచింది. అయితే, డివైన్, మ్యాడీ గ్రీన్ (42) ఐదో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు భారీ స్కోరును అందించారు. దీప్తి శర్మ 2 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత్ 47.1 ఓవర్లలో 183 పరుగులకు ఆలౌటైంది. టాప్-8లో హర్మన్ (24) మినహా ఎవరూ రెండు పదుల స్కోరు కూడా చేయలేదు. తొలి ఓవర్‌లోనే స్మృతి మంధాన (0)ను తహుహు డకౌట్ చేయడంతో భారత పతనం ఆరంభమైంది. ఆ తర్వాత షఫాలీ వర్మ (11), యాస్తిక భాటియా (12), జెమీమా రోడ్రిగ్స్ (17), హర్మన్, తేజల్ (15), అరుంధతి (2) పెవిలియన్‌కు క్యూ కట్టడంతో 108/8తో భారత ఇన్నింగ్స్ ఎంతో సేపు సాగదనిపించింది. ఈ దశలో రాధ, సైమా ఠాకూర్ (29) తొమ్మిదో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యంతో ఘోర పరాజయాన్ని తప్పించారు. తహుహు 3 వికెట్లు పడగొట్టింది. సిరీస్ నిర్ణాయక మూడో వన్డే మంగళవారం జరగనుంది.

రాష్ట్ర కబడ్డీ సంఘం చీఫ్.. కాసాని వీరేశ్



హైదరాబాద్: తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షునిగా కాసాని వీరేశ్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. ఆదివారం ఇక్కడ జరిగిన కబడ్డీ సంఘం ఎన్నికల్లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం చీఫ్‌గా వీరేశ్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా నర్సింగ్ రావు, భూలోక రావు, అబ్దుల్లా ఖాన్, అమిత్ కుమార్, గంగాధర్ రెడ్డి, కోశాధికారిగా రవికుమార్, సంయుక్త కార్యదర్శులుగా విజయ్‌కుమార్, గట్టయ్య, స్వాతిముత్యం, యాదయ్య గౌడ్, శివకుమార్ ఎన్నికయ్యారు. మరో 11 మంది ఈసీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా రిటైర్డ్ ఐఏఎస్ జగన్మోహన్ వ్యవహరించారు.

ఉత్కం'టై'
తలైవాస్, జైపూర్ మ్యాచ్ డ్రా

హైదరాబాద్: రైడర్ సచిన్ సోలో టాకిల్‌తో.. ఓడాల్సిన మ్యాచ్‌లో తమిళ తలైవాస్ టైతో గట్టెక్కింది. గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం తలైవాస్, జైపూర్ పింక్ పాంథర్స్ మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్ 30-30 స్కోరుతో డ్రాగా ముగిసింది. తలైవాస్ 29-30తో ఉన్న సమయంలో జైపూర్ తరఫున ఆఖరి రైడ్‌కు వచ్చిన రెజా టైమ్ కిల్ చేయాలని చూశాడు. కానీ, సచిన్ అనూహ్యంగా అతడిని పట్టేసి తలైవాస్‌ను ఓటమి నుంచి కాపాడాడు. అనంతరం జరిగిన మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 35-29తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది.

బిజినెస్

గృహోపకరణాలకు పండగ జోష్
30% వరకు పెరగనున్న విక్రయాలు

న్యూఢిల్లీ: ఈ పండగల సీజన్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు బాగానే కలిసొస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం వీటి అమ్మకాలు 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నాయి. ఆఫర్ల జోష్‌తో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ దిగ్గజాల అమ్మకాలూ ఈ పండగల సీజన్‌లో మరింత ఊపందుకున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ప్రీమియం ఉత్పత్తుల డిమాండ్ అమాంతం పెరగడం ఈ సంవత్సరం ప్రత్యేకత. పెద్దపెద్ద నగరాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ ఇదే ట్రెండ్ కనిపిస్తోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అధిక సామర్థ్యం, మంచి ఇంధన సామర్థ్యం, పెద్ద సైజుతో పాటు ఏఐ, ఐఓటీ వంటి అధునాతన టెక్నాలజీ హంగులు ఉండే హై ఎండ్ టీవీలు, వాషింగ్ మెషిన్లు, డిష్‌వాషర్లు, డబుల్ డోర్ ఫ్రిజ్‌ల వంటి వాటికి అధిక ధర చెల్లించేందుకు వినియోగదారులు ఏ మాత్రం ఆలోచించడం లేదని వెల్లడించాయి.

● సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో జీజీ ఇంజనీరింగ్ లిమిటెడ్ నికర లాభం ఏకంగా 1,300 శాతం వృద్ధి చెంది రూ.75.31 లక్షల నుంచి రూ.10.52 కోట్లకు చేరుకుంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.73.24 కోట్ల నుంచి రూ.105.70 కోట్లకు పెరిగింది.

● సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ చేపట్టిన విల్ ఆఫ్ చేంజ్ (వీలునామా మార్పు) క్యాంపెయిన్‌కు దేశవ్యాప్తంగా మంచి స్పందన లభిస్తోందని ఐటీసీ వెల్లడించింది. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 7శాతం మంది కుమార్తెలు సమాన వారసత్వ హక్కును అందుకున్నారని తెలిపింది. వారసత్వ ఆస్తి విషయంలో కుమార్తెలకు ఎదురవుతున్న అన్యాయాన్ని నివరించటమే కాకుండా వారికి సమాన హక్కులు కల్పించేందుకు ఈ క్యాంపెయిన్ దోహదపడుతోందని తెలిపింది.

తెలంగాణ, దహేజ్ ప్లాంట్ల విస్తరణ
పిరామల్ ఫార్మా

న్యూఢిల్లీ: తెలంగాణ, ఉమ్మడి మెదక్ జిల్లాలోని కోహిర్ ప్లాంట్, గుజరాత్‌లోని దహేజ్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించనున్నట్లు పిరామల్ ఫార్మా ప్రకటించింది. ఇందుకోసం 5.5 కోట్ల డాలర్లకు పైగా (సుమారు రూ.463 కోట్లు) ఖర్చు చేయనున్నట్లు కంపెనీ చైర్‌పర్సన్ నందిని పిరామల్ వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తమ కంపెనీ మొత్తం మూలధన పెట్టుబడులు 8.5 కోట్ల డాలర్ల వరకు ఉంటాయన్నారు. అందులో ఇప్పటికే మూడు కోట్ల డాలర్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. అలాగే మొత్తం పెట్టుబడుల్లో మూడు కోట్ల డాలర్లు ఇప్పటికే ఉన్న ప్లాంట్ల నిర్వహణ, ఇతర అవసరాలకు వినియోగిస్తామని ఆమె తెలిపారు.

నోయెల్‌కు ఇంకా అనుభవం రావాలి
రతన్ టాటా అంతరంగం

న్యూఢిల్లీ: తన వారసుడుగా టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ పగ్గాలు నోయెల్ టాటా చేపట్టాలంటే అతనికి మరింత అనుభవం అవసరమని రతన్ టాటా అభిప్రాయపడ్డారు. టాటా సన్స్ వంటి భారీ కంపెనీ కోసం సంక్లిష్టమైన కార్యాలు చేపట్టడానికి ఆ అనుభవం దోహదపడుతుందన్నది ఆయన అభిప్రాయం. ఇటీవల విడుదలైన రతన్ జీ జీవిత చరిత్ర "రతన్ టాటా ఎ లైఫ్" పుస్తకంలో ఆయన ఈ అభిప్రాయాలు ప్రకటించారు. రతన్‌జీ మరణానంతరం టాటా సన్స్ చైర్మన్‌గా ఇటీవలే నోయెల్ నియమితులయ్యారు. రతన్ టాటా వారసుని కోసం 2011 మార్చిలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన పలువురు అభ్యర్థుల్లో నోయెల్ కూడా ఉన్నారు. ఆ సెలక్షన్ కమిటీకి రతన్ టాటా దూరంగా ఉన్నారు. కాని అలా దూరంగా ఉండడం పట్ల ఆయన తదుపరి దశలో విచారించినట్టు రచయిత థామస్ మాథ్యూ ఆ పుస్తకంలో రాశారు. టాటా గ్రూప్ చైర్మన్ కావాలంటే ఆ వ్యక్తికి "సాహసం, వ్యాపార చాతుర్యం" కావాలని సంస్థ వ్యవస్థాపకుడు జేఆర్‌డీ టాటా నిర్దేశించడమే నోయెల్ విషయంలో రతన్‌జీ ఈ వ్యాఖ్యలు చేయడానికి కారణమని అంటున్నారు.

బులియన్ ధరలు మరింత పైకే



కిలో వెండి రూ.1.25 లక్షలు!
రూ.లక్ష దాటనున్న పసిడి ధర

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు ఇప్పట్లో దిగొచ్చే సూచనలు కనిపించడం లేదు. కిలో వెండి ధర ఇప్పటికే రూ.లక్షకు చేరువైంది. పది గ్రాముల పసిడి ధరా రూ.80,000కు దగ్గరలో ఉంది. వీటి ధరలు మరింత పెరిగి వచ్చే దీపావళి లేదా 2026 జనవరి నాటికి కిలో వెండి ధర రూ.1.25 లక్షలకు, 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.లక్షకు చేరే అవకాశం ఉందని బ్రోకరేజీ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ (ఎంఓఎఫ్ఎస్ఎల్) ఒక నివేదికలో తెలిపింది. ఈ సంవత్సరం ఇప్పటికే మన దేశంలో వెండి 40 శాతం, పసిడి 30 శాతానికిపైగా లాభాలు పంచాయి. వచ్చే 12-15 నెలల్లో బంగారం, వెండి ధరలను ఈ కింది అంశాలు ముందుకు నడిపిస్తాయని ఎంఓఎఫ్ఎస్ఎల్ అంచనా.

వడ్డీ రేట్ల కోతలు: అమెరికా ఫెడ్ రిజర్వ్, ఈసీబీ, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీఓఈ)తో సహా ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ఇప్పటికే వడ్డీ రేట్ల కోత ప్రారంభించాయి. ఆర్‌బీఐ కూడా త్వరలోనే ఇందుకు సిద్ధమవుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించినప్పుడల్లా బంగారం, వెండి ధరలు పెరగడం సాధారణంగా జరిగే విషయం.

డిమాండ్: కొవిడ్ ప్రభావం నుంచి కోలుకున్నా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇంకా అస్తవ్యస్తంగానే ఉంది. ప్రపంచంలో రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ చైనా ఇంకా ఆపసోపాలు పడుతోంది. జర్మనీ, జపాన్ ఆర్థిక వ్యవస్థలైతే మాంద్యానికి చేరువలో ఉన్నాయి. ఈ అనిశ్చితుల నేపథ్యంలో చైనాతో సహా ప్రధాన కేంద్ర బ్యాంకులు తమ ఫారెక్స్ నిల్వల్లో భాగంగా పెద్ద మొత్తంలో బంగారం నిల్వలు పెంచుకుంటున్నాయి. పారిశ్రామిక అవకాశాలూ తోడవడంతో అంతర్జాతీయ మార్కెట్లో వెండి ధర కూడా చుక్కలంటుతోంది.

స్టాక్ మార్కెట్ అనిశ్చితి: దాదాపు రెండేళ్లపాటు రేసు గుర్రాల్లా పరుగెత్తిన దేశీయ స్టాక్ మార్కెట్లు ఇప్పుడు ఆపసోపాలు పడుతున్నాయి. దీంతో లాభాల సంగతి దేవుడెరుగు, పెట్టుబడుల విలువ తగ్గకుండా ఉంటే చాలని రిటైల్ మదుపరులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం, వెండి వైపు మళ్లుతున్నారు. వీటి ధరల పెరుగుదలకు ఇది కూడా ప్రధాన కారణం.

అంతర్జాతీయ ఉద్రిక్తతలు: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇంకా రావణ కాష్టంలా రగులుతూనే ఉంది. ఇజ్రాయెల్-హెజ్బొల్లా-ఇరాన్ వైరం ఇందుకు మరింత ఆజ్యం పోస్తోంది. ఈ నేపథ్యంలో చమురు సెగ ఎక్కడ కొరలు చాస్తుందోనని భారత్‌తో సహా అనేక దేశాలు వణికి పోతున్నాయి. బంగారం, వెండి ధరల పెరుగుదలకూ అంతర్జాతీయ ఉద్రికత్తలు మరింత పొగ పెడుతున్నాయి.

రూపాయి పతనం: అమెరికా డాలర్‌తో మన రూపాయి మారకం రేటు గింగిరాలు పోతోంది. ఇప్పటికే ఒక డాలర్‌కు రూ.84 స్థాయికి పడిపోయింది. డాలర్‌తో రూపాయి మారకం రేటును రూ.84 దిగువన నిలబెట్టేందుకు ఆర్‌బీఐ ఈ సంవత్సరం ఇప్పటికే తన ఫారెక్స్ నిల్వల నుంచి 3,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.52 లక్షల కోట్లు) వరకు ఖర్చు చేసింది. అయినా డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనమవుతూనే ఉంది. త్వరలోనే ఇది రూ.84.25ను తాకే అవకాశం ఉందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ అంశం కూడా బంగారం, వెండి ధరలు మరింత పెరిగేలా చేస్తోంది.

23,750 దిగువన బేరిష్
(అక్టోబరు 28-నవంబరు 1 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ గైడ్

నిఫ్టీ గత వారం 24,978-24,074 పాయింట్ల మధ్యన కదలాడి 673 పాయింట్ల నష్టంతో 24,181 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,750 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

1 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,331, 24,555, 24,780, 25,205 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 24,500 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 23,750
నిరోధ స్థాయిలు: 24,400, 24,500, 24,600 (24,300 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 23,950, 23,850, 23,750 (24,050 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	545
వరంగల్	522	గోదావరి	540
చిత్తూరు	578	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	120
వరంగల్	120	గుంటూరు	123
కరీంనగర్	120	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	126
కర్నూలు	120	నెల్లూరు	126
విశాఖపట్నం	105	అనంతపురం	126
గోదావరి	120		

కీలక మద్దతు స్థాయి 24,000
టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో కీలక నిరోధం 25,000 వద్ద విఫలమై తదుపరి నాలుగు సెషన్లలోనూ డౌన్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ 673 పాయింట్ల భారీ నష్టంతో వారం కనిష్ఠ స్థాయి 24,180 వద్ద ముగిసింది. నాలుగు వారాల క్రితం ప్రారంభమైన డౌన్‌ట్రెండ్‌లో గరిష్ఠ స్థాయి 26,250 నుంచి 2,100 పాయింట్ల మేరకు నష్టపోయింది. మిడ్ క్యాప్-100 ఇండెక్స్ కూడా 3,370 పాయింట్ల మేరకు భారీగా నష్టపోయింది. గత కొద్ది వారాల్లో ఈ సూచీ 6,000 పాయింట్లు దిగజారింది. స్మాల్‌క్యాప్-100 సూచీ కూడా 1,230 పాయింట్ల మేరకు నష్టపోయింది. ఈ రెండు సూచీలు కూడా రెండు వారాల్లో కనివిని ఎరుగని నష్టాన్ని చవిచూశాయి. నిఫ్టీ ప్రస్తుతం మానసిక అవధి, కీలక మద్దతు స్థాయి 24,000కి చేరువవుతోంది. గత జూన్, ఆగస్టు నెలల్లో ఇక్కడ బలమైన బాటమ్‌లు ఏర్పడ్డాయి. ఇక్కడ నిలదొక్కుకుని పాజిటివ్ ట్రెండ్‌లోకి ప్రవేశించాల్సి ఉంది.

బుల్లిష్ స్థాయిలు: సానుకూల ట్రెండ్ కోసం నిఫ్టీ తొలుత నిలదొక్కుకుని కన్సాలిడేట్ కావాలి. మార్కెట్ తీవ్ర ఆటుపోట్లలో ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ప్రధాన నిరోధం 24,300 కన్నా పైన నిలదొక్కుకోవాల్సి ఉంది. మరో ప్రధాన స్వల్పకాలిక నిరోధం 24,550.

బేరిష్ స్థాయిలు: ప్రపంచ మార్కెట్లలో శుక్రవారం నాటి బలహీనత కారణంగా ఈ వారం బలహీనంగానే ప్రారంభం కావచ్చు. మరింత బలహీనతను నివారించుకోవాలంటే ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 24,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. ఇక్కడ స్వల్పకాలిక కన్సాలిడేషన్ ఉండవచ్చు. విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా బలమైన డౌన్‌ట్రెండ్‌ను సాధించి 1,300 పాయింట్ల మేరకు నష్టపోయి చివరికి 50,780 వద్ద ముగిసింది. గత కొద్ది వారాల్లో ఈ సూచీ 4,000 పాయింట్ల వరకు నష్టపోయి మానసిక అవధి 50,000 చేరువకు వచ్చింది. ప్రధాన నిరోధం 51,000. పాజిటివ్ ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. 50,000 వద్ద విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది.

పాటర్న్: ట్రెండ్‌లో సానుకూలత కోసం 24,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన ప్రధాన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకుని తీరాలి. మార్కెట్ గత వారం 100 డిఎంఏ కన్నా దిగువకు వచ్చింది. ఆర్ఎస్ఐ సూచీల ప్రకారం మార్కెట్ స్వల్పకాలిక ఓవర్‌సోల్డ్ స్థితికి చేరువవుతోంది. కనిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ ఉండవచ్చుననేందుకు ఇది సంకేతం.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,240, 24,300
మద్దతు	24,060, 24,000

అప్రమత్తతే మేలు!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ఒక దిశ వస్తేనే కానీ మూమెంటమ్ మారటం కష్టం. ఇజ్రాయెల్, ఉక్రెయిన్ యుద్ధం మళ్లీ కొత్త మలుపులు తీసుకుంటే, అంతర్జాతీయంగా రాజకీయ పరిణామాలు మారితే మాత్రం మార్కెట్లు మరింతగా పడిపోవచ్చు. ఇప్పటికే బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లు నిఫ్టీ, సెన్సెక్స్ జీవితకాల గరిష్ఠాల నుంచి 8 శాతం మేరకు పతనమయ్యాయి. ప్రస్తుతం సూచీలకు మద్దతు లభించటం అత్యంత ఆవశ్యకం. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ మారితేనే కొనుగోళ్లకు ఆస్కారం ఉంటుంది.

స్టాక్ రికమండేషన్స్

థర్మాక్స్ : జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 30 శాతం మేర దిద్దుబాటు జరిగిన ఈ షేరుకు రూ.4,250 వద్ద గట్టి మద్దతు లభించింది. సెప్టెంబరులో మూమెంటమ్ లభించింది. నెగటివ్ మార్కెట్లోనూ ఈ షేరు నిలకడగా కదలాడుతోంది. గత శుక్రవారం ఈ షేరు 4.77 శాతం లాభంతో రూ.5,431 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.5,300 శ్రేణిలో ప్రవేశించి రూ.5,450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.5,260 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మ్యాక్స్ హెల్త్: మదుపరులు లాభాలు స్వీకరించటం, మార్కెట్ సెంటిమెంట్ ప్రతికూలంగా ఉండటంతో ఈ షేరు 20 శాతం మేర పతనమైంది. ప్రస్తుతం ఈ షేరు సైడ్‌వేస్‌లో చలిస్తోంది. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్న అంచనాలు కనిపిస్తున్నాయి. గత శుక్రవారం 3.51 శాతం లాభంతో రూ.938 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.930 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.900 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ ఫార్మా: నిఫ్టీ, సెన్సెక్స్‌తో పోల్చితే ఈ షేరు మెరుగ్గా కదలాడుతోంది. ఈపీఎస్, అమ్మకాలు క్రమంగా పెరుగుతుండటం శుభసూచకం. సెప్టెంబరు త్రైమాసికంలో మంచి ఫలితాలు విడుదల చేయవచ్చనే అంచనాలున్నాయి. గత శుక్రవారం ఈ షేరు 3.36 శాతం లాభంతో రూ.3,432 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,400 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.3,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించచ్చు. అయితే రూ.3,370 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

యాక్సిస్ బ్యాంక్: ఏడాది గరిష్ఠ స్థాయి నుంచి 12 శాతం మేర పతనమైన ఈ షేరు ప్రస్తుతం కీలక మద్దతు స్థాయిల వద్ద కదలాడుతోంది. వాల్యూమ్, మూమెంటమ్ క్రమంగా పెరుగుతోంది. ఆర్థిక ఫలితాలు ఇచ్చిన కిక్కుతో గత శుక్రవారం 1.85 శాతం లాభంతో రూ.1,189 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో.. మదుపరులు రూ.1,180 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,160 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

దివీస్ లేబొరేటరీస్: నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా ట్రేడవుతున్న ఈ షేరు ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరలో లభిస్తోంది. 10 శాతం మేర దిద్దుబాటు జరగటంతో ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం ఈ షేరు స్వల్ప లాభంతో రూ.5,780 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.5,750 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.6,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.5,707 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 28-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 211
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
వరంగల్

ఏఆర్ ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్ సహా
విధుల నుంచి 10 మంది తొలగింపు!

- ఉద్యోగాల నుంచి తప్పించిన టీజీఎస్పీ
- నిబంధనలకు విరుద్ధంగా ఆందోళనలతోనే..
- ఆర్టికల్ 311 ప్రకారం తొలగించినట్లు వెల్లడి
- సిబ్బంది నిరసనలపై కొనసాగుతున్న విచారణ
- త్వరలో మరికొందరిపైనా చర్యలు? 9


మామునూరు బెటాలియన్ సిబ్బంది నిరసన (ఫైల్)


జన్వాడ ఫాంహౌస్ వద్ద పోలీసులు


రాజ్ పాకాల


విజయ్ మద్దూరి

కేటీఆర్ బావమరిది పార్టీలో డ్రగ్స్!

- రాజ్ పాకాల సన్నిహితుడు విజయ్‌కి కొకైన్ పాజిటివ్
- రాజ్ ఇస్తేనే తీసుకున్నా: విజయ్
- జన్వాడ ఫాంహౌస్‌లో అనుమతి లేకుండానే పార్టీ
- స్థానికుల ఫిర్యాదుతో ఎస్‌వోటీ పోలీసుల దాడి
- పార్టీలో 22 మంది పురుషులు.. 16 మంది మహిళలు
- భారీగా విదేశీ మద్యం స్వాధీనం
- పోలీసుల అదుపులో విజయ్.. పరారీలో రాజ్ పాకాల
- కొకైన్ ఎలా వచ్చిందో ఆరా

శంకర్‌పల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇచ్చిన పార్టీలో డ్రగ్స్ వాడినట్లు తేలడం కలకలం సృష్టించింది! రాజ్ పాకాల సన్నిహితుడు, వ్యాపార భాగస్వామి అయిన విజయ్ మద్దూరి కొకైన్ తీసుకున్నారు! తొలుత బుకాయించిన విజయ్.. మూత్ర పరీక్షలో కొకైన్ తీసుకున్నట్లు తేలడంతో రాజ్ (రాజేంద్ర ప్రసాద్) పాకాల ఇస్తేనే తాను డ్రగ్ తీసుకున్నట్లు చెప్పడం గమనార్హం! విజయ్ వాంగ్మూలం ఈ కేసులో కీలకంగా మారనుంది. పార్టీలో కొకైన్ ఎలా వచ్చిందనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన జన్వాడ 'ఫాంహౌస్ పార్టీ'కి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. తమ ప్రాంతంలో పెద్దపెద్ద శబ్దాలతో కొందరు పార్టీ చేసుకుంటూ ఇబ్బంది కలిగిస్తున్నారంటూ రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడకు చెందిన

మిగతా 11వ పేజీలో...

11

- తాగి దొరికిన దొంగలు.. ప్రభుత్వాన్ని బద్నామ్ చేస్తున్నారు: పొన్నం
- కేటీఆర్ సహా మిగతావారికీ పరీక్షలు చేయాలి: ప్రభుత్వ విప్ శ్రీనివాస్

కుటుంబ ఫంక్షన్‌ను రేవ్ పార్టీగా చిత్రీకరించే కుట్ర

- రేవంత్ అవినీతిని ఎత్తిచూపినందుకే..
- డ్రగ్స్ దొరకకుండానే కేసులా: కేటీఆర్
- ఫాంహౌస్ ఘటన పక్కా స్కెచ్: హరీశ్‌రావు
- రేవ్‌పార్టీపై సమగ్ర దర్యాప్తు జరపాలి
- ఫాంహౌస్ ఎవరిదైనా వదలొద్దు: కిషన్‌రెడ్డి
- బావమరిది ఫంక్షన్‌కి కేటీఆర్ వెళ్లలేదా?
- సుద్దపూస.. ఇప్పుడేమంటాడో?: సంజయ్

11

నాయకుల భూదాహం..
అధికారుల భూదానం

ఇద్దరు బడా నేతల కనుసన్నల్లో హైదరాబాద్ శివార్లలో భారీ స్కాం

- రూ.200 కోట్ల విలువైన 39.18 ఎకరాల భూదాన భూములకు రెక్కలు
- ధరణిలో లొసుగులతో రికార్డుల్లో పట్టాభూములుగా మారిన వైనం
- మరో 71 ఎకరాల స్వాహాకూ స్కెచ్..
- ఆ భూముల్నీ కలుపుకొని ప్రహరీ
- గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూపందేరంపై రేవంత్ సర్కారు ఆరా


రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌లో భూదాన్ భూముల్లో నిర్మించిన ప్రహరీ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

నాగారం భూదాన భూముల వ్యవహారం సద్దుమణగక ముందే తాజాగా మరో భూదాన భూముల కుంభకోణం తెరపైకి వచ్చింది. హైదరాబాద్ శివార్లలోని 111.11 ఎకరాల భూదాన భూములపై కన్నేసిన బడా నేతలు.. అందులో 39.18 ఎకరాల రికార్డులు తారుమారు చేసి పట్టా భూములుగా మార్పించేశారు. ఈ భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.200 కోట్ల దాకా ఉంటుంది. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి స్వగ్రామమైన కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో ఈ భూకుంభకోణం జరగడం గమనార్హం. గత ప్రభుత్వంలో పెద్దతలలుగా పేరొందిన ఇద్దరు నేతల పేర్లు ఇందులో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కొన్ని దశాబ్దాలుగా భూదాన భూములుగా ఉన్న ఈ భూములు ఎన్నికలకు ముందు పట్టా భూములుగా మారిన వైనం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో.. ప్రభుత్వం అప్రమత్తమైంది. తక్షణమే దీనిపై నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో.. జిల్లా యంత్రాంగం రికార్డుల పరిశీలన మొదలు పెట్టింది. గత ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో జరిగిన ఈ భూకుంభకోణానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో సర్వే నంబర్లు 6/1, 147, 167/1, 167/9, 453/454, 444, 573, 574, 575, 455, 576, 129, 130, 161లో 111.11 ఎకరాల భూదాన భూములు

మిగతా 12వ పేజీలో...

ధరణితో రెక్కలు

రెవెన్యూ రికార్డులు పకడ్బందీగా ఉంచేందుకు ధరణిని తీసుకువచ్చామని గత సర్కారు చెప్పినప్పటికీ.. దాంట్లో పలు లోపాలు బయటపడ్డాయి. ధరణికి ముందు.. నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్, భూదాన భూముల క్రయవిక్రయాలకు అనుమతి లభించేది కాదు. కానీ, ధరణిలో భూముల స్వభావం కాలమ్‌లో ఇవి భూదాన్‌భూములు అని ఉన్నా క్రయవిక్రయాలు జరుగుతుండడం గమనార్హం. తిమ్మాపూర్ కుంభకోణమే దీనికి నిదర్శనం. ఈ అక్రమానికి.. అప్పటి అధికారులు సహకరించారు. ఇక్కడ కొంత భూమిని నేరుగా, మరికొంత భూమిని రికార్డుల్లో తప్పులు సవరించాలంటూ దరఖాస్తు చేయించి, ఆగమేఘాలపై పట్టా భూములుగా మార్చేశారు.



30 దాటితే.. బీపీ, షుగర్ ముప్పున్నట్లే!

- 23 లక్షల మందికి అధిక రక్తపోటు
- 12 లక్షల మందికి మధుమేహం
- ఎన్‌సీడీ స్క్రీనింగ్‌లో తేలిన వైనం
- ప్రభుత్వానికి వైద్యశాఖ నివేదిక
- అత్యధిక కేసులు మెదక్ జిల్లాలో..
- తర్వాత నిర్మల్, కామారెడ్డి, నల్లగొండ
- జీవనశైలితో మార్పులతోనే సమస్యలు

12

యుద్ధమా? దాడులతో సరా?

- ఇరాన్-ఇజ్రాయెల్ సంఘర్షణ పూర్తిస్థాయి సమరంగా మారుతుందా?
- కాల్బలం, యుద్ధట్యాంకుల్లో ఇరాన్ పైచేయి
- టెక్నాలజీ, గగనతల రక్షణలో ఇజ్రాయెల్ టాప్
- ఇప్పటికే ఏడు ముఖాల పోరుతో సతమతం
- ఆ దేశ ప్రజల్లో యుద్ధం పట్ల వ్యతిరేకత
- ఇజ్రాయెల్ రక్షణ సామర్థ్యాన్ని గుర్తించిన ఇరాన్
- యుద్ధం ముప్పు తక్కువని నిపుణుల అంచనా
- ప్రతీకార దాడులతోనే సరిపెట్టే అవకాశం!

"తమలపాకుతో నువ్వొకటిస్తే.. తలుపుచెక్కతో నే రెండిస్తా".. అనే సామెత చందంగా అక్టోబరు 1న ఇరాన్ తమ దేశంపై క్షిపణుల వర్షానికి ప్రతిగా ఇజ్రాయెల్ 100 ఫైటర్ జెట్లతో వెళ్లి తీవ్ర ప్రతిదాడి చేసి విధ్వంసం సృష్టించడం ఎవరినీ ఆశ్చర్యపరచలేదు! ఈ దెబ్బతో.. ఇరాన్ క్షిపణి తయారీ కేంద్రాలు మళ్లీ యథావిధిగా పనిచేయడానికి ఏడాది నుంచి రెండేళ్ల సమయం పడుతుందని అంచనా!! దీనిపై ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ స్పందిస్తూ.. తమ శక్తిని ఇజ్రాయెల్‌కు

మిగతా 10వ పేజీలో...


లెబనాన్‌లోని దహియేపై ఇజ్రాయెల్ దాడితో పెద్ద ఎత్తున లేచిన మంటలు

లక్ష్యాలన్నీ సాధించాం

- ఇరాన్‌పై దాడి గురించి నెతన్యాహు
- మన సత్తా ఇజ్రాయెల్‌కు చూపాలి..
- దాడులను తక్కువ చేసి చూడొద్దు
- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ వ్యాఖ్యలు
- గాజాపై విరుచుకపడ్డ ఇజ్రాయెల్..
- బాంబు దాడుల్లో 47 మంది మృతి

10

వైసీపీ అధినేత జగన్ సంపాదనకు నాడు తండ్రి అధికారమే పెట్టుబడి. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కంపెనీలు కబ్జా చేశారు. నాడు ప్రభుత్వం నుంచి 'మేళ్లు' పొందిన బడా పారిశ్రామిక వేత్తల నుంచి రూ.10 విలువ చేసే షేర్‌ను వందలు పెట్టి కొనేలా వాటిలో పెట్టుబడులు పెట్టించుకున్నారు. అంటే.. క్విడ్ ప్రోకో అన్నమాట. తండ్రి సీఎంగా ఉన్నప్పుడు జగన్ అక్రమార్జన కొండలా పెరగగా... ఆయనే ముఖ్యమంత్రి అయ్యాక ఏకంగా ఆకాశం వైపు దూసుకుపోయింది. నాటి జగన్ అక్రమాల గురించి 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు..

జంతర్‌మంతర్ జగన్మాయ!

దేశంలోనే రాజకీయ అక్రమ కుబేరుడు.. 20 ఏళ్లలో వేల రెట్లు పెరిగిన సంపద


2004లో ఆయన ఆస్తి రూ.1.74 కోట్లే.. 2024 ఎన్నికల అఫిడవిట్‌లో 757 కోట్లు

- మార్కెట్‌లో వాటి విలువ వేలకోట్లు
- తండ్రి సీఎంగా ఉండగా అక్రమార్జన
- సీబీఐ చార్జిషీట్లలో తీవ్ర అభియోగాలు
- జగన్ సీఎం అయ్యాక మరింత సంపద
- భార్య భారతి, పిల్లల పేరిటా పెట్టుబడులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మన దేశంలో ఎంతో మంది ముఖ్యమంత్రులు అయ్యారు. చాలామంది వారసులు రాజకీయాల్లోకి వచ్చారు. పలువురిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. కేసుల విచారణ కూడా ఎదుర్కొన్నారు. కానీ వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడు జగన్మోహన్‌రెడ్డిలా అక్రమార్జనలో ఎవరూ అంత 'ఫేమస్' కాలేదు. ఎలాంటి పదవి లేకపోయినా ఓ సీఎం కుమారుడిగా వేల కోట్ల అవినీతికి

మిగతా 12వ పేజీలో...



* (ఐటీ రిటర్నుల ప్రకారం) ** ఎన్నికల అఫిడవిట్ ప్రకారం



డిజిటల్ అరెస్టు.. అబద్ధం

- చట్టంలో అసలు ఆ ప్రక్రియ లేనే లేదు
- ఏ ప్రభుత్వ సంస్థా ప్రజల్ని బెదిరించదు
- ఆన్‌లైన్ మోసగాళ్ల బారిన పడొద్దు
- ఆగి.. ఆలోచించి.. నిర్ణయం తీసుకోవాలి
- 'మన్ కీ బాత్'లో ప్రజలకు ప్రధాని పిలుపు
- సైబర్‌నేరాలపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేసిన ట్వీట్‌ను ప్రస్తావించిన మోదీ
- సిద్దిపేట జిల్లా చేర్యాల నకాశీ కళాకారుడు ధనాలకోట వైకుంఠంపై ప్రశంసలు

10



రాజకీయాల్లో పిల్లాడినే.. బరిలో భయపడేదే లేదు

- బీజేపీ సైద్ధాంతిక ప్రత్యర్థి.. డీఎంకే రాజకీయ ప్రత్యర్థి
- ద్రవిడ, తమిళ జాతీయవాద సిద్ధాంతాలు పాటిస్తాం
- పెరియార్, కామరాజ్‌ల వారసత్వాన్ని కొనసాగిస్తాం..
- ప్రజలపై విశ్వాసంతో కెరీర్‌ను పీక్స్‌లో వదిలేసి వచ్చా
- విల్లుపురం మహానాడులో టీవీకే అధినేత విజయ్
- పార్టీ తొలి బహిరంగ సభకు భారీగా జనం హాజరు

10


సదర్‌లో గోవుతో సీఎం రేవంత్, మాజీ మంత్రి రఘువీరా


ఎన్ని శక్తులు అడ్డుపడినా మూసీ ప్రక్షాళన ఆగదు

- పునరుజ్జీవానికి యాదవులు సహకరించాలి
- ఇకపై ఏటా అధికారికంగా సదర్ సమ్మేళనం
- ఈ ఉత్సవాలు తెలంగాణకు గర్వకారణం
- సదర్ సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డి
- చేతిలో హాకీ స్టిక్ పట్టుకొని స్టెప్పులు

9

పరిమాణ చరిత్రతో మొదలై పరిణామ చరిత్రకు..

చరిత్రలో తమకు లభించిన స్థానమేమిటన్న ప్రశ్న దాదాపు అన్ని అస్తిత్వ సమూహాలూ వాదాలను నిర్మించుకోవడానికి కారణమైంది. తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమం కూడా ఆ ప్రశ్న వేసుకుంది. సాహిత్యచరిత్రలో తమ ప్రాతినిధ్యం గురించి మరింత ఎక్కువగా మథన పడింది. తెలంగాణ ప్రాచీన సాహిత్యాన్ని చరిత్రీకరించి 'ముంగిలి' లో నిలబెట్టిన కవి, రచయిత డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి.. తెలుగు సాహిత్యచరిత్రల రచనాచరిత్ర అధ్యయనంలో భాగంగా కె.శ్రీనివాస్ ఆయనతో జరిపిన సంభాషణ ఇది.



తెలుగుసాహిత్యచరిత్ర మీద సమగ్రమైన తెలంగాణవాద విమర్శ ఉన్నదా?

సమగ్రమో కాదో కానీ, అలాంటి విమర్శ ఖచ్చితంగా ఉంది. విస్మృతి, వివక్ష, కాంట్రిబ్యూటరీ కోణాల నుంచి, తనదైన ప్రస్థాన కోణం నుంచి, ఆ విమర్శ ఉన్నది.

1. మొదటి విమర్శ సురవరం ప్రతాపరెడ్డిది. గోలకొండ కవుల సంచిక సంపాదకీయంలో దాన్ని చూడవచ్చు. 'సవ్యాంధ్ర సాహిత్య వీథులు'పై ఆయన చేసిన సమీక్షలోనూ ఉంది. 2. దేవులపల్లి రామానుజ రావు వ్యాసాల్లో ఉంది. 3. వానమామలై వరదాచార్యులు రాసిన ఒక వ్యాసంలో ఉంది. 4. మీరు, నేను, సంగిశెట్టి శ్రీనివాస్, కాసుల ప్రతాపరెడ్డి రాసిన వ్యాసాల్లో ఉంది. వీటన్నిటినీ క్రోడీకరిస్తే అది సమగ్ర తెలంగాణ వాద విమర్శ అవుతుంది.

తెలంగాణ రచయితలకు తెలుగు సాహిత్యచరిత్రలో లభించిన పరిగణన ఎటువంటిది?

ప్రాచీన సాహిత్యంలో పాల్కురికి, పోతన, గోనబుద్ధారెడ్డిలాంటి కొద్దిమందే పరిగణన పొందిండ్రు. నూతన కవి సూరన, చరిగొండ ధర్మన, కాణాదం పెదసోమన, భైరవ కవి, తెలంగాణ నుంచే అత్యధికంగా వెలువడిన కులపురాణాలు, వీరగాథలు, కీర్తన, తత్వకవులు పరిగణన పొందలేదు. ఆధునిక సాహిత్యంలో, కొద్దిగా సురవరం, వట్టికోట, కొంత విస్తృతంగా కాళోజీ, దాశరథి, సినారె లాంటి కొద్దిమందే పరిగణన పొందిండ్రు. 1965 నుంచి ముఖ్యంగా 1970 నుంచి తగినంతగా, తగినంత మంది పరిగణన పొందిండ్రు. వానమామలై సోదరులు, ఒద్దిరాజు సోదరులు, మామిళ్ల రామగౌడ్, గంగుల శాయిరెడ్డి, భాస్కరభట్ల లాంటి చాలా మంది ఊసే లేకుంట పోయిండ్రు.

తెలంగాణ స్థలాలు, తెలంగాణ కథావ్యక్తులు, తెలంగాణ రాజ్యాలు సాహిత్యచరిత్రలో ఎటువంటి ప్రాతినిధ్యాన్ని పొందాయి?

"ఇప్పటికీ తెలంగాణకు చారిత్రక ప్రతీకలు కొదవే. ముఖ్యంగా చారిత్రక నాయకులు, యుద్ధాలు, ఘనమైన చారిత్రక దశ వంటివే లేవు" అని దాగ్మార్ బెర్న్ స్టార్ఫ్ అనే ప్రసిద్ధ పరిశోధకుడు రాసినాడు. తెలంగాణ తగినంత ప్రాతినిధ్యం పొందలేదని చెప్పటానికి ఈ మాటలు గొప్ప నిదర్శనం.

'విజయనగరం' అంత పొందకపోయినా ఓరుగల్లు ఒక్కటే తగినంత ప్రాచుర్యాన్ని పొందింది. అమరావతి ప్రాచుర్యం కోటిలింగాలకు దక్కలేదు. వేములవాడ, రాచకొండ, దోమకొండ, పాపన్న పేట, హైద్రాబాద్ (గోల్కొండ).. ఇలాంటి వాటి సంగతి సరే సరి.

ప్రతాపరుద్రుడు, రుద్రదేవుడు, గణపతిదేవుడు, అనపోతా నాయకుడు, లింగమనీడు, కులీ కుతుబ్ షా ఇలాంటి వారికి రెడ్డి రాజులకు లభించిన స్థానం కూడ లభించలేదు. నా రచనలు 'ముంగిలి', ' తెలంగాణ చరిత్ర' ల ముగింపు అధ్యాయాలలో ఈ అంశాలను వివరించాను.

తెలంగాణ వైపు నుంచి సాహిత్యచరిత్ర ఎట్లా ఉండాలని భావిస్తారు?

తెలుగు సాహిత్యాన్ని తెలంగాణ సాహిత్యం ఎట్లా సుసంపన్నం చేసిందీ తెలుపుతూనే, అంటే, కాంట్రిబ్యూటరీ, అంటే దోహదకారి చరిత్రగా ఉంటూనే తెలంగాణ చేసిన తనదైన ప్రత్యేక ప్రస్థానాన్ని తెలిపేదిగా తెలంగాణ వైపు నుంచి సాహిత్యచరిత్ర ఉండాలని అనుకుంటున్న.

సామాజిక, తదితర అస్తిత్వాల నుంచి సాహిత్యచరిత్రపై అనేక ప్రశ్నలు వచ్చాయి. తెలంగాణవాదం నుంచి తగినన్ని ప్రశ్నలు వచ్చాయని భావిస్తున్నారా?

వచ్చినయి కదా! మీ మొదటి ప్రశ్నకు చెప్పిన జవాబులోనే ఆ ప్రశ్నలు కూడా ఇమిడి ఉన్నాయి. అయితే, ప్రశ్నల స్వభావంలో మౌలికమయిన భేదం ఉంది. స్త్రీ, దళిత, బహుజన అస్తిత్వాల ప్రశ్నలు వివక్షకు, అణచివేతకు సంబంధించినవి. అవి కేవలం సాహిత్య చరిత్ర కారులపై ఎక్కుపెట్ట బడినవి కావు. సాహిత్య సృజనకారులతో సహా మొత్తం సమాజంపై ఎక్కుపెట్టబడినవి. అందువల్ల, వాట్లలో తీవ్రత ఉంటుంది. అది కూడా స్ట్రయికింగ్ గా ఉంటుంది.



తెలంగాణవాద ప్రశ్నలు చరిత్రకారులపై ఎక్కుపెట్టినవి. అందువల్ల అంత తీవ్రత కనిపించదు. ప్రశ్నలే లేనట్టు అనిపిస్తది. అయితే, వర్తమానానికి సంబంధించిన ప్రశ్నల్లో ఆ తీవ్రత ఉన్నది.

తెలంగాణ కవులు, పండితుల జీవితాలను, కావ్యాలను లేదా రచనలను గురించి రాసే పుస్తకాలు సాహిత్యచరిత్ర అవుతాయా?

అవుతయి. ఏ భాషా సాహిత్యచరిత్ర నిర్మాణ క్రమంలోనైనా తొలిదశలో కవుల చరిత్రలే సాహిత్యచరిత్రలు. ముందు ఎంతమంది కవులున్నారో, ఎన్ని రచనలున్నవో బయటికి రావాలి గదా? సాహిత్య పరిణామ చరిత్రనే సాహిత్యచరిత్ర అని మీ ఉద్దేశం కావచ్చు. అది అనంతర దశలో సాధ్యం కావచ్చునేమో. ఎందుకంటె తొలికవుల చరిత్ర (కావలి రామస్వామి, దక్కన్ కవుల చరిత్ర, (1829) వచ్చి దాదాపు 200 సంవత్సరాలయినా ఇప్పటికీ సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర రాలేదు.



> **తెలుగు సాహిత్యాన్ని తెలంగాణ సాహిత్యం ఎట్లా సుసంపన్నం చేసిందీ తెలుపుతూనే, అంటే, కాంట్రిబ్యూటరీ, అంటే దోహదకారి చరిత్రగా ఉంటూనే తెలంగాణ చేసిన తనదైన ప్రత్యేక ప్రస్థానాన్ని తెలిపేదిగా తెలంగాణ వైపు నుంచి సాహిత్యచరిత్ర ఉండాలని అనుకుంటున్న.**

'ముంగిలి'ని మీరు కవుల చరిత్ర, పాలకుల యుగవిభజన కలిసిన ధోరణిలో రాశారు. వస్తు, ప్రక్రియ, శిల్ప ధోరణుల రీత్యా తెలంగాణా సాహిత్య చరిత్ర గతిని నిర్వచించి, నిర్మించడం సాధ్యమేనా, మీకు ఆలోచన ఉందా?

మొన్నటిదాకా వచ్చిన చరిత్రలు సాహిత్య చరిత్రలు అన్నీ సాధారణీకరించిన ప్రధాన కథనాలే, మహా కథనాలే. వస్తు ప్రక్రియ, శిల్ప తదితర ప్రాతిపదికన వచ్చిన సాధారణ (Generalise చేసిన) పరిణామ చరిత్రలే. వీటివల్ల ప్రాదేశిక నిమ్న శ్రేణుల తదితరాలకు సంబంధించిన ఎన్నో విస్మరణలు జరిగినవి. వాటిలో నిర్దిష్టతకు విభిన్నతలకు స్థానం లభించలేదు. అందుకే వాటిని తిరస్కరించి సబాల్టరన్, విభిన్నతల, నిర్దిష్టతల, అట్టడుగు నుంచి చరిత్ర రచనల (History from below) అధ్యయనాలు ముందుకు వచ్చినవి. ముందుగా తెలంగాణ నుంచి వచ్చిన సాహిత్యమంతా వెలుగులోకి రావాలె. అలా జరగాలంటే ఏ ప్రాతిపదికన చేసిన యుగ విభజనను అనుసరించినా ఏదో ఒక విస్మరణ జరుగుతుంది. అంటే ఒక విస్మరణను సవరించబోయి మరొక విస్మరణకు కారకులమౌతం. అలా జరగకూడదనే రాజవంశ యుగాలను (ఇందులో కూడా కొన్ని విస్మరణలున్నవి) తీసుకొని 'ముంగిలి'లో కాలక్రమంగా కవుల చరిత్రను రాసిన. ఏ భాష, ప్రాంత సాహిత్య చరిత్ర నిర్మాణంలోనైనా తొలుత జరగాల్సింది ఇదే. అంతేకాక జిల్లాల వారీగా నిమ్నశ్రేణుల వారీగా ప్రక్రియల వారీగా తెలంగాణ సాహిత్యమంతా వెలుగులోకి రావాలె. అది రికార్డ్ కావాలె. అప్పుడు మాత్రమే తెలంగాణ సాహిత్య చరిత్ర గతిని నిర్వచించి సమగ్ర సాహిత్య చరిత్రను నిర్మించడం సాధ్యం అవుతుంది. అప్పుడైనా ఏదో ఒక అంశం ప్రాతిపదికన 'గతి' (పరిణామ సూత్రం)ని నిర్వచించడం సరి అయింది కాదు.

ప్రాదేశిక సాహిత్య చరిత్రలో ఇతర స్థానిక భాషల సాహిత్యాలు కూడా భాగమేనా?

ఒక ప్రాదేశిక విభాగంలో ప్రధాన భాషతో పాటు సంస్కృతం, ఉర్దూ, కోయ, గోండి లాంటి భాషలు, వాటి సాహిత్యం ఉంటయనేది తెలిసిన విషయమే. వీటన్నిటి సాహిత్యచరిత్రనే మీరు 'సమగ్ర సాహిత్యచరిత్ర' గా ఉద్దేశిస్తే, అలాంటి సాహిత్య చరిత్ర అవసరమే.

ఒక ప్రాంతంలో ప్రధాన భాషకు చెందిన సాహిత్యంలో జరిగే పరిణామమే ఆ ప్రాంత ఇతర భాషా సాహిత్యాల్లో జరగొచ్చు, కొన్ని సందర్భాల్లో జరగకపోవచ్చు. వాటి ప్రత్యేకత వాటికి ఉండొచ్చు. అందువల్ల అన్ని భాషా సాహిత్యాల సమగ్ర చరిత్ర అవసరం.

సాహిత్య చరిత్రకారుడిగా, తెలంగాణ సాహిత్య పరిణామ క్రమంలో ఏదైనా ప్రత్యేకమైన క్రమానుగత సరళిని గుర్తించారా?

సంస్కృతాంగ్ల ప్రభావంతో కాకుండా స్థానిక సామాజిక పరిస్థితుల నుండి సాహిత్యం ఉత్పన్నం కావడం ఇక్కడి ఒకానొక ప్రత్యేకత.

ప్రఖ్యాతంగా ఉన్న యుగవిభజనకు భిన్నమైన విభజనను ప్రతిపాదిస్తారా?

ప్రక్రియను బట్టి, కవులను బట్టి చేసిన విభజన అవ్యాప్తి, అతివ్యాప్తి దోషాలకు గురైందనే విషయం తెలిసిందే. యుగ సాహితీ స్వభావాన్ని సూచించక పోయినా, రాజ్య వంశాలను అనుసరించి చేసిన విభజననే కొంత అనుకూలమైనది. తెలుగు సాహిత్యచరిత్రల్లో చేసిన ఏ విభజనా మిగతా ప్రాంతాలకు, ముఖ్యంగా తెలంగాణకు వర్తించదు.

తెలంగాణ సాహిత్య చరిత్రకు నేను ఒక విభజన చేశాను. యుజిసి కి అందించిన మేజర్ రీసర్చి ప్రాజెక్టు ప్రతిపాదనలో దాన్ని పేర్కొన్నాను. ప్రాచీన సాహిత్యాన్ని ప్రధాన రాజవంశాల యుగాలుగా విభజించాను. ఆధునికత సాహిత్యాన్ని నవ్య ప్రజాస్వామిక, అభ్యుదయ, అభ్యుదయానంతర, విప్లవ, విప్లవ కవిత్వానంతర, అస్తిత్వవాద యుగాలుగా ప్రతిపాదించాను.

ఒక భాషకు సంబంధించిన సాహిత్య చరిత్రలో ప్రాదేశిక ఉపవర్గీకరణ ఎంతవరకు సాధ్యం? రెండు లేదా మూడు లేదా అంతకంటె ఎక్కువ ప్రాంతాలలో ఉండే విభిన్నతలతో పాటు సారూప్య అంశాలను చరిత్ర రచనలో ఎట్లా నిర్వహించాలి?

చాలా గొట్టు ప్రశ్న.

వినిర్మాణ వాదం చర్చించిన అంశాలలో ఇది కూడ ఒకటి. దాన్ని మీరు 'విభిన్నత' అన్న పదం ద్వారా సూచించారు.

ఉపవర్గీకరణ సాధ్యమే. కాని దాని వల్ల ఇతర ప్రాదేశికతలకు న్యాయం చేకూరదు. వాటికి 'ఉప' శ్రేణి హోదానే లభిస్తుంది. సారూప్య అంశాలను చెప్పబోతే సాధారణీకరణ అయి కూర్చుంటుంది. విభిన్నతలు విస్మృతికి లేదా అణచివేతకు గురైతవి.

భారతదేశ చరిత్రలో భాగంగా చూసినంత కాలం దక్షిణ భారతదేశ చరిత్ర మరుగున పడే ఉంది. నీలకంఠశాస్త్రి దక్షిణ భారతదేశ చరిత్ర రాసిన తర్వాత మాత్రమే దక్షిణ భారతానికి ఎంతో కొంత గుర్తింపు వచ్చింది.

అందువల్ల, ఆయా ప్రాదేశికతల విడి విడి చరిత్రలు రాసుకోవడమే తొలుత చేయాల్సింది. తర్వాత సారూప్య అంశాలు ఒక్క చోట చేరుస్తూ అక్కడికక్కడే విభిన్నతలను ప్రత్యేకంగా ప్రస్తావించాల్సి ఉంటుంది.

ఇంటర్వ్యూ ■ కె.శ్రీనివాస్

ప్రేమలో కొన్ని తప్పులూ ఒప్పులూ

రెండు రెళ్ళు నాల్గనీ, చీకటైతే రాత్రనీ ఈ లోకంలో చెల్లుబాటయ్యే మాటలు ఎన్నైనా చెప్పచ్చు కానీ, కవిత్వ ప్రపంచంలో అడుగు పెట్టాక, గుప్పెడు పదాలు కవిత్వమెందుకు అవుతాయో, ఆ పొందికలో ప్రాణాన్ని దాచుకున్న మాట ఎక్కడుందో వివరించి చెప్పడం చాలా కష్టం. 'ప్రూఫ్ రీడింగ్' అని నందకిషోర్ రాసిన ఈ కవిత్వం, అచ్చంగా ఈ కోవలోకే చెందుతుంది. ఈ పద్యంలో మిరుమిట్లు గొలిపే పదాలు, ఉపమానాలు లేవు. హడావుడి లేదు. ఉన్నదల్లా ఒక అపురూపమైన భావం. అపూర్వమైన అల్లిక.


ప్రేమికుల కవిత్వంలో ఏ కాలాల్లోనైనా అదే ప్రేమ విన్నపం, అదే ఎడబాటు, అదే కోర్కె, మాయని అదే జ్ఞాపకం.

ప్రియ పద్యం



కానీ వ్యక్తీకరణను సంభాషణగా మార్చడం ద్వారా కవితలో కొత్తదనం తీసుకురావడమెట్లానో ఇందులో చూడగలం. భాషలో తప్పులు వెదుకుతున్న ప్రేయసిని ఆపి, ఆ తప్పులన్నీ నీ వల్లేనమ్మీ అని ఎత్తిపొడిచే ప్రియుడి అల్లరి ఈ కవిత. ఆ జవాబులొక నెపంగా మళ్ళీ తన ప్రేమని నొక్కి చెప్పి, పాత జ్ఞాపకమొకటి ఆమెలోనూ తట్టి లేపి రెచ్చగొట్టే జాణతనం ఈ కవిత. ఒత్తుగా నిండుగా విరబూసిన గులాబీని అడ్డు పెట్టుకుని తన ప్రేమనంతా మొదటి పాదంలోనూ, ఒక్కటిగా ఉండాల్సిన ఇంద్రధనుస్సు రంగులు ఎడమైతే ఎంత ఎబ్బెట్టుగా ఉంటుందో, తమ మధ్య దూరమూ అలాంటిదేనన్న ఊహని రెండో పాదంలోనూ చెప్పాడు. ఆపైన, ఆ ఎడబాటులో నుండీ ఆమెను కూడిన క్షణాలను తల్చుకుంటున్నాడు. ఆ కలిసిన క్షణాల ప్రేమ సాఫల్యతను కలగంటున్నాడు. పొద్దులు పడటమంటే, నెల తప్పడం. కడుపులో నలుసు పడటం. అది ఉత్త కలే. కానీ అందులోనే ఆ ప్రేమ జ్వరతీవ్రత ఉంది. ఆమెను కలిసిన, ఆమెతో కూడిన క్షణాలను మరపుకు తెచ్చుకోలేని అశక్తతతో నిండిన దిగులూ ఉంది. అంత దిగులుపడ్డ హృదయానికి ఊరట ఆమెదొక్క ముద్దు. ఊపిరి నిలిచేలా సుదీర్ఘమైన ముద్దిచ్చిన ప్రియురాలి ప్రేమతో లయ తప్పిన హృదయపు సౌందర్యం పరిచింది కనుకే, ఇది నాకు ప్రియమైన పద్యం.

■ మానస చామర్తి



ప్రూఫ్ రీడింగ్

"గులాబీలో ఈ ఒత్తెవర్రా పెట్టింది?"
అది ఒత్తుగా పూసిందమ్మి
"ఇంద్ర ధనుస్సు మధ్యలో ఈ ఖాళీ ఎందుకు?"
అదీ... మన ఎడబాటు గుర్తుగా...
"పద్యం పొట్టలో ఈ చుక్కేంటి మరి?"
ఊ.. నీకు పొద్దులు పడ్డట్టు కల..
"రేయ్ రేయ్... హృదయంలో ఈ దీర్ఘం?"
అది ఊపిరిదమ్మి, నువ్వు ముద్దిచ్చినప్పటిది.

■ నందకిశోర్

వీల్ చైర్...

భలే మనుషులం మనం..
ఎక్కడ వదిలేస్తే అక్కడే ఉండిపోతాం

పరుపులు, సోఫాల్లో రోజూ తనువు చాలిస్తూ
చిత్ర విచిత్ర హింసలు పొందుతుంటాం

దాటలేని దూరాల కోసం
శరీరాన్నంతా కాళ్లలోకి తెచ్చుకుంటాం
కానీ, బయలుదేరిన దగ్గరే చతికిలబడతాం

భయపెట్టే సీను వచ్చినప్పుడు
గట్టిగా కళ్లు మూసుకుంటాం

యుద్ధ రజను వాసనకు
లేసొస్తున్న రెక్కల దెయ్యాలు
తెరను కిందకు లాగేయమని
విదూషకుడు అరుస్తున్నాడు
భలే మనుషులం మనం
ఆ క్షణానికి కళ్లు మూస్తే, తెర లాగేస్తే
బతికేయొచ్చు అనుకుంటాం.

■ రివేరా

సోమవారం 28 అక్టోబరు 2024

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్


నా విజిటింగ్ కార్డుగా మారిపోయింది

నా మొదటి పుస్తకం

■ వాడ్రేవు చినవీరభద్రుడు



మా అన్నయ్య వాడ్రేవు సుందర్రావు ప్రోద్బలంతో నా మొదటి పుస్తకం 'నిర్వికల్ప సంగీతం' 1986లో వెలువరించాను. ఆ పుస్తకం వేసుకోడానికి సాంస్కృతిక శాఖ 1800 రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించింది గాని తొమ్మిది వందలే ఇచ్చింది. మిగిలిన సొమ్ము నా మిత్రుడు సోమయాజులు పెట్టుకున్నాడు. ముఖచిత్రం మా మిత్రుడు చట్టి హనుమంతరావు డిజైన్ చేసాడు. రాజమండ్రి మ్యూజియంలో ఉన్న ఒక మదర్ గాడెస్ శిల్పాన్ని ముఖచిత్రంగా వాడుకున్నాం. సమాచారం సుబ్రహ్మణ్యం తన మిత్రుడు ప్రతాప్‌కి చెందిన ప్రింటోఫైన్ ప్రెస్సులో ఆ పుస్తకం వేయించాడు. రాజమండ్రి సాహితీ వేదిక ఆధ్వర్యంలో గౌతమీ గ్రంథాలయంలో ఆ పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఆవిష్కరణ సమావేశం ఖర్చు వంద రూపాయలు మిత్రుడు గోపీచంద్ పెట్టుకున్నాడు. మా బామ్మగారు వాడ్రేవు లక్ష్మీదేవమ్మ నాకు నా పసితనాన పోతన భాగవతంలో ఎన్నో పద్యాలు కంఠస్థం చేయించారు. సాహిత్యానికి ఆమె నా తొలిగురువు. కాబట్టి ఆ పుస్తకం ఆవిష్కరించమని ఆమెని అభ్యర్థించేను. మల్లంపల్లి శరభయ్య గారూ, ఆర్.ఎస్. సుదర్శనం గారూ, మిత్రులు మహేశ్, గోపీచంద్‌లతో పాటు మా అక్క కూడా ఆ రోజు ఆ పుస్తకం మీద మాట్లాడేరు. 500 కాపీలు వేయించాం. ఒక్కొక్క కాపీ పది రూపాయలు వెల పెట్టానుగానీ ఆ కాపీలన్నీ దాదాపుగా మిత్రులకీ, సాహిత్యాభిమానులకీ పంచిపెట్టేసాను. ఆ పుస్తకం వెలువడగానే ఇంద్రగంటి శ్రీకాంత శర్మ ఆంధ్రజ్యోతి దినపత్రిక సాహిత్యానుబంధంలో దాదాపు సగం పేజీ రివ్యూ రాసారు. ఆ రివ్యూ చదివి సిరిసిల్ల నుంచి జూకంటి జగన్నాథం పది రూపాయలు మనియార్డరు పంపించాడు. ఆయనే ఆ కవిత్వానికి మొదటి, చివరి కొనుగోలుదారు. మరొక గొప్ప ఆశ్చర్యం ఆంధ్రప్రభలో దాశరథి కృష్ణమాచార్య దాన్ని సమీక్షించటం. సాహిత్యలోకంలో నా పేరు అప్పటిదాకా ఎవరికీ తెలియదు. అందుకని దాశరథి నేను ఎక్కడో విదేశాల్లో ఉంటున్నానేమో అనుకున్నారట. మా అక్కయ్యకి ఉత్తరం రాస్తూ నేను ఏ దేశంలో ఉంటానో చెప్తే తాను అక్కడికి వెళ్ళినప్పుడు నన్ను కలుసుకుంటానని రాసారు! అజంతాకి ఒక కాపీ పంపిస్తే 'అద్భుతం, మరో మాట లేదు' అని రాసాడు. శేషేంద్ర రాజమండ్రి వచ్చినప్పుడు 'ఈ కవిని వసంతశాఖ మీద కోకిలగా ప్రతిష్ఠిస్తున్నాను' అని ఆశీర్వదించాడు. ఇస్మాయిల్, చండీదాస్, మో, త్రిపుర వంటి కవులు ఎందరో ఆ పుస్తకాన్ని మనసారా స్వాగతించారు. నూతలపాటి గంగాధరం స్మారక పురస్కారం అందుకోడానికి తిరుపతి వెళ్ళినప్పుడు మధురాంతకం రాజారాం గారు మనసారా స్వాగతించడం మరొక జ్ఞాపకం. ఆ తర్వాత రోజుల్లో ఆ పుస్తకం నాకు విజిటింగ్ కార్డుగా మారిపోయింది అంటే అతిశయోక్తి కాదు.



మండల స్వామి సంస్మరణ సభ

దివంగత కవి రచయిత మండల స్వామి సంస్మరణ సభ, మిత్రులచే స్వామి కవిత్వ పఠన కార్యక్రమం అక్టోబర్ 30 సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ కవుల వేదిక సమావేశ మందిరం, విజయశ్రీ కాలనీ కమ్యూనిటీ హాల్, వనస్థలిపురం, హైదరాబాద్‌లో జరుగుతుంది. మండల స్వామి మిత్రులందరికీ ఆహ్వానం. వివరాలకు: 89788 69183

ఏనుగు నరసింహారెడ్డి

కవి వారం – కవిత్వ తరగతి

తెరసం - జంట నగరాలు, తెలుగు భాషా సంస్కృతి శాఖల నిర్వహణలో నవంబర్ 3 మధ్యాహ్నం 2గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో 'కవి వారం- కవిత్వ తరగతి, కవి సమ్మేళనం' కార్యక్రమం జరుగుతుంది. నందిని సిధారెడ్డి 'వర్తమాన జీవితం-వచన కవిత నిర్మాణం' అంశంపై ప్రసంగిస్తారు. కందుకూరి శ్రీరాములు, మామిడి హరికృష్ణ, సంపత్ కుమార్ పాల్గొంటారు.

తెలంగాణ రచయితల సంఘం

జి.ఎన్. సాయిబాబా సంస్మరణ సభ

జి.ఎన్. సాయిబాబా సంస్మరణ సభ సి.యస్.ఆర్. ప్రసాద్ అధ్యక్షతన అక్టోబర్ 30 సాయంత్రం 5.30 గంటలకు సి.పి.యం. కార్యాలయంలోని కొరటాల సత్యనారాయణ హాలు, 2/7, బ్రాడీపేట, గుంటూరులో జరుగుతుంది. 'తెలుగు కవిత్వంలో కా. సాయిబాబా' అంశంపై అరసవెల్లి క్రిష్ణ, 'ప్రజా ప్రతిఘటన నమూనాగా కా. సాయిబాబా' అంశంపై పాణి ప్రసంగిస్తారు.

విరసం

రాయలసీమ నాటక రచనా పోటీలు

రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 'రాయలసీమ సమాజం - జీవ సంస్కృతి' నేపథ్యంగా ఏకాంకిక, నాటిక, నాటక రచనా పోటీలను ఎం.వి. రమణారెడ్డి స్మారకంగా నిర్వహిస్తున్నాం. డిసెంబరు 22 లోపు రచనలను పంపాలి. మొత్తం రూ.15వేల నగదు బహుమతులు అందచేస్తాం. పూర్తి వివరాలకు: 99639 17187.

అప్పిరెడ్డి హరినాథరెడ్డి

'చారల పిల్లి' కథల పుస్తకం

వేంపల్లె షరీఫ్ రాసిన 'చారల పిల్లి' కథల పుస్తకం ఆవిష్కరణ నవంబరు 3 సాయంత్రం 5 గంటలకు విజయవాడలోని బుక్ ఫెస్టివల్ కాన్ఫరెన్సు హాల్లో జరుగుతుంది. ఖాదర్ మొహియుద్దీన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. వక్తలుగా కాత్రగడ్డ దయానంద్, మల్లీశ్వరి, అరుణాంక్ లత, బత్తుల ప్రసాద్, అనిల్ డానీ పాల్గొంటారు.

సూఫీ పబ్లికేషన్స్

వచన కవిత అధ్యయన శిబిరం

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నవంబర్ 24న ఇప్పటికే కవిత్వ రంగంలో కొంత కృషి చేసినవారికి వస్తు, శిల్పపరమైన శిక్షణ కోసం వచన కవిత్వ అధ్యయన శిబిరం జరుగుతుంది. కవులు ఇప్పటివరకు వెలువరించిన కవితల వివరాలను తెలియజేస్తూ, మచ్చుకు ఒక కవితను 9603727234 వాట్సాప్ నెంబర్‌కు పంపాలి.

జె. చెన్నయ్య

నిన్ను ఎవరైనా ప్రేమిస్తే...

ఎట్లా లేచావు ఉదయం! రాత్రంతా, ఎవరో
వెన్నెలని తైలంగా మార్చి
నిన్నో వొత్తిని చేసి వెలిగించినట్టు, మరి

నీ ముఖంలో, ఊరకనే నవ్వు! మెరుస్తోంది
నీ శరీరం, బంతిపూవులాగా!
నీలో మట్టిపై చిందే చినుకుల సువాసన!

ఊరకనే, శిశువులు నవ్వినట్టు నవ్వుతావు
శృతి చేసినట్టు, సర్వాన్నీ ఇక
బిడ్డని తాకినట్టు తాకి, ఎత్తుకుంటావు

"ఎందుకిలా అయ్యారు, మీరు?" అని అడిగి
Diaper మార్చినట్టు, వాళ్ళల్లో
పేరుకున్న పరాయితనాన్ని తీసివేస్తావు

నీ ఎదురుగా అక్టోబర్ నెల చంద్రుడు. చెప్పు
ఎవరి ముఖం అది? మంచులో
తడిచీ, రాత్రిలో గాలికి ఊగే గడ్డి పూవులు,

ఎవరి మాటలు, అవి? కూర్చుని ఉన్నా, మరి
లేచినా, నువ్వేం చేసినా కూడా,
నిన్ను వానగా మార్చిన ఆ రూపం ఎవరిది?

◆◆◆

అన్నం తిన్నావా? అని అడుగుతావు? జాగ్రత్త
అని చెబుతావు. క్షణానికోసారి
Msg చేసి, ఏం చేస్తున్నావు అనడుగుతావు!

అబ్బా అని వాళ్ళు విసుకున్నా సరే, తల్లి కోడి
వెనుకే తిరిగే, పిల్లవి నువ్వు
వస్తున్నావా అనీ, జాగ్రత్త అనీ, ఎక్కడ అనీ!

◆◆◆

ఎట్లా పడుకున్నావు నువ్వు! నీలో నువ్వు చేరి
దగ్గరగా ముడుచుకుని
చీకట్లో దీపం వెలిగించినట్టు నీ పెదాలపై

చిరునవ్వు. ఎవరో, దుప్పటి కప్పి వెళ్లినట్లుగా
అంత నిద్రలోనూ నీకు
తెలిసినట్లు, ఒక తేలికైన ఆనందం. ఇష్టం

◆◆◆

తాకకుండానే స్పర్శ తెలిసినట్లుగా, ఊరకనే
నిజంగా మరి బ్రతికి
ఉండటం బావుంటుంది అని తెలిసీ, నీలో

నువ్వే వెలిగీ, గాలై వీచీ, వాళ్ళే నువ్వైపోయి!

■ శ్రీకాంత్





నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ప్రతీ సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని తెలిపారు.

జవాన్ల జులుం

బల్దియాలో మితిమీరుతున్న ఆగడాలు

- అధికారుల అండదండలతో అడ్డగోలు వసూళ్లు
- ట్రేడ్ లైసెన్స్ జారీలో పెద్ద మొత్తంలో అక్రమాలు
- వైట్‌కాలర్ జవాన్లుగా చెలామణి అవుతున్న పీహెచ్ వర్కర్లు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు



వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 27: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న కొందరు జవాన్ల ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. స్థానికంగా ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సూపర్‌వైజర్‌లను గుప్పిట్లో పెట్టుకుని ఆడిందే ఆట.. పాడిందే పాటగా చెలాయిస్తున్నారు. ప్రజలను, వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా డివిజన్‌ల కార్పొరేటర్‌ను మచ్చిక చేసుకుని డివిజన్‌లో జరుగుతున్న సమస్యలు, అధికారుల లొసుగులు, ప్రజల విషయాలను చేరవేస్తూ కొరియర్ పాత్ర పోషిస్తున్నారు. చికెన్, మటన్ షాపుల యజమానుల నుంచి వారాంతరపు అప్పా, ప్లాస్టిక్, యూజర్ చార్జీలు, కమర్షియల్ షాపుల నుంచి నెలవారీగా చెల్లించే గార్బేజ్ (చెత్త) పన్ను పరిమితికి మించి వసూలు చేస్తున్నారు.

కార్మికులకు వేధింపులు

నగరంలో పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా నియామకమైన వారు.. నయా జవాన్‌ల అవతారం ఎత్తి తోటి కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం పరిపాటిగా మారింది. వారికి అనుకూలంగా ఉండే వారిని చెత్త పని నుంచి పక్కన పెట్టడం, నచ్చని వారిని మురుగు కాల్వలు తీయాలని వేధించడం షరామామూలై పోయింది. వీరి వేధింపులకు పారిశుధ్య కార్మికులు విసిగిపోతున్నారు. అనారోగ్యం కారణంగా విధులకు రాని కార్మికులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తూ సంబంధిత అధికారులను సైతం తప్పుతోవ పట్టిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

ఆగడాలు

యేటా మార్చి నుంచి నవంబర్ వరకు వసూలు చేసే కొత్త ట్రేడ్ లైసెన్స్ జారీ, రెన్యువల్ డబ్బులను శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ల లాగిన్‌ల నుంచి ఈ వైట్‌కాలర్ జవాన్లు స్వాహా చేస్తూ బల్దియా ఆదాయానికి గండికొడుతున్నట్లు ఆరోపణలున్నాయి. రోడ్లపై చిరు వ్యాపారులపై వీరి ప్రతాపం చూపిస్తూ రోజువారి టార్గెట్‌గా రూ.3నుంచి 5వేలు లేనిదే ఇంటికి వెళ్లరని చెబుతున్నారు. ఇక విధులకు హాజరు కాని కార్మికుల ఇంటి వద్దనే బయోమెట్రిక్ వేయించి ఆ ఔట్ సోర్సింగ్ కార్మికుల నెల జీతంలో రూ.5వేలు తీసుకుంటారనే విమర్శలున్నాయి. అదేవిధంగా తమకు బదులు వేరేవారితో పనిచేయించుకుంటున్న ప్రభుత్వ శానిటేషన్ వర్కర్‌లను నుంచి నెలకు రూ.15వేలు వసూలు చేస్తారనే విశ్వసనీయ సమాచారం. ఇలా ఒక వైట్‌కాలర్ జవాన్ నెలకు సుమారు రూ.1లక్ష నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేసి వాటాల వారిగా ఉన్నతాధికారులకు అప్పగిస్తారని తెలిసింది. ఈ వైట్‌కాలర్ జవాన్‌ల దందా యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ చర్యలు చేపట్టాల్సిన ఉన్నతాధికారులు నిద్రమత్తు నటిస్తున్నట్టు తెలుస్తోంది. చాలాకాలంగా ఒకే చోట పాతుకుపోయిన జవాన్‌లను బదిలీ చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని పారిశుధ్య కార్మికులు అభిప్రాయపడుతున్నారు.

దందా ఇలా..

- వరంగల్ చౌరస్తాలో ఓ జవాన్ ట్రేడ్‌లైసెన్స్ ఇవ్వాలంటే ముందు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో కమిషనర్‌కు ఫిర్యాదు అందింది.
- వరంగల్ మెయిన్‌రోడ్డులో ఓ జవాన్ శానిటరీ సూపర్‌వైజర్ లాగిన్ నుంచి ట్రేడ్‌లైసెన్స్, యూజర్ చార్జీలు వసూలు చేసి దొరికిపోయాడు.
- మండిబజార్‌లో ఓ జవాన్ ప్రతీ రోజు ఓ బిర్యానీ సెంటర్ నుంచి ఇన్‌స్పెక్టర్లకు, సిబ్బంది బిర్యానీ కావాలని వేధించడంతో విషయం బయటకు తెలిసింది.
- బట్టలబజార్‌లో ఓ జవాన్ స్ట్రీట్ వెండర్‌లను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణ ఉంది.
- హనుమకొండలో ఓ మహిళా జవాన్ చెత్తపన్ను మాన్యువల్ బిల్లులు పెట్టి పెద్ద మొత్తంలో వసూలు చేస్తోంది.
- హనుమకొండ కాకాజీకాలనీలో ఓ జవాన్ ఆస్పత్రుల నుంచి నెలవారీగా పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నారు.
- పెట్రోల్‌పంపు నుంచి భీమారం వరకు మటన్, చికెన్ షాపుల యజమానులను వేధిస్తూ ఓ జవాన్ ప్రతీ వారం కలుస్తున్నట్టు తెలిసింది.
- కేయూ రోడ్డులో ఓ జవాన్ కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం.
- కేయూ రోడ్డులో ఓ జవాను షాపింగ్ కాంప్లెక్స్‌ల యజమానుల నుంచి నెలవారి డబ్బులు వసూలు చేస్తున్నాడు.
- సుబేదారి మెయిన్‌రోడ్డులో ఓ జవాను చిరువ్యాపారులు, తోపుడు బండ్ల యజమానుల నుంచి రోజు వారి డబ్బుల వసూలుకు పాల్పడుతున్నాడు.
- ఎన్ఐటీ నుంచి కేయూ జంక్షన్ వరకు పనిచేస్తున్న మెయిన్ రోడ్డు జవాను మద్యం షాపుల యజమానుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడు
- ఫాతిమా, కాజీపేట చౌరస్తాలో పనిచేస్తున్న జవాన్‌లు గార్బేజ్ పన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల పేరుతో వ్యాపారులకు నిద్ర లేకుండా చేస్తున్నారు.
- 16 విలీన గ్రామాలలో పనిచేస్తున్న ఆరుగురు జవాన్‌లు పారిశుధ్య కార్మికులకు హాజరుపేరుతో ఇబ్బందిపెట్టి నెలవారిగా డబ్బులు వసూలు చేస్తున్నారు.
- ఇటీవల దసరా పండుగ సందర్భంగా కొందరు ఓ మహిళా జవాను షాపింగ్‌కాంప్లెక్స్ నుంచి పెద్దఎత్తున చీరలు తీసుకున్నట్టు ఆరోపణలున్నాయి.

జవాన్లు

వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలతో పాటు విలీన గ్రామాలు, మెయిన్ రోడ్డులను కలుపుకుని సుమారు 390 మంది జవాన్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 240 మంది వైట్‌కాలర్ జవాన్లు, 110 మంది ఔట్‌సోర్సింగ్ జవాన్లు, 25 మంది ప్రభుత్వ జవాన్లు, 15 మంది మహిళా జవాన్లు ఉన్నారు.

వైట్‌కాలర్ అంటే..?

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో చెత్తను, డ్రైనేజీలను శుభ్రం చేసేందుకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపాదికన 2021లో 452 మందిని తీసుకున్నారు. వీరిలో కొందరినుంచి అప్పటి ప్రజాప్రతినిధి, కొందరు అధికారులు రూ.50వేల చొప్పున దండుకుని వైట్‌కాలర్ జవాన్ పోస్టులలో నింపినట్టు సమాచారం. అందులో సుమారు 240మంది జవాన్లుగా అవతారమెత్తి పారిశుధ్య విధులకు డుమ్మా కొడుతూ వస్తున్నారు. ఇటీవల బల్దియా నుంచి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన సూపర్‌వైజర్, ఎస్ఐల తో పాటు ఇక్కడ పనిచేస్తున్న కొందరు ఎస్ఐలు ఈ డబ్బుల వసూళ్ల దందాకు తెరలేపినట్టు విశ్వసనీయ సమాచారం.

రైతు కోసం రోడ్డెక్కుతాం..

- పత్తికి మద్దతు ధర ఏమైంది..?
- దొడ్డు వడ్లకు బోనస్ ఏది..?
- రుణమాఫీ లేదు.. రైతు భరోసా రాదు..
- ఎస్సారెస్పీ నీళ్ల కోసం జైలుకెళ్లాను..
- ఈ నెల 30వ వరకు వేచి చూస్తాం..
- ఆ తరువాత కార్యాచరణ ప్రకటిస్తాం..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఆంధ్రజ్యోతి చిట్ చాట్

6





జనగామలోని షాపింగ్ మాల్‌లో ఎగసిపడుతున్న మంటలు

కళ్ల ముందే కాలి బూడిద

- జనగామలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో భారీ అగ్ని ప్రమాదం
- పది దుకాణాలు ఆహుతి
- పెద్ద ఎత్తున చెలరేగిన మంటలు
- రూ. 20 కోట్లకు పైగా ఆస్తి నష్టం

4

విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- ఘనంగా భాషా పండితుల సత్కార కార్యక్రమం

4

సైక్లింగ్‌తో ఆరోగ్యం, ఉత్సాహం

- పోలీసులు ప్రతీరోజు కొంత సమయం కేటాయించాలి
- సీపీ అంబర్ కిశోర్ ఝా పిలుపు
- పోలీసు అమరులను స్మరిస్తూ సైకిల్ ర్యాలీ

6



సైకిల్ తొక్కుతున్న సీపీ

బాణాసంచా.. జీరో దందా..

- జనావాసాల మధ్యలో టపాసుల దుకాణాలు
- నగరంలో అనధికారికంగా వెలుస్తున్న గోదాములు
- ప్రభుత్వ శాఖల పర్యవేక్షణ ఏది...?
- అధికారుల అండతో విచ్చలవిడి వ్యాపారం

వివరాలు : 6లో..

ఆగని 'పోలీసు' పోరు

- మామునూరు బెటాలియన్‌లో కొనసాగుతున్న ఆందోళనలు
- ఆరుగురు పోలీసుల సస్పెన్షన్‌తో ఉద్రిక్తత
- కట్టుదిట్టమైన భద్రత కల్పించిన అధికారులు




మామునూరు బెటాలియన్‌లో ఆందోళన చేస్తున్న పోలీసు సిబ్బంది

శంభునిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏక్ పోలీసింగ్ కోసం యూనిఫామ్‌తో నిరసన కార్యక్రమం చేపట్టిన పోలీసులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా టీజీఎస్పీ బెటాలియన్‌లోని సిబ్బంది యూనిఫామ్‌లతో ఆందోళనలకు దిగింది. యూనిఫామ్‌తో నిరసనలో పాల్గొన్న పోలీసులపై తెలంగాణ పోలీసు యంత్రాంగం క్రమశిక్షణ చర్యలకు పూనుకుంది. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 39 మందిని సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అవసరమైతే ఆర్టికల్ 311 ప్రకారం యూనిఫామ్ సర్వీసెస్ క్రమశిక్షణ నియమాలను కఠినంగా అమలుపరిచే విధంగా దూకుడుతో వెళుతోంది. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పోలీసు వ్యవస్థను మన రాష్ట్రంలో కూడా అమలు చేయమనడం తమ హక్కు అని టీజీఎస్పీ పోలీసులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫోర్త్ బెటాలియన్‌కు చెందిన ఆరుగురు సిబ్బందికి సస్పెన్షన్ ఆర్డర్‌లు రావడంతో టీజీఎస్పీ సిబ్బంది వెనక్కు తగ్గకుండా ఆదివారం బెటాలియన్‌లో ఆందోళనలకు దిగారు. బెటాలియన్ ప్రధాన ద్వారం ముందు బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏక్ పోలీసింగ్ వ్యవస్థ కావాలని డిమాండ్ చేశారు. 39 మంది సిబ్బందిపై వేసిన సస్పెన్షన్ వేటును వెంటనే వెనక్కు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు.

పటిష్ట బందోబస్తు

పోలీసు ఉన్నతాధికారులు శనివారం అర్ధరాత్రి సస్పెన్షన్ ఆర్డర్‌లను ఇవ్వడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనల జరుగకుండా మామునూరు బెటాలియన్ వద్ద లా అండ్ ఆర్డర్ పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. ఆదివారం బెటాలియన్ ప్రధాన ద్వారం వద్ద పెద్దసంఖ్యలో తిష్ట వేసి పరిస్థితులను ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో మామునూరు సబ్ డివిజన్‌లోని అన్నీ పోలీస్‌స్టేషన్ల సిబ్బందితో పాటు స్పెషల్ బ్రాంచ్, ఇతర శాఖ పోలీసులు బందో బస్తులో పాల్గొన్నారు. నిరసనకారులు రోడ్డెక్కితే అరెస్టు చేయమని పైనుంచి ఉత్తర్వులు రావడంతో బెటాలియన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

అయితే టీజీఎస్పీ పోలీసులు బెటాలియన్ ప్రధాన ద్వారం లోపలే ఆందోళన చేశారు. కమాండెంట్, అధికారులు సిబ్బందితో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.



విప్లవ చరిత్రలో మొదటి సంఘం పీడీఎస్‌యూ

- ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా విప్లవ విద్యార్థి సంఘాలు ఏకం కావాలి
- పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సదస్సులో వక్తల పిలుపు



సభలో సంఘీభావం తెలుపుతున్న పీడీఎస్‌యూ పూర్వ, ప్రస్తుత నాయకులు

ఖిలావరంగల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భారతదేశ విప్లవ చరిత్రలో మొదటి విప్లవ విద్యార్థి సంఘంగా పీడీఎస్‌యూ ఏర్పడిన తెలుగునేల ఖిలావరంగల్‌లో జరుపుతున్న ఈ బహిరంగసభ మరో విప్లవ విద్యార్థి ఉద్యమానికి ప్రారంభసూచికగా మిగిలిపోతుందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కె.గోవర్ధన్ అన్నారు. ఖిలావరంగల్ కోటలో పీడీఎస్‌యూ 50 వసంతాల వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాష్ట్ర నాయకుడు బండి కోటేశ్వర్‌రావు అధ్యక్షతన బహిరంగసభను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ మైనారిటీలపై దాడులు చేస్తోందని ఆరోపించారు. లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులను హరించివేస్తున్న ఈ సమయంలో విప్లవ విద్యార్థి సంఘాల ఐక్యత ఆవశ్యకత ఉందన్నారు. ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి ఐక్యంగా పోరాటాలు చేయాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర పూర్వ నాయకులు బూర్గుల ప్రదీప్, సాధినేని వెంకటేశ్వరరావు, గురువారెడ్డి, డాక్టర్ సంపత్, అమర్, అంబేద్కర్, పర్వతాలు, సంధ్య మాట్లాడుతూ.. దేశంలో కాషాయీకరణ, కార్పొరేటీకరణ, బ్రాహ్మణీయ, పాసిస్టు పాలనకు వ్యతిరేకంగా విప్లవ విద్యార్థి సంఘాలు ఏకం కావాలని అన్నారు. పదేళ్లకు పైగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రాజ్యాంగ, ప్రజాస్వామిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. విద్యను కాషాయీకరణ చేయడం కోసం నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చిందన్నారు. మూఢవిశ్వాసాలను పెంచే ఈ విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడుతూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని కోరే శక్తులన్నీ ఏకం కావాలన్నారు. ఈ సదస్సులో

మిగతా 4వ పేజీలో..



న్యూస్ బాక్స్

మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్‌కు విశేష స్పందన



పరీక్ష తీరును పరిశీలిస్తున్న చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్

హనుమకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో అదివారం నయీంనగర్ బ్రాంచ్‌లో నిర్వహించిన మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్‌కు విశేష ఆదరణ లభించినట్లు నయీంనగర్ బ్రాంచ్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. 800 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. 10వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఐఐటీ, మెడికల్ విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా హనుమకొండలోనే అభ్యసించేందుకు రాజస్థాన్ కోటా బ్రాంచ్ ఆధ్వర్యంలో అత్యున్నతమైన ప్రమాణాలతో మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్టిట్యూట్ స్థాపించినట్లు తెలిపారు. టాలెంట్ సెర్చ్ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కోటా హెడ్ సెంటర్ అనేక రాయితీలను ప్రకటించిన విషయం తెలిసిందే అన్నారు. 15 రోజుల్లోనే ఫలితాలు విడుదలవుతాయని, పరీక్ష రాసిన విద్యార్థులు, తల్లితండ్రులు, ప్రోత్సహించిన అధ్యాపకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ డైరెక్టర్స్ చీర గణేశ్, పెరమాండ్ల అనిల్, బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేశ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మురళి, మార్కెటింగ్ మేనేజర్ శనగరపు సుమన్, తాళ్లపల్లి రమేశ్, రచ్చ కుమార్, పాక నాగరాజు, రవీందర్‌రావు, శశిధర్, అరుణ్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం చేస్తున్నాం..

ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణపై వినియోగదారులకు ఎప్పటికప్పుడు వివరిస్తున్నామని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగడం ఆందోళన కలుగుతోందని, ప్రధానంగా భద్రత పట్ల అవగాహన లోపం, నిర్లక్ష్యం, నాసికరం పరికరాల వినియోగంవల్ల విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. విద్యుత్ ప్రమాదాలు తెలియపరిచేందుకు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించి సత్ఫలితాలను సాధించామన్నారు. ఖమ్మంలోని చింతకాని మండలం లచ్చగూడెంకు చెందిన జి.ప్రసాద్ విద్యుదాఘాతంలో మరణించడంతో అందుకు బాధ్యులైన జూనియర్ లైన్‌మెన్, ఖమ్మం ఎస్ఈను సస్పెండ్ చేశామన్నారు. విద్యుత్ సమస్యలు ఉన్నప్పుడు 1912కు ఫోన్ చేసి సమస్య పరిష్కరించుకోవాలన్నారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన టీమ్ లీజ్ సర్వీసెస్ లిమిటెడ్ కంపెనీ హనుమకొండ, కాజీపేటలో పనిచేసేందుకు వేర్‌హౌస్ అసిస్టెంట్స్, ప్యాకర్స్, సేల్స్ అసోసియేట్స్ క్యాషియర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసైన 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు గల యువకులు ఈ జాబ్ మేళాలకు అర్హులని ఆయన తెలిపారు. ములుగురోడ్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో నిర్వహించే జాబ్ మేళాకు ఆసక్తి, అర్హులైన యువకులు వారి ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7893394393/9948762077 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

విప్లవ చరిత్రలో మొదటి సంఘం పీడీఎస్‌యూ

(3వ పేజీ తరువాయి)

అరుణోదయ కళాకారులు నాగన్న, విమలక్క, యోచన తదితరులు విప్లవ గీతాలను ఆలపించారు. ముందుగా ముదిరాజ్ భవనంలో పీడీఎస్‌యూ జెండాను పూర్వ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల ప్రదీప్ జెండాను ఎగరవేశారు. అనంతరం ప్రతినిధుల సభను నిర్వహించారు. సాయంత్రం మెట్టుకోట నుంచి చెమన్ వరకు డప్పుచప్పుళ్లతో ర్యాలీగా వెళ్లారు అనంతరం పీడీఎస్‌యూ స్థూపాన్ని ఆవిష్కరించారు. సాయంత్రం జరిగిన సభలో సామాజిక జనంపాట కళాకారుడు బొడ్డు కుమారస్వామి రాసిన పాటల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ బహిరంగసభలో రాష్ట్ర నాయకురాలు విమలక్క, నాగన్న, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, పీడీఎస్‌యూ పూర్వనాయకులు కూసల సదానందం, తీగల జీవన్, ఎస్.రవి, రాచర్ల బాలరాజు, నలిగంటి విజయ్‌పాల్, టీకే, మంజాల భిక్షపతి, నరసింహరావు, మొగిలి వెంకటరెడ్డి, బి.ఐలయ్య, హరిబాబు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



మంటలను ఆర్పుతున్న మూడు ఫైర్ ఇంజన్లు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

కళ్ల ముందే కాలి బూడిద

- జనగామలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో భారీ అగ్ని ప్రమాదం
- పది దుకాణాలు అగ్నికి ఆహుతి.. రూ. 20 కోట్లకు పైగా ఆస్తి నష్టం

జనగామ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భారీ అగ్ని ప్రమాదంలో కళ్లముందే దుకాణాలన్నీ కాలి బూడిదయ్యాయి. ఓ దుకాణంలో చెలరేగిన మంటలు కాంప్లెక్స్‌లోకి పదికిపైగా దుకాణాలకు వ్యాపించి, చూస్తుండగానే మంటల్లో కాలిపోయాయి. గంటల తరబడి శ్రమించినా మంటలు అదుపులోకి రాకపోవడంతో భారీ ఆస్తి నష్టం జరిగింది. ఈ ఘటనలో రూ.20 కోట్ల మేరకు ఆస్తినష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జనగామలోని సిద్దిపేట రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున 5.30గంటల సమయంలో షాపింగ్ కాంప్లెక్స్‌లోని విజయ షాపింగ్ మాల్‌లో మంటలు చెలరేగాయి. మొదట్లో కొద్దిపాటి పొగలు రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి జనగామ అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. వారు వచ్చేలోపే మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. ప్రమాదంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విజయ షాపింగ్ మాల్ షట్టర్లు తెరుచుకోలేదు. క్రమక్రమంగా మంటలు విజయ షాపింగ్‌మాల్ నుంచి కాంప్లెక్స్‌లో ఉన్న ఇతర దుకాణాలను వ్యాపించాయి.

సిబ్బంది మం టలను ఆర్పేందుకు ప్రయత్నం చేయగా అదుపులోకి రాకపోవడంతో షాపింగ్ మాల్ షట్టర్లను జేసీబీ సాయంతో తొలగించి మంటలను ఫైర్ ఇంజిన్ ద్వారా నీటి చల్లి ఆర్పే ప్రయత్నం చేశారు. ఉదయం 5.30 గంటలకు ప్రారంభమైన మంటలు మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత కొద్దిగా అదుపులోకి వచ్చాయి.

ఆరు ఫైర్ ఇంజన్లు.. 40 మంది సిబ్బంది..

తొలుత జనగామ ఫైర్ ఇంజన్ రాగా, ప్రమాద తీవ్రత ఎక్కువ కావడంతో స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తితోపాటు యాదాద్రి జిల్లా ఆలేరు, భువనగిరి, సూర్యాపేట జిల్లా మోత్కూరు అగ్నిమాపక కేంద్రాల నుంచి ఫైర్ ఇంజన్లను రప్పించారు. ఆరు ఫైర్ ఇంజన్లతో సుమారు 40 మంది సిబ్బంది ఏడు గంటలకు పైగా శ్రమించారు. ఒక్కో ఫైర్ ఇంజన్ సుమారు ఐదారుసార్లు నీటిని నింపుకొని వచ్చి చల్లినా మంటలు అదుపులోకి రాలేదు. ఎంతకూ మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక అధికారులు 'ఫైర్ కెమ్' (ఫోమ్) రసాయనాన్ని నీటితో కలిపిచల్లారు. కాంప్లెక్స్‌కు ఆనుకొని ఉన్న మరో బిల్డింగ్ ఎక్కి ఫోమ్‌తో కూడిన వాటర్ చల్లడం, కెమికల్ చేసి విసరడంతో మంటలు అదుపులోకి వచ్చాయి.

రూ.20 కోట్ల ఆస్తి నష్టం?

షాపింగ్ కాంప్లెక్స్ దగ్ధమైన ఘటనలో సుమారు రూ. 20కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. విజయ షాపింగ్ మాల్‌లో ఉన్న ఇన్వర్టర్‌లో షార్ట్ సర్క్యూట్ జరగడం మూలంగానే అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. దుకాణాల్లో బట్టలు ఉండడం, ప్లైవుడ్‌తో చేసి కబోర్డ్స్, థర్మాకోల్ ఫాల్స్ సీలింగ్ కారణంగా మంటలు వేగంగా వ్యాప్తి చెందాయని ఫైర్ సిబ్బంది అంటున్నారు. కాగా.. షాపింగ్ కాంప్లెక్స్‌లోని విజయ షాపింగ్ మాల్‌లో ఫైర్ సేఫ్టీ వ్యవస్థ లేదని, అదే గనుక ఉంటే ఫైర్ అలారమ్ మోగడంతోపాటు ఆటోమెటిక్‌గా నీటిని చల్లి మంటలను ఆర్పే అవకాశం ఉండేదని, ఆ వ్యవస్థ లేకపోవడం వల్లే ప్రమాద తీవ్రత పెరిగిందని ఫైర్ అధికారులు చెబుతున్నారు. ఘటన స్థలాన్ని వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారధి సందర్శించి పరిస్థితి పర్యవేక్షించారు.

వీరితో పాటు హనుమకొండ, వరంగల్, భువనగిరి జిల్లాల ఫైర్ సేఫ్టీ అధికారులు జైపాల్‌రెడ్డి, శ్రీధర్, మధుసూదన్‌రావుతో పాటు జనగామ, పాలకుర్తి, భువనగిరి స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు రేమండ్ బాబు, శ్రీరాములు, మధుకర్ దగ్గరుండి మంటలను అదుపు చేయడంలో సూచనలు చేశారు. అలాగే ఘటనా స్థలాన్ని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సాయంత్రం సందర్శించారు. ప్రమాదానికి కారణాలను బాధితులు, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నష్టపోయిన తమకు న్యాయం చేయాలని పలువురు బాధితులు ఎంపీని కోరగా పరిహారం వచ్చేలా చూస్తానని భరోసానిచ్చారు.

ఉన్నత న్యాయస్థానాల్లో బహుజన ప్రాతినిధ్యం పెరగాలి

టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, వేదికపై ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, తదితరులు

వడ్డెపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఉన్నత న్యాయస్థానాల్లో బహుజన ప్రాతినిధ్యం పెరగాలని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అభిప్రాయపడ్డారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ (ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ) మైనారిటీ కమ్యూనిటీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ బీఏఎంసీఈఎఫ్ (బామ్‌సెఫ్) రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించారు. తొలుత బామ్‌సెఫ్ జెండాను ఆవిష్కరించి అంబేద్కర్, మహాత్మా జ్యోతీరావుఫూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. దేశంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు, విద్యా, మతపరమైన సాంస్కృతిక, నైతిక వెనుకబాటుకు బ్రాహ్మణీయ వ్యవస్థే కారమణమన్నారు. బహుజనులు రాజకీయంగా ఎదిగి బహుజనులను ఏకం చేసి తద్వారా రాజ్యాధికారం చేపట్టాలని దీనికి బహుజన మేధావులు, విద్యార్థుల కృషి ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. ప్రజలు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను తమ జీవిత సూత్రాలుగా మలుచుకొని బహుజనులంతా కలిసి మెలసి జీవించే సామాజిక ప్రజాస్వామ్యం రావాలని అన్నారు. స్వేచ్ఛ లేకపోతే వ్యక్తి అభ్యున్నతి దెబ్బతింటుందని అన్నారు. ఈ సదస్సులో సామాజిక విశ్లేషకుడు సైబాబా, బామ్‌సెఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎన్.శ్రీధర్, సోమ్లా నాయక్, కొండ పెద్దన్న, బొర్ర గోవర్ధన్, తాడిశెట్టి క్రాంతికుమార్, సాయిని నరేందర్, తరాల సందీప్, నాగరాజు,లావుడ్య సుజాత, భీమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దైనందిన జీవితంలో ఫిజియోథెరపీ భాగం

- కాళోజి హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య
- వాగ్దేవి ఫిజియోథెరపీ సిల్వర్ జూబ్లీ వేడుకలు

హనుమకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో ఫిజియోథెరపీ భాగమైందని కాళోజి హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య అన్నారు. వాగ్దేవి ఫిజియోథెరపీ కళాశాల సిల్వర్‌జూబ్లీ వేడుకలను పురస్కరించుకొని ఫిజియోకాన్-2024 పేరుతో అదివారం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చందుపట్ల దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్ వాహిణిదేవి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాళోజి హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ సంధ్య మాట్లాడుతూ.. ఫిజియోథెరపిలో రీసెర్చ్ చాలా ప్రాముఖ్యమైనదని, దాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. డైరెక్టర్ వాహిణిదేవి మాట్లాడుతూ.. ఫిజియోథెరపీలో ఉన్నత స్థానంలో నిలవాలని విద్యార్థులకు సూచించారు. ఫిజియోథెరపీలో వస్తున్న ఆధునిక వైద్యం, రోగాలను నయం చేసే చికిత్సల గురించి సింగపూరు నుంచి వచ్చిన ప్రముఖ ఫిజియోథెరపిస్టు అలెక్సాండ్రా, శ్రీలంక నుంచి హాజరైన డాక్టర్ మయూరన్, థాయిలాండ్ నుంచి హాజరైన డాక్టర్ సిరిచాన్, డాక్టర్ ఫ్రెడరిన్ డాక్టర్ ఉజ్వల్ భట్టాచార్య, డాక్టర్ అమిత్ బిస్వాస్, డాక్టర్ భాస్కర్‌రెడ్డిలు వివిధ కళాశాలల నుంచి కాన్ఫరెన్స్‌కు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంధ్య, దేవేందర్‌రెడ్డి దంపతులు

అనంతరం ఫిజియోథెరపీలో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారిని ప్రిన్సిపాల్ సంపత్‌రెడ్డి సమక్షంలో ప్రొఫెషనల్ ఎక్సలెన్స్ అవార్డు, ఫిజియో ఎక్సలెన్స్ అవార్డులతో సత్కరించారు. వాగ్దేవిలో విద్యనభ్యసించిన ఫిజియోథెరపిస్టులకు అలుమిని అవార్డుతో సత్కరించారు. దేశవ్యాప్తంగా 21 కళాశాలల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు. కార్యక్రమ కన్వీనర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో కాన్ఫరెన్స్ దిగ్విజయంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజమహేంద్ర, డాక్టర్ సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మాడ వీధుల నిర్మాణపు పనులకు బ్రేక్

- చెరువుపై బ్రిడ్జి నిర్మాణ అనుమతుల్లో జాప్యం
- వేడుకల వేళ ఇబ్బందులు పడుతున్న భక్తులు



నిలిచిపోయిన మాడ వీధుల నిర్మాణ పనులు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి ఆలయ మాడవీధుల నిర్మాణపు పనులు నత్తనడకన సాగుతున్నాయి. కుడా (కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో నిర్మాణానికి రూ.30కోట్లు కేటాయించగా, 4 నెలలుగా మాడ వీధుల నిర్మాణపు పనులు ఆగిపోయాయి. వర్షాలు, ఉత్సవాలు నిర్వహణ అంటూ రెండు మాసాల నుంచి నిర్మాణపు పనులు కుంటుపడ్డాయి. రెండు మాసాల కిందట భద్రమ్మ గుట్ట గుండు గాలికి జారిపడగా దేవస్థానం వెళ్లే దారి ఇబ్బందిగా మారింది. ఆ గుండును తొలగించడంతో పాటు మాడ వీధుల నిర్మాణం జరిగే ఇతర స్థలంలో ఉన్న భద్రమ్మ గుట్టను కూడా తొలగించే ప్రయత్నం జరుగుతోంది.

మాడ వీధుల నిర్మాణానికి నిధుల కొరత?

మాడ వీధుల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 30 కోట్లు కేటాయించగా భారీ ప్రాజెక్టుగా రూపుదిద్దుకోనున్న భద్రకాళి రాజగోపురం, మాడ వీధుల నిర్మాణానికి దాదాపు రూ.100కోట్లు ఖర్చు కానుందని అనధికార సమాచారం. ఈ నేపథ్యంలో కేటాయించిన నిధులు సరిపోవని నిర్మాణపు పనులు జాప్యం చేస్తున్నారా? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే మాడవీధుల నిర్మాణపు పనులు త్వరగా పూర్తి కావాలని నిధుల విషయంలో ఎలాంటి జాప్యం కావద్దని ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకొచ్చి పూర్తి చేస్తామని హైదరాబాద్‌లో జరిగిన అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడినట్లు సమాచారం.

చెరువుపై బ్రిడ్జి నిర్మాణ అనుమతుల్లో జాప్యం

మాడ వీధుల నిర్మాణపు పనులు వేద పాఠశాల నుంచి ముఖద్వారం మీదుగా భద్రకాళి చెరువు నుంచి ఈవో కార్యాలయం వెనుకవైపుగా అమ్మవారి ఆలయం చుట్టూరా నాలుగు మాడ వీధుల నిర్మాణం కొనసాగనుంది. భద్రకాళి చెరువు నుంచి మాడ వీధుల నిర్మాణం గురించి బ్రిడ్జి నిర్మాణం కోసం అనుమతులు కోరగా వాటి అనుమతులో జాప్యం కొనసాగుతున్నట్లు తెలిసింది.

శాశ్వత ప్రణాళికలు రూపొందించాలి

ఏడాదిలో నాలుగు ప్రధాన ఉత్సవాలు జరుగుతాయి. ముఖ్యంగా శాకంబరీ, నవరాత్రోత్సవాలకు లక్షలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. వారికి దాతల సహకారంతో ఉత్సవ సేవా సమితి వారు అన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. అన్నదానానికి ప్రస్తుతం అన్నపూర్ణ మందిరం ఉంది. ప్రత్యేకంగా అన్నపూర్ణ మందిరాన్ని నిర్మించి ఉత్సవాల్లో దేవాలయం ఆధ్వర్యంలోనే అన్నదానం జరిగేలా చూడాలని ప్రత్యేక, వాహన పూజలు, పూజా స్టోర్, ప్రసాదాల విక్రయాలకు శాశ్వత నిర్మాణాలను చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

పాలకవర్గం లేక 12ఏళ్లు..

భద్రకాళి ఆలయానికి పాలక వర్గం లేక 12 ఏళ్లు అయింది. రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో పాలకవర్గం ఏర్పాటు చేయగా ఆ కమిటీ ఆఖరు కమిటీగా ముగిసింది. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన దాస్యం వినయ్ భాస్కర్, ఆలయ కమిటీ ఏర్పాటు చేస్తామని పలుమార్లు ప్రకటించి ఏర్పాటు చేయలేదు. శాకంబరీ, దేవీ శరన్నవరాత్రోత్సవాలకు ముందు కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించి దేవాదాయ శాఖ నుంచి నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. రేపో మాపో కమిటీ ట్రస్టు బోర్డు ఏర్పాటు అవుతుందని ఊహాగానాలు జోరందుకున్నాయి. ఆశావహులు ఎదురు చూశారు. కమిటీ ఏర్పాటు కాకపోగా దేవీ నవరాత్రోత్సవాలూ ముగిశాయి. ప్రముఖులు అమ్మవారి దర్శనానికి తరలి వస్తారు. నిత్యం రద్దీగా ఉండే భద్రకాళి దేవాలయానికి సరైన పరిపాలన వ్యవస్థ లేకపోవడం చర్చనీయాంశంగా మారిపోయింది. 12 ఏళ్లుగా ట్రస్టు బోర్డు లేకపోవడం కోట్లాది రూపాయలతో మాడ వీధుల నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో ట్రస్టు బోర్డు వ్యవస్థ పర్యవేక్షణ కమిటీ, అభివృద్ధి మండలి ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హాస్టల్ నుంచి ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వరంగల్ ఇంతెజార్‌గంజ్ పోలీసుస్టేషన్ పరిధిలో గల దేశాయిపేటరోడ్డులో నూర్ ఈ ఫుర్ఖాన్ మదర్స్ హాస్టల్ నుంచి ఇద్దరు విద్యార్థినులు ఇంటికి వెళ్లి తిరిగి రాలేదని మదర్సా నిర్వాహకులు తెలుపగా కుటుంబసభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కరీమాబాద్ బీరన్న కుంటకు చెందిన మసూద్ కుమార్తెలు ఇద్దరు సానియా (13), సనా (10) ఈ నెల 26న హాస్టల్ నుంచి ఉదయం 7గంటలకు ఇంటికి వెళ్లి తిరిగి హాస్టల్‌కు రాలేదని హాస్టల్ నిర్వాహకులు తెలిపారు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతకగా ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి

భీమదేవరపల్లి మండలం రత్నగిరిలో ఘటన



అష్మిక (ఫైల్)

భీమదేవరపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): లోకం పోకడ తెలియని ఆ చిట్టి తల్లికి నిండు నూరేళ్లు నిండాయి. అభం శుభం తెలియక బుడిబుడి అడుగులు వేస్తూ నీటి తొట్టిలో పడి కన్ను మూసింది. వంగర ఎస్ఐ దివ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రత్నగిరి గ్రామానికి చెందిన గడిపె సంపత్-స్వర్ణ దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. ఇందులో ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాబు ఉన్నాడు. తల్లిదండ్రులిద్దరూ ఆదివారం ఉదయం కూలీ పనులకు వెళ్లారు. అంధుడైన తాత లింగయ్య ఇంటి వద్దనే పిల్లల బాగోగులు చూస్తున్నాడు. పిల్లలందరూ తాతతో జోకులు వేస్తూ సరదాగా ఆడుకుంటున్నారు అష్మిక(3) బుడిబుడి అడుగులు వేస్తూ ఇంటి ముందు ఆవరణలో ఉన్న నీటి సంపులో పడిపోయింది. ఇది గమనించని చిన్నారులు ఆటల్లో మునిగిపోయారు. కొద్దిసేపటి తర్వాత అష్మిక కనబడడం లేదని, పిల్లలు నీటి తోటి వైపు చూడగా అందులో పడిపోయినట్లు గమనించారు. వెంటనే చుట్టూపక్కల వారు తల్లిదండ్రులకు కబురందించి, నీటి తొట్టిలో నుంచి అష్మికను బయటకు తీసి 108 వాహనంలో తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే అష్మిక మృతి చెందినట్లు సిబ్బంది తెలిపారు. చిన్నారిని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం రత్నగిరిలో అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం

- ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం..
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- ఘనంగా భాషా పండితుల సత్కార కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

శంభునిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఇటీవల పదోన్నతులు పొందిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన భాషా పండితులకు నగరంలోని బిర్లా ఓపెన్ మైండ్ పాఠశాలలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సదస్సుకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పదోన్నతులకు నోచుకోని భాషాపండితులకు ఇటీవల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడంతోపాటు పదోన్నతులు కల్పించిందన్నారు. కోర్టుల్లో ఉన్న న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులతో పాటు పనిభారం తగ్గించడానికి డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయులను నియమించిందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆర్‌యూపీపీటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. అబ్దుల్లా మాట్లాడుతూ.. దశాబ్దకాలంగా భాషా పండితులు పదోన్నతులతో పాటు సమస్యలకోసం రోడ్డెక్కి పోరాటాలు చేయాల్సి రావడం దురదృష్టకరం అన్నారు. ఉపాధ్యాయుల న్యాయపోరాటానికి స్పందించిన రేవంత్ సర్కార్ రాష్ట్రంలోని 8630 మందిని స్కూల్‌అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పించడంపై ఉపాధ్యాయ సంఘాలు భాషా పండితులు ఆనందం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పరిషత్ ఏర్పాటై 97 ఏళ్లు పూర్తయిందని, మరో మూడేళ్లలో శతవసంతోత్సవాలు ఘనంగా నిర్వహించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ పండిత పరిషత్తు రాష్ట్ర కార్యదర్శి తిరుమల క్రాంతి కృష్ణ, రాష్ట్ర బాధ్యులు సీహెచ్ కుమారస్వామి, ఎం.డి. నజీరుద్దీన్, హైమావతి, మార్గం ఎల్లయ్య, దామోదర్, గోనె. భిక్షపతి, కరిమెల్ల బాబురావు, హనుమకొండ అధ్యక్షుడు సొల్లేటి లక్ష్మీనారాయణ, దేవేందర్, రంగనాథ్, శారదాబాయి, విష్ణువర్ధన్, ప్రభాకర్, పుల్లూరి కృష్ణమూర్తి, కుమారస్వామి, చింతం నాగరాజు, రాపాల. అశోక్, వనం. సదానందం, మంద. రవీందర్, సీహెచ్. కృష్ణమూరి వేముల. మమత, డాక్టర్ డి.జ్యోతి, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుదాం

జేఏసీ చైర్మన్ గజ్జెల రామ్‌కిషన్



నూతన కార్యవర్గంతో టీఎన్‌జీవోస్ నేతలు

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులుగా తమ కర్తవ్యాన్ని, బాధ్యతను నెరవేరుస్తూ హక్కుల కోసం పోరాడుదామని టీఎన్‌జీవోస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గజ్జెల రామ్‌కిషన్ అన్నారు. తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం వరంగల్‌జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు సల్లూరి రఘు అధ్యక్షతన సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కిషన్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి టీఎన్‌జీవో సంఘం ముందుంటుందని, సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యదర్శి గాజె వేణుగోపాల్ మాట్లాడుతూ టీఎన్‌జీవో సంఘం ఒక మహావృక్షం లాంటిదని అందులో అనేక శాఖలు పని చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుగులోతు యాకూబ్ నాయక్, కార్యదర్శి గా దయ్యాల సదానందం, సహాధ్యక్షులు పోలు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు సాదనపల్లి ధర్మేందర్, పి.కళ్యాణి, ఎస్‌కే.హుస్సేన్, కోశాధికారి ఆకుల పృథ్వీరాజ్, సహాయ కార్యదర్శులుగా నీలం వీరేష్, భూక్య సుమన్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కిరణ్, విజేందర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, ఫోరం కన్వీనర్ సందిల్ల బలరాం, కో కన్వీనర్ వెంకటరమణ, పాలకుర్తి సదానందం, హేమానాయక్, శరత్, గణేష్, రజిత, కల్లపు సదానందం పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేదునూరి జ్యోతి

శంభునిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. బొల్లికుంటలో మహిళా సమైక్య బాధ్యురాలు చిట్యాల సువర్ణ అధ్యక్షతన ఆదివారం భారత జాతీయ మహిళా సమైక్య ఖిలావరంగల్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య, లౌకిక వ్యవస్థలు ప్రమాదంలో పడ్డాయని విమర్శించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకిక వ్యవస్థలు పరిరక్షించబడాలంటే దేశంలోని మహిళా శక్తి సామర్థ్యాలను వినియోగించుకోవాలని అన్నారు. కేంద్రం డీలిమిటేషన్ పేరుతో మహిళా రిజర్వేషన్‌ను వాయిదా వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యతో పాటు అన్నీ రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఆరోపించారు. సెంటు భూమి లేని వారికి మహిళల పేరిట ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కోరారు. నవంబరులో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయని అందుకు గాను మండల, జిల్లా స్థాయిలో మహిళా సమైక్యకు సంబంధించి సభ్యత్వాలు నమోదు చేసుకొని కమిటీలను వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమైక్య వరంగల్ జిల్లా కార్యదర్శి తాళ్ళపల్లి రోహేలా, జిల్లా కమిటీ బాధ్యులు సుంకరి భవాని, వనం సౌందర్య, ఉమ, నవాంబీ, తిరుపతమ్మ, గౌతమి, రాజేశ్వరి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాంబే గృహాలు

- బెంబేలెత్తుతున్న లబ్ధిదారులు
- డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వానికి వేడుకోలు



శిథిలావస్థలో మగ్గుతున్న వాజ్‌పాయ్ కాలనీలోని వాంబే గృహాలు

వడ్డెపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ పరిధిలోని వాజ్‌పాయ్ కాలనీలో రెండు దశాబ్దాల క్రితం వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన (వాంబే) పథకం కింద నిర్మించిన గృహాలు శిథిలావస్థలో మగ్గుతున్నాయి. 2004లో ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో మురికి వాడల్లో నివసించే వారికి కనీస వసతి సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో వాంబే గృహాలను నిర్మించారు. అయితే సరైన నిర్వహణ లేక ప్రస్తుతం అవి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వాజ్‌పాయ్ కాలనీలో 2004లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద ప్రజల కోసం ప్రభుత్వం వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన పథకం కింద జీ+2లో సుమారు 96 గృహాలను నిర్మించి లబ్ధిదారులకు అప్పగించారు. ఈ గృహాల్లో నివసిస్తున్న వారంతా చిరు వ్యాపారం చేసుకొని జీవిస్తున్నవారే కావడం గమనార్హం. ఆటోలు, బోళ్లు, బుగ్గలతో చిరు వ్యాపారం చేస్తూ రెక్కాడితే గాని డొక్కాడని పేదలే రెండు దశాబ్దాలుగా ఇక్కడ నివసిస్తున్నారు. చాలీ చాలని సంపాదనతో కుటుంబ పోషణ కడుభారమైన పరిస్థితుల్లో శిథిలమైన గృహాలను మరమ్మతు చేసుకోవడం వారికి గగన కుసుమమవుతోంది. ఒకవైపు పేదరికం మరో వైపు శిథిలమైన గృహాల్లో నివసించడం వారికి కత్తిమీద సాములా మారింది. ఎప్పుడు కూలిపోతాయో తెలియని దయనీయ పరిస్థితుల్లో పేదలంతా కొట్టుమిట్టాడుతున్నారు.

రెండేళ్లుగా గృహాలపై కప్పులు పెచ్చులూడి మీద పడడంతో వారంతా రేయింబవళ్లు జంకుతూనే ఉన్నారు. 96 గృహాలు అధికారికంగా అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం ఈ గృహాల్లో సుమారు 150 పై చిలుకు కుటుంబాలు జీవన మనుగడ కొనసాగిస్తున్నాయి. శిథిలమైన తమ గృహాల స్థానంలో పక్కనే ఉన్న స్థలాన్ని కలిపి సుమారు 400 డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇందిరమ్మ పథకం కింద నిర్మించి ఇవ్వాలని వాంబే గృహాల లబ్ధిదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.





పైకప్పు పెచ్చులూడుతున్న వాంబే గృహాలు

ఇందిరమ్మ పథకం కింద గృహాలు నిర్మించాలి..



ఎస్‌కే గౌస్, వాంబే కాలనీ

శిథిలమైన తమ వాంబే గృహాల స్థానంలో సుమారు 400 డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇందిరమ్మ పథకం కింద నిర్మించి ఇవ్వాలి. వాంబే గృహాలు శిథిలావస్థలో ఉండడం వలన పైకప్పులు పెచ్చులూడి పైన పడుతున్నాయి. రేయింబవళ్ల భయంతో బతకాల్సి వస్తోంది.

దినమంతా భయం భయమే..



ఎస్‌కే బూరేబాబు, వాంబే కాలనీ

శిథిలావస్థలో ఉన్న వాంబే గృహాలు ఎప్పుడు కూలిపోతాయో తెలియక దినమంతా వాటిలో భయం భయంగా నివసించాల్సి వస్తోంది. చిరు వ్యాపారులు నివసించే ఈ కాలనీపై ప్రభుత్వం కనికరించి ప్రభుత్వ పథకాల ద్వారా నూతన గృహాలను నిర్మించి ఇవ్వాలి. .సుమారు 200ల పై చిలుకు కుటుంబాలు నివసిస్తున్న వాంబేకాలనీకి ప్రభుత్వ పాఠశాలతో పాటు మౌలిక వసతులు ప్రభుత్వం కల్పించాలి.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

గ్రేటర్ కన్వీనర్‌గా శ్రీనివాస్

హనుమకొండ చౌరస్తా, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశం హనుమకొండ చౌరస్తాలోని అమరావతి సమావేశ మందిరంలో జరిగింది. గ్రేటర్ కన్వీనర్‌గా పనికల శ్రీనివాస్, కో కన్వీనర్లుగా దండ్రె సదానందం, సాదు కుమారస్వామి, పొనుగంటి లక్ష్మీనారాయణలను నియమిస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ బండి అశోక్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బండి అశోక్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని అన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



ఐలమ్మ (ఫైల్)

హసన్‌పర్తి, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటకు చెందిన గిన్నారపు ఐలమ్మ(75) అనే వృద్ధురాలు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఆదివారం నాడు హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం పోస్టాఫీసులో పింఛన్ తీసుకోవడానికి వెళ్లి తిరిగి రాలేదని, బంధువులు, తెలిసిన వారి ఇండ్లలో వెతికినా ఆచూకీ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వృద్ధురాలు ఎరుపు రంగు జాకెట్, ఎరుపు రంగు చీర ధరించి, చామనఛాయ రంగు కలిగి ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్స్

అప్పగించిన పోలీసులు

హనుమకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పీఎస్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్స్‌ను బాధితులకు ఆదివారం హనుమకొండ ఎస్సై కె.అశోక్ అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని కనిపెట్టి 11 మందికి అందజేసినట్లు ఎస్సై తెలిపారు. ఇప్పటి వరకు 410 సెల్‌ఫోన్స్ పోగొట్టుకున్నట్లు ఫిర్యాదులు అందగా, 381 సెల్‌ఫోన్స్ రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు.

బాధిత కార్మికులకు న్యాయం చేయాలి

బాలసముద్రం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): 2021లో వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌లో కార్మికులుగా పని కల్పిస్తామని పేద ప్రజలను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకుని బాధిత కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ మునిసిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, కార్యదర్శి ఉప్పలయ్య అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలాపార్కు సమీపంలో బాధిత కార్మికులతో సమావేశం నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో అమాయక ప్రజలకు మునిసిపల్ కార్మికులుగా పనికల్పిస్తామని ఒక్కొక్కరి వద్ద రూ. 2 నుంచి 3 లక్షల వరకు డబ్బులు వసులు చేసి 13 నెలల వరకు ఆర్డర్ ఇచ్చి యేడాదిపాటు పని చేయించిన తరువాత సుమారు 80 మంది బాధిత కార్మికులను తీసేసినట్టు తెలిపారు. అప్పులు చేసి కాంట్రాక్టర్‌కు బాధితులు డబ్బులు చెల్లిస్తే, తీసుకున్న డబ్బులు ఇవ్వడంలేదని వాపోయారు. కార్పొరేషన్‌లో త్వరలో తీసుకుంటున్న సిబ్బందిలో బాధిత కార్మికులకు అవకాశం కల్పించి ఉద్యోగాల పేరుతో డబ్బులు తీసుకున్న కాంట్రాక్టర్ నుంచి బాధితులకు డబ్బులు ఇప్పించాలని అధికారులను కోరారు.



ఏకశిలాపార్కు ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

శతాధిక వృద్ధురాలి మృతి

కాజీపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సోమిడిలో ఆదివారం శతాధిక వృద్ధురాలు కాగిత పెద్దగొల్ల కొమురమ్మ (110) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఐదు తరాల మనుమలు, మనవరాండ్లను చూసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన అంత్యక్రియల్లో కుటుంబ సభ్యులతో పాటు 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేరొకటి.. ఊరొకటి!

వివేక్‌నగర్ కాలనీకి అమరావతి నగర్ బోర్డు

తికమక పడుతున్న ప్రజలు



వివేక్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన అమరావతినగర్ బోర్డు

వడ్డెపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని వివేక్ నగర్ కాలనీకి మహానగర పాలక సంస్థ అధికారులు అమరావతి నగర్ బోర్డు ఏర్పాటు చేయడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. కాలనీ ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన అమరావతి నగర్ బోర్డును తొలగించి వివేక్ నగర్ పేరుతో బోర్డు ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కాలనీకి చెందిన ప్రజాతంత్ర ఆలోచన వేదిక బాధ్యులు గ్రీవెన్స్ సెల్‌లో కలిసి నాలుగు సార్లు వినతి పత్రాలు సమర్పించారు. ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినప్పటికీ ఇంజనీరింగ్, శానిటరీ అధికారులు బేఖాతర్ చేస్తున్నారని వారు వాపోయారు. కాగా, బోర్డు సమస్య తమది కాదంటే తమది కాదని ఒకరినొకరు తప్పించుకుంటున్నారని, తప్పుడు బోర్డు ఉన్న ఫలితంగా కాలనీకి వచ్చే ప్రజలు అయోమయానికి గురవుతున్నారని, ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వివేక్ నగర్ కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఎంబాడి సేవలు ఎనలేనివి

నివాళి అర్పించిన రోటరీ క్లబ్

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ సభ్యుడిగా మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ అందించిన సేవలు ఎనలేనివని రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సభ్యులు కొనియాడారు. క్లబ్‌సభ్యులు వారి కార్యాలయంలో ఆదివారం సంతాప సమావేశం నిర్వహించారు. నివాళి అర్పించి మౌనం పాటించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు బండారి కుమారస్వామి, సెక్రటరీ వడ్నాల సదానందం, ఉపాధ్యక్షులు తోట సంపత్‌కుమార్, తోట శివకుమార్, సభ్యులు జూలూరి కృష్ణమూర్తి, మదూరి గణేష్‌కుమార్, చకిలం ఉపేందర్, మందల శ్రీనివాస్‌రెడ్డి, కోరె చంద్రమౌళి, పాలడుగు కృష్ణమూర్తి, పొన్న హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



మౌనం పాటిస్తున్న క్లబ్ సభ్యులు



కరీమాబాద్ కల్యాణమండపంలో మాట్లాడుతున్న మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బండి కుమారస్వామి



సభ్యులకు బంగారు కాయిన్స్ అందజేస్తున్న ఏనుమాముల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు గంగ్రాతి భాస్కర్

పరపతి సంఘాలు మధ్యతరగతి ప్రజల నేస్తాలు

- కరీమాబాద్ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కుమారస్వామి
- ఏనుమాములలో ఘనంగా 16వ వార్షికోత్సవం..

కరీమాబాద్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): పరపతి సంఘాలు ప్రజల ఆర్థిక అవసరాలను తీర్చే నేస్తాలని మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు బండి కుమారస్వామి అన్నారు. కరీమాబాద్‌లోని మున్నూరుకాపు కల్యాణమండపం భవనంలో ఆదివారం మున్నూరుకాపు పరపతి సంఘం 23వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బండి కుమారస్వామి మాట్లాడుతూ.. పరపతి సంఘాలు ప్రజల ఆర్థిక అవసరాలను తీర్చే నేస్తాలని అన్నారు. 2001లో స్థాపించిన ఈ సంఘం 600 వందల మంది సభ్యుల సహకారంతో అభివృద్ధి చెందినదని అన్నారు. సంఘాభివృద్ధికి సహకరిస్తున్న కార్యవర్గ సభ్యులకు, సర్వసభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సంఘ సభ్యులకు రుణాలు అందించడంతో పాటు వారి ఆర్థిక అవసరాలకు తీర్చేందుకు ఈ సంఘం సభ్యులకు ఎంతగానో దోహదప డుతుందన్నారు. ఈ సందర్భంగా సభ్యుల ముందు వార్షిక నివేదిక ప్రవేశపెట్టారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నుకున్న నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా బండి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి బండి మోహన్, ఆర్గనైజర్ వొగిలిశెట్టి అనిల్‌కుమార్, కొమ్మిని రాజేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను సభ్యులు ఆమోదించారు.

వరంగల్ సిటీ, అక్టోబరు27: (ఆంధ్రజ్యోతి): మధ్య తరగతి కుటుంబాలకు పరపతి సహకార సేవా సంఘాలు మణిదీపం లాంటివని ఏనుమాముల మున్నూరుకాపు సేవా సంఘం అధ్యక్షుడు గంగ్రాతి భాస్కర్ అన్నారు. ఏనుమాముల మార్కెట్ సమీపంలో ఆదివారం ఏనుమాముల మున్నూరుకాపు కుల సేవా సంఘం 16వ వార్షికోత్సవాన్ని సంఘం అధ్యక్షుడు గంగ్రాతి భాస్కర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక ఆదాయ, వ్యయాల నివేదికను సభ్యులకు అందజేసి ఆమోదింపచేసుకున్నారు. అనంతరం గంగ్రాతి భాస్కర్ మాట్లాడుతూ.. కుల సంఘాలు ఆర్థిక, సమాజికాభివృద్ధికి దోహదపడడమే కాకుండా అందరూ ఒక చోట కుటుంబాలతో సహా కలుసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. సంఘంలోని 323 మంది సభ్యులకు పావుతులం బంగారు బిల్లలను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగ్రాతి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా గంగ్రాతి నవీన్, కోశాధికారిగా యనమందల క్రిష్ణ, ఉపాధ్యక్షులు కొమాండ్ల రాజు, నీలం శ్రీను, సహాయ కార్యదర్శి నిడిగొండ శ్యామ్, కమిటీ సభ్యులుగా వెంకటేశ్వర్లు, రవి, రాంచందర్, వీరభద్రయ్య, చంద్రశేఖర్; రాజు, స్వామి, సతీష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యావంతులతోనే మెరుగైన సమాజ నిర్మాణం

హెప్సిబా మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ సదానందం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

హసన్‌పర్తి, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యావంతులతోనే మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమని హెప్సిబా మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గిన్నారపు సదానందం అన్నారు. మండలంలోని సీతంపేట హెప్సిబా మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల గ్రామం నుంచి ఎంపికైన ప్రభుత్వ ఉపాధ్యాయులను ఆదివారం సన్మానించారు. నూతనంగా ఎంపికైన ప్రభుత్వ ఉపాధ్యాయులు మంచాల అనుష, ఆడెపు వనజ, వల్లాల నీరజ, దాసి శారధ, గోదెర రవిచందర్, ఆరెల్లి రాకేష్, తోకల సబిత, తోకల సత్యపాల్‌రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యావంతులకే అధిక ప్రాధాన్యత ఉందన్నారు. విద్యావంతులైన విద్యార్థులకే సమాజంలో ఎన్నో గొప్పగొప్ప అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ప్రతీ ఒక్కరు చదువుకొని ఉన్నతంగా రాణించి సమసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నద్దునూరి చేరాలు, చిర్ర స్వప్నతిరుపతిగౌడ్, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు సూర రవీందర్, రమేష్, విశ్రాంత అధ్యాపకులు మేక రాజిరెడ్డి, రాజమహ్మద్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు రాజయ్య, బాబు, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కాళోజీ జంక్షన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలోని శ్రీరామకృష్ణా సేవా సమితి ప్రాంగణంలో ఆదివారం ఓరుగల్లు హోమియోపతి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు కటంగూరి సత్యనారాయణరెడ్డి జ్యోతిని వెలిగించి శిబిరాన్ని ప్రారంభించారు. సమితి ఆధ్వర్యంలో ఇక నుంచి ప్రతీ రెండవ, నాల్గోవ ఆదివారాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వైద్య సేవలు ప్రారంభం రోజున 20 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. వీణా హోమియోపతి డాక్టర్ల గౌరవ అధ్యక్షులు డాక్టర్ సుధాకర్‌రావు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి కమిటీ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస స్వామి, కేవీ రావు, కె.సూర్య, లక్ష్మీరావు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణరెడ్డి

కేబినెట్ నిర్ణయాలపై ఉపాధ్యాయుల అసంతృప్తి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కేబినెట్ నిర్ణయాల పట్ల ఉపాధ్యాయ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని యూటీఎఫ్ వరంగల్ జిల్లా ప్రధానకార్యదర్శి సి.సుజన్ ప్రసాద్‌రావు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చూసి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి చేయకుండా ఓపికతో ఉంటున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందని ఆయన ఆరోపించారు. మూడు డీఏలు ప్రకటించాలని, జీవోనెంబరు 317 బాధితులకు న్యాయం చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని ఆయన ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఒక డీఏ ప్రకటనతో అసహనం..

మడికొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఒక డీఏ ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం విచారకరమని, ఈ ప్రకటనతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచుకాల లింగారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన పదిహేను రోజుల్లోనే బకాయి పడిన మూడు వాయిదాల డీఏ విడుదల చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొని అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచిన తర్వాత ప్రభుత్వం ఒక డీఏ ప్రకటిచండం హాస్యాస్పదంగా ఉందన్నారు. మరో రెండు వాయిదాలు బకాయి పడటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఉద్యోగులతో చర్చల తర్వాత కనీసం రెండు డీఏలు అయినా ఇస్తారని భావించగా ప్రభుత్వం ఒక్క డీఏ ప్రకటిచండంతో ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే పునః సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని లింగారావు స్పష్టం చేశారు.

ప్రయాణికులకు ప్రాణసంకటం

కంకర తేలిన తూర్పు కోట - చింతల్ రోడ్డు

4 నెలలుగా ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



కంకర తేలిన తూర్పుకోట - వరంగల్ రోడ్డు

ఖిలావరంగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్ 37వ డివిజన్ తూర్పుకోట నుంచి చింతల్ మీదుగా వరంగల్‌కు వెళ్లే రోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా తయారైంది. ఈ రోడ్డును 4 నెలల క్రితం తవ్వి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2023 సెప్టెంబర్‌లో రూ.4కోట్ల సీఎంఏ నిధుల నుంచి 37వ డివిజన్ తూర్పుకోటలో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, సెంట్రల్ లైటింగ్ తదితర అభివృద్ధి పనుల కోసం అప్పటి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శంకుస్థాపన చేశారు. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. యేడాదిగా తూర్పుకోటలో చేయాల్సిన పనులు నిలిచిపోయాయి.

ఇటీవల మంత్రి కొండా సురేఖ చొరవతో తూర్పుకోట హనుమాన్ జంక్షన్ నుంచి ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్ వరకు 1కిలోమీటర్ వరకు రూ.50లక్షలతో పనులను కార్పొరేషన్ అధికారులు ప్రారంభించారు. గతంలో ఉన్న మెటల్ రోడ్డును జూన్‌లో తొలగించి కంకర పోసి వదిలేశారు. ట్యాంకర్ల ద్వారా నీళ్లు చల్లుతూ రోడ్డు రోలర్‌తో తొక్కిస్తున్నారు. అయితే ఈ రోడ్డు పనులు చేయించడంలో నాయకులు, సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారు. దీంతో తూర్పుకోటతో పాటు స్తంభంపల్లి, వసంతాపూర్, వెంకటాపూర్, ధూపకుంట, నక్కలపల్లి తదితర గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారి వాహనాలు పాడవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా భారీ వాహనాల రాకపోకలతో హనుమాన్ దేవాలయం నుంచి వాకింగ్ గ్రౌండ్‌కు వెళ్లే రోడ్డుకిరువైపులా ఉన్న ఇళ్లల్లోకి దుమ్ము, ధూళితో పాటు, కంకర రాళ్లు వస్తున్నాయని, ఇప్పటికైనా ఈ రోడ్డు బాగుచేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు.

చిట్‌చాట్

రైతు కోసం.. రోడ్డెక్కుతాం..


- రుణమాఫీ లేదు.. రైతు భరోసా రాదు..
- ఈ నెల 30 వరకు వేచి చూస్తాం..
- పత్తికి మద్దతు ధర .. దొడ్డు వడ్లకు బోనస్ ఏమైంది?
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రైతు సమస్యలపై ఈ నెల 30వ తేదీ వరకు వేచి చూస్తాం.. ఆలోగా ప్రభుత్వం రైతుల సమస్యలపై నిర్ణయాలు తీసుకోకుంటే అన్నదాతల కోసం బీఆర్ఎస్ రోడ్డెక్కుతుంది. ఆ రోజుల్లో వరంగల్ రైతాంగానికి పెద్దదిక్కుగా ఉన్న ఎస్సారెస్పీ నీటి కోసం బాబ్లీ గేట్లు పగులకొట్టి జైలుకెళ్లాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ రైతులకు ఇచ్చిన హమీల అమలు కోసం రైతాంగం కోసం ఆందోళనలకు కార్యచరణ రూపొందిస్తున్నాం' అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'తో చిట్‌చాట్‌లో పలు అంశాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : ఎన్నికల్లో ఓడినప్పటి నుంచి క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు ఉంది..?

ఎర్రబెల్లి: ఓడినా.. గెలిచినా.. నేను ప్రజల మనిషిని. వారంలో నాలుగైదు రోజులు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్నా. రైతులు తీవ్ర కష్టాల్లో ఉన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతగా వారికి అండగా నిలబడాల్సిన బాధ్యత నాకు ఉంది.



ఆంధ్రజ్యోతి ప్రతినిధి: మాది ఇందిరమ్మ ప్రభుత్వం, రైతులకు అండగా ఉంటున్నాం.. అని చెప్పుతున్నారు కదా..?

ఎర్రబెల్లి: రైతు రుణమాఫీ సగం మందికి కూడా చేయలేదు. రైతు భరోసా రూ.15,000 ఎవరికైనా ఇచ్చారా..? కౌలు రైతులకు రూ.15వేల సాయం అందిందా..? 24గంటల కరెంట్ ఇస్తున్నారా..? పత్తికి మద్దతు ధర రూ.7,521లు వస్తున్నాయా..? ఎక్కడ రైతులకు ఈ ప్రభుత్వం అండగా నిలిచింది?

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: సన్నవడ్లకు రూ.500బోనస్ ప్రకటించింది కదా..?

ఎర్రబెల్లి: ఎన్నికల్లో వడ్లకు రూ.500బోనస్ ఇస్తామని చెప్పారు. ఇప్పుడేమో సన్నవడ్లకే బోనస్ అంటున్నారు. మన ఉమ్మడి వరంగల్ జిల్లాలో 70శాతం రైతులు దొడ్డు వడ్లే పండిస్తారు. ప్రభుత్వ నిర్ణయంతో రైతాంగానికి తీవ్రంగా నష్టం జరగటం లేదా..?

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: మీ ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా రైతులకు ఏం చేయలేదనే విమర్శలు ఉన్నాయి కదా..?

ఎర్రబెల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తేనే అన్ని చెరువుల్లోకి నీళ్లు వచ్చినయ్. ఉమ్మడి వరంగల్‌లో కొన్నిచోట్ల మూడు పంటలు తీసిండ్లు. ఇప్పుడు కాళేశ్వరం బంద్ చేసిండ్లు. సగం కూడా వరి సాగు కావటం లేదు. ఉమ్మడి వరంగల్‌కు ఎస్సారెస్పీ నీళ్లు, దేవాదుల నీళ్లు, రైతు బీమా, రైతుబంధు, 24గంటల ఉచిత కరెంట్ తెచ్చింది మేమే కదా..

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: దేవాదుల ప్రాజెక్టును, ఎస్సారెస్పీని పట్టించుకోలేదు అనే ఆరోపణలు ఉన్నాయి కదా..?

ఎర్రబెల్లి: దేవాదుల ప్రాజెక్టును ప్రారంభించింది చంద్రబాబు నాయుడు. ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదులను పెద్దగా పట్టించుకోలే. కేసీఆర్ సీఎం అయిన తరువాతే తుపాకులగూడెం వద్ద బ్యారేజీ కట్టినం. దేవాదుల 80శాతం పనులు పూర్తి చేసినం. ఎస్సారెస్పీకి నీళ్లు రాకుండా మహారాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడితే బాబ్లీ గేట్లు పగలకొట్టి వరంగల్ రైతుల కోసం జైలుకెళ్లాను.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: మొత్తానికి ఇప్పుడు రైతు ఎజెండాగా జనల్లోకి వెళ్లాలని నిర్ణయించారా..?

ఎర్రబెల్లి: ఇప్పుడు కష్టాల్లో ఉన్నది రైతులే కదా.. తేమ పేరుతో పత్తికి మద్దతు ధర, దొడ్డు వడ్లకు రూ.500బోనస్, రూ.15వేల రైతు భరోసా, కౌలు రైతు సాయం తదితర సమస్యల కోసం రైతుల కోసం రోడ్డెక్కెందుకు సిద్ధమవుతున్నాం. రైతును ఏడ్పించిన ఏ రాజ్యం బాగుపడలేదు..

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: ఎప్పటి నుంచి రైతు కోసం ఆందోళనలు..?

ఎర్రబెల్లి: ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వానికి గడవు ఇచ్చాం. రైతు సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే నవంబరు నెలలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుకు అండగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందిస్తున్నాం.

- జాగ్రత్తలు పాటించకపోతే ధరలో కోత
- రైతులు తేమ విషయంలో అప్రమత్తత పాటించాలి
- రైతులకు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి నిర్మల





మీ పత్తి బంగారం కావాలంటే..

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వాతావరణ ప్రతికూల పరిస్థితులతో అంతంత మాత్రం పత్తి దిగుబడి వచ్చింది. వచ్చిన పత్తిని నాణ్యతగా మార్కెట్‌కు తరలిస్తేనే గిట్టుబాటు అవుతుంది. ఈ విషయంలో రైతులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా.. రైతులు పెద్ద ఎత్తున నష్టపోవాల్సి ఉంటుంది. పంటను ఎంతో శ్రద్ధతో సాగు చేసిన రైతులు వచ్చిన దిగుబడిని విక్రయించే సమయంలో మాత్రం కాస్త నిర్లక్ష్యం చేస్తుంటారు. ఫలితంగా ఆశించిన రీతిలో ధర రాదు. ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించింది ప్రభుత్వం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రావాలంటే.. పత్తి నాణ్యతగా ఉండాలి. తేమశాతం ఎక్కువగా ఉంటే ధర కోత పడుతుంది. ఇప్పటికే సీసీఐ పత్తి కొనుగోళ్లను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చేముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ? తేమకు సంబంధించి ఎలా అప్రమత్తంగా ఉండాలి. మంచి ధర రావాలంటే ఏం చేయాలనే అంశాలపై ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మలతో మాట్లాడి అందిస్తున్న ప్రత్యేక కథనం.

పత్తి రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు..

- చేనుపై పత్తి పూర్తిగా విచ్చుకుని బుగ్గలున్న సమయంలో మాత్రమే పత్తి తీయాలి.
- పూర్తిగా ఆరిన తరువాత ఏ మాత్రం తేమలేని సమయంలో పత్తి పూర్తిగా విచ్చుకుని చివరకు చెట్టు నుంచి కారిపోవడం మీరు గమనించవచ్చు.
- చేను నుంచి తీసిన పత్తిని నీడలో ఒకటి రెండు రోజులు ఆరబెట్టాలి. పూర్తిగా ఎండలో ఆరబెట్టడం వల్ల నాణ్యత తగ్గే అవకాశం ఉంటుంది. రెండు రోజులు నీడలో ఆరబెట్టిన తరువాత బస్తాల్లో కానీ విడిగా గదిలో గానీ నిల్వ చేయడం వల్ల ఎలాంటి తేమ పెరుగదు.
- చేనుపై పత్తి ఉన్న సమయంలో వర్షాలు కురిస్తే వెంటనే పత్తి తీయకుండా నాలుగు రోజులు చెట్టుమీదనే పూర్తిగా ఆరేలా చూడాలి. ఆ తరువాతే పత్తి తీయాలి.
- ఎక్కువ తూకం వస్తుందని నీటిని కలిపి తీసుకురావడం వల్ల అసలుకే మోసం వచ్చే పరిస్థితి ఉంటుంది. నీటిని కలుపడం వల్ల రంగు మారి నాణ్యత తగ్గిపోతుంది. ఒకటి రెండు కిలోల తూకం కోసం ఆశపడి మొత్తం పత్తిని నాశనం చేసుకోవద్దు. నాణ్యమైన పత్తిని తీసుకురావడం వల్ల మంచి ధరను పొందవచ్చు.
- పత్తిని ఉదయం పూట, సాయంత్రం సమయాల్లో కాకుండా కొద్దిగా ఎండ ఉన్న సమయాల్లో తీయాలి.
- పత్తిని తీసే కూలీలకు ముందుగానే సలహాలు ఇవ్వాలి. ఎలాంటి పత్తిని తీయాలనేది చెబితే బాగుటుంది. మంచి పత్తి, గుడ్డి పత్తిని వేరువేరుగా తీసేలా చూడాలి. వేర్వేరుగానే మార్కెట్‌కు తీసుకురావాలి.
- వివిధ రకాలైన పత్తిని ఒకేచోట కలుపరాదు. ఎందుకంటే అన్ని రకాల పత్తి గింజలు ఒకేలా ఉండవు. రంగుల్లో తేడాలుంటాయి. చూడగానే వ్యాపారులకు అనుమానం వస్తుంది. అందువల్ల ఏ రకానికి ఆరకం మార్కెట్‌కు తీసుకవెళ్లాలి.
- మార్కెట్‌కు పత్తిని సంచుల్లో కాకుండా ట్రాలీ వాహనాల్లో తీసుకురావడం వల్ల సీసీఐ కొనుగోలు చేస్తుంది.
- సీసీఐ పత్తి కొనుగోలు చేయాలంటే రైతులు ఈ సూచనలు పాటించాలి. రైతులు తమ బ్యాంకు ఖాతా మొదటి రెండు పేజీల జిరాక్స్, పట్టాదార్ పాస్‌బుక్, ఆదార్‌కార్డు, ఆధార్‌లింక్ ఉన్న మొబైల్(ఓటీపీ కోసం) తీసుకురావాలి.

తేమను ఇలా గుర్తిస్తారు

సీసీఐ పత్తి ఖరీదు చేసే సమయంలో తేమ శాతాన్ని ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటారు. 8 శాతం తేమ ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లిస్తుంది. పత్తిలో తేమ శాతం తెలుసుకోవడానికి అధికారులు ప్రత్యేక పరికరాన్ని వినియోగిస్తారు. ఈ పరికరం పొడవు 18 అంగుళాలు రెండు కడ్డీలకు ఉన్న తీగల ద్వారా డిజిటల్ మీటర్‌కు అనుసంధానం చేసి ఉంటుంది. రెండు కడ్డీలు పత్తిలో గుచ్చిన సమయంలో డిజిటల్ మీటర్ పత్తిలో తేమ శాతాన్ని అంకెలలో చూపిస్తుంది.



ఏనుమాముల మార్కెట్

తేమశాతాన్ని పెంచాలి

పత్తిలో తేమశాతాన్ని పెంచాలని రైతులు, రైతుల పక్షాన కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఇప్పటికే కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం 8 శాతం ఉన్న దానికి మాత్రమే మద్దతు ధర లభిస్తుంది. దానిని 10 శాతానికి పెంచాలని కోరుతున్నారు. అదే విధంగా 8 నుంచి 12 వరకు తేమశాతం ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తుంది. అలాకాకుండా 15 నుంచి 18 వరకు తేమశాతం ఉన్న పత్తిని కూడా సీసీఐ కొనుగోలు చేయాలని రైతుల పక్షాన కాటన్ అసోసియేషన్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది.

పత్తికి మద్దతు ధర క్వింటా...రూ.7521లు

పత్తి రైతులకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 7521లు ప్రకటించింది. అకాల వర్షాలు, అనుకూలంగాలేని వాతావరణ పరిస్థితుల్లో పెరిగిన పెట్టుబడులు, కూలీల రేట్లు పెరిగిన నేపథ్యంలో రైతులు మద్దతు ధరను రాబట్టుకోవాలంటే తప్పకుండా సీసీఐ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. పత్తిలో తేమశాతం పెరిగిన కొద్దీ ధరలో కోత పడుతుంది. రైతులు ఇది గమనించాలి.

పత్తిలో తేమ శాతం	మద్దతు ధర
8 శాతం	రూ.7.521
9 శాతం	రూ.7.445
10 శాతం	రూ.7.370
11 శాతం	రూ.7.295
12 శాతం	రూ.7.220

సైక్లింగ్‌తో ఆరోగ్యం, ఉత్సాహం

- సైక్లింగ్‌కు పోలీసులు కొంత సమయం కేటాయించాలి
- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝూ పిలుపు
- పోలీసు అమరులను స్మరిస్తూ సైకిల్ ర్యాలీ

హనుమకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రోజు సైక్లింగ్ చేయడం వల్ల మరింత ఆరోగ్యంగా ఉండడంతోపాటు రోజంగా ఉత్సాహంగా తమ విధుల్లో రాణించొచ్చని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మకరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఏజే పెడల్స్ ట్రైసిటీ సైకిల్ రైడర్స్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈర్యాలీలో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పచ్చజెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు సైక్లింగ్ కోసం కొద్ది సమయాన్ని కేటాయించడం ద్వారా ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చని అన్నారు. అలాగే పోలీసు అమరవీరులను స్మరిస్తూ నిర్వహించిన ఈ ర్యాలీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి పోలీసు అమరవీరుల



సైకిల్ ర్యాలీలో సీపీ అంబర్ కిశోర్ ఝూ

కుటుంబాలతో పాటు పోలీసు పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా, సైకిల్ ర్యాలీ పోలీసు కమిషనరేట్ కార్యాలయం నుంచి హనుమకొండ చౌరస్తా, ఎంజీఎం, మట్టెవాడ పోలీసు స్టేషన్‌కు చేరి తిరిగి అదే మార్గం నుంచి బాలసముద్రం, నక్కలగుట్ట మీదుగా సీపీ కార్యాలయానికి చేరుకుంది. ఈ ర్యాలీలో సీపీ అంబర్ కిశోర్ ఝూ సైకిల్ రైడర్స్‌తో కలిసి పాల్గొన్నారు. స్వయంగా సైకిల్ తొక్కుతూ సైకిల్ రైడర్స్‌ను ఉత్సాహపరిచారు. పోలీసు అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. సీపీతో పాటు యువకులు, చిన్నారులు, వృద్ధులు, పోలీసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరరం సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సైకిల్ రైడర్స్‌కు పోలీసు అధికారుల చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ ర్యాలీలో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, అనంతయ్య, ఇన్స్‌పెక్టర్లు, ఆర్‌ఐలు, ఏజే పెడల్స్ యాజమాన్యం, ట్రైసిటీ సైకిల్ రైడర్స్, పబ్లిక్‌గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, నిట్ కళాశాల విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నాడు ధూప దీపం.. నేడు పశువుల కొట్టం

పట్టించుకోండి..



హనుమకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల కాలంలో నిర్మితమైన త్రికూటాలయం ఇది. నాడు రాజుల పాలనలో ఈ ఆలయం దూప దీప నైవేద్యాలతో నిత్యం కళకళాలాడుతూ ఉండేది. నేడు ఇది పశువుల పాకగా మారింది. పాలకులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఈ ఆలయం ఆవరణలో పశువులను కట్టేసుకుంటున్నారు. ఇది వరంగల్ నగర సమీపంలో కొండపర్తి గ్రామంలోని ఓరుగల్లు చారిత్రక వారసత్వ సంపదకు సంబంధించి నాటి .. నేటి పరిస్థితి.

- ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్/ ఆంధ్రజ్యోతి హనుమకొండ

ఆధ్యాత్మికం

పురాతన విగ్రహాలు లభ్యం

రెడ్డికాలనీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ములుగు రోడ్డు సమీపంలో పురాతన విగ్రహాలు తవ్వకాల్లో బయటపడ్డాయి. వెంటనే స్థానికులు పూజలు నిర్వహించారు. హనుమకొండ ములుగురోడ్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్ కార్నర్‌లోని పెట్రోల్ బంక్ వెనుక కొన్ని నిర్మాణాల కోసం తవ్వకాలు చేపట్టారు. ఈ క్రమంలో పురాతన విగ్రహం బయట పడింది. ఆ నోట ఈ నోట బయటికి విషయం పొక్కడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో ఆ విగ్రహానికి పూజలు చేశారు.



లభ్యమైన విగ్రహాలు

దత్తక్షేత్రంలో వైభవంగా తైలాభిషేకం

వరంగల్ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో ఆదివారం స్వామివారికి తైలాభిషేకాన్ని అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా తైలంతో పాటు క్షీరాభిషేకం, పంచామృతాలను అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలిరాగా అందరి చేత ఉత్సవమూర్తికి తైలంతో భక్తులు అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి అలంకరణ, మహా మంగళహారతి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది.



భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారిని పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు దర్శించుకోవడానికి ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన సత్రంలో భోజన ప్రసాద వితరణ జరిగింది. అమ్మవారిని నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, వ్యాపారులు, అధికారులు దర్శించుకున్నారు. ఈవో, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాణసంచా.. జీరో దందా..

- జనవాసాల మధ్యలో టపాకుల దుకాణాలు
- నగరంలో అనధికారికంగా బాణసంచా గోదాములు
- ప్రభుత్వ శాఖల పర్యవేక్షణ ఏది?
- అధికారులను ప్రసన్నం చేసుకుంటున్న వ్యాపారులు

వరంగల్ నగరంలో బాణసంచా జీరోదందా వ్యాపారం జోరుగా సాగుతోంది. జనవాసాల మధ్య టపాకుల దుకాణాలు వెలుస్తున్నాయి. అనధికారికంగా బాణసంచా గోదాములు, అక్రమంగా బాణాసంచా నిల్వలు పుట్టుకొస్తున్నాయి. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న షాపుల దందా నగరంలో యథేచ్ఛగా సాగుతోంది. అయినా ప్రభుత్వ శాఖలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు హడావుడి చేస్తూ తరువాత పట్టించుకోరనే విమర్శలున్నాయి.

మట్టెవాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ప్రధాన రోడ్లపై జనవాసాల మధ్య బాణాసంచా వ్యాపారం జోరుగా నిర్వహిస్తున్నారు. నగరంలో టపాసుల వ్యాపారంలో అమ్మకందారులు బిజీబిజీగా బాణసంచా అమ్మకాల్లో తలమునకలయ్యారు. వ్యాపారులు నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిగా విక్రయాలు కొనసాగిస్తున్నారు. వెలుగులు చిమ్మే దీపావళి పండుగను పురస్కరించుకొని నగరంలో బాణాసంచా విక్రయాలు ఊపందుకుంటున్నాయి. బాణసంచా వ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కుతూ పెద్దమొత్తంలో బాణాసంచా నిల్వలు, అనధికార గోదాములు నిర్వహిస్తున్నారు. దుకాణాల సామర్థ్యానికి మించి విక్రయాలు చేయడం, అనధికారంగా గోదాముల్లో టన్నుల కొద్ది టపాకులు నిల్వ ఉంచుతున్నారు. వరంగల్ నగరం, శివారు ప్రాంతాల్లో అనధికారికంగా గోదాములు నిర్వహిస్తున్నారు. వీటిని తనిఖీ చేయాల్సిన అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ శాఖల అదికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

శివకాశి నుంచి..

దీపావళి సందర్భంగా నగరంలో రూ.కోట్లలో బాణసంచా వ్యాపారం జరుగుతుంది. తమిళనాడు శివకాశి నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెద్దపల్లి, మానకొండూరు, హైదరాబాద్‌లోని రామాంతాపూర్, సిద్ధిపేట ప్రాంతాల్లో లక్షల కిలుల లైసెన్స్ కలిగిన గోదాములు ఉన్నాయి. ఈ ప్రాంతాల నుంచి వరంగల్‌లోని 9 పెద్ద బాణాసంచా షాపులకు సరుకు రవాణా జరుగుతుంది. వరంగల్ జిల్లాలో బాణాసంచా గోదాములకు అనుమతులు లేవు. అయితే ఇక్కడి వ్యాపారులు కొంతమంది ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొనుగోలు చేసిన బాణసంచాను అక్కడి నుంచి వరంగల్ నగరంలోని శివారు ప్రాంతాలలో అనధికారికంగా పెద్ద మొత్తంలో బాణాసంచా నిల్వ చేస్తున్నారు. విక్రయ లైసెన్స్ కలిగిన ఈ 9 షాపుల్లో ఏ ఒక్కటికీ గోదాము లైసెన్స్ లేవు.



సిండికేట్

వరంగల్, హనుమకొండ, కాజీపేటతో పాటు శివారు ప్రాంతాల్లో బాణాసంచా వ్యాపారం నిర్వహించే హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు సిండికేట్‌గా మారి తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. అదే విధంగా 9 మంది బడా షాపుల యజమానులు సిండికేట్‌గా మారి తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు.

టపాకుల ధరల దడ

వరంగల్‌లో బాణాసంచా వ్యాపారులు టపాకుల ధరలను భారీగానే పెంచారు. దీపావళి పండుగను దృష్టిలో పెట్టుకొని డిమాండ్‌కు అనుగుణంగా బాణసంచా విక్రయదారులు ధరలను పెంచారు. ముఖ్యంగా క్రాకర్స్ షాట్స్, చిచ్చుబుడ్డీలు, ఫ్యాన్సీ ఐటమ్స్‌ల ధరలు భారీగా పెరిగాయి. ఉదాహరణకు 120 షాట్స్ ధర శివకాశీలో 900 ఉంటే వరంగల్‌లో రూ.2000పైనే అమ్ముతున్నారు. 60 షాట్స్ 450 ఉండగా, వరంగల్‌లో 1500కు విక్రయిస్తున్నారు 30 షాట్స్ 225 ఉండగా, ఇక్కడ రూ.900కు విక్రయిస్తున్నారు.

ప్రభుత్వ శాఖలకు పండుగే..

దీపావళి పండుగ వచ్చిందంటే పలు ప్రభుత్వ శాఖలకు పండుగే. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను సిండిగేట్‌గా మారిన బాణాసంచా వ్యాపారులు ప్రసన్నం చేసుకొంటున్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతూ యథేచ్ఛగా తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. బాణసంచా వ్యాపారులు పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ శాఖలతో పాటు స్థానిక పోలీసులకు ధనలక్ష్మీతో ప్రసన్నం చేసుకున్నట్లు వ్యాపార వర్గాల్లో చర్చ సాగుతోంది.

కమ్మని కాఫీ తాగేద్దామా!



కాఫీని ఇష్టపడనివారుండరు. ఇది అందరికీ అందుబాటులో ఉండే ఎనర్జీ డ్రింక్. కాఫీ తాగినపుడు అందులో ఉండే కెఫిన్ వల్ల నాడీ వ్యవస్థ ప్రభావితమై మెదడు పనితీరు వేగవంతమవుతుంది. మనసు ఉత్తేజంగా అనిపిస్తుంది. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, చురుకుదనం పెరుగుతాయి. ఇలా కాఫీ అందించే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

- కాఫీలో మెగ్నీషియం, పొటాషియం, మాంగనీస్, పాస్ఫరస్, సోడియం, జింక్ వంటి ఖనిజ లవణాలు, తక్కువ పరిమాణంలో క్యాలరీలు, కార్బోహైడ్రేట్లు, బి, కె విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. వీటివల్ల తక్షణ శక్తి లభిస్తుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది.
- రోజుకు రెండు కప్పుల కాఫీ తాగడం వల్ల డోపమైన్ హార్మోన్ నియంత్రణలో ఉండి కుంగుబాటు సమస్యను నిరోధిస్తుంది. కరోనరీ గుండె జబ్బులు, కార్డియోవాస్కులర్ రుగ్మతలు, టైప్-2 డయాబెటిస్ సమస్యలు తగ్గుతాయి. కాఫీలో ఉండే క్లోరోజెనిక్ ఆమ్లాలు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కళ్లను రెటినాల్ డిజనరేషన్ సమస్యల నుంచి కాపాడతాయి.
- మెదడు, వెన్నెముకల్లోని నరాల రక్షణ కవచాన్ని దెబ్బతీసే ప్రో ఇన్‌ఫ్లమేటరీ సైటోకైన్స్ అణువుల ఉత్పత్తిని కెఫిన్ అడ్డుకుంటుందనీ అందుకే ప్రతి రోజూ కాఫీ తాగేవారిలో మల్టిపుల్ స్క్లెరోసిస్ సమస్యలు రావని నిపుణులు చెబుతున్నారు.
- తరచూ కాఫీ తాగడం వల్ల కాలేయంలో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయంలో అత్యధిక ఎంజైమ్‌ల ఉత్పత్తి, కాలేయ క్యాన్సర్, ఫైబ్రోసిస్ వంటి సమస్యల నివారణకు కెఫిన్ తోడ్పడుతుంది.
- మహిళలు రోజూ కాఫీ తాగితే మెనోపాజ్ తరవాత రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుంది. కాఫీలోని బయో యాక్టివ్ సమ్మేళనాలు పెద్దపేగు క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్. ఓరల్ క్యాన్సర్లను నిరోధిస్తాయి.
- కాఫీ పొడిని స్వచ్ఛమైన పాలతో కలిపి తాగాలి. బ్లాక్ కాఫీ కూడా ఆరోగ్యానికి మంచిదే. చక్కెరలేని కాఫీ తాగడం వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. వ్యాయామం తరవాత వచ్చే అలసట తగ్గుతుంది. ఆస్తమా, మూత్రపిండాల్లో రాళ్లు, దంతక్షయ సమస్యలు, తలనొప్పి, మలబద్ధకం, అల్జీమర్స్ రాకుండా చేస్తుంది. భోజనం తరవాత, ఖాళీ కడుపుతో, రాత్రి పడుకొనే ముందు కాఫీ తాగకూడదు. దీనివల్ల ఎసిడిటీ సమస్యలు వస్తాయి.

ఇంటి గార్డెన్ కోసం ఇలా...



ఇంటి చుట్టూ మొక్కలు పెంచుకోవాలనే కోరిక అందరికీ ఉంటుంది. కానీ కొంతమంది మాత్రమే ఆ కలను సాకారం చేసుకుంటారు. నిజానికి ఇంటిని పచ్చని పొదరిల్లుగా మార్చుకోవాలంటే కొద్దిగా ఆసక్తి, కొంచెం ప్రణాళిక ఉంటే సరిపోతుంది. గార్డెనింగ్ ఏర్పాటు విషయంలో నిపుణులు సూచిస్తున్న సలహాలు ఇవి..

- ముందుగా స్థలం ఎంపిక చేసుకోవాలి. ఐదారు గంటల పాటు సూర్యరశ్మి నేరుగా పడే స్థలానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇండోర్‌లో అయితే గాలి బలంగా వీచే ప్రదేశాలను వీలైనంత వరకు ఎంచుకోకూడదు. స్థలం ఎంపిక చేసుకున్న తరువాత మొక్కల ఎంపిక చేపట్టాలి. పూల మొక్కలు కావాలా? హెర్బ్స్ పెంచుకుంటారా? కూరగాయల మొక్కలకు ప్రాధాన్యం ఇస్తారా? అన్నది ముందుగా నిర్ణయించుకోవాలి. తరువాత పనిముట్లను సమకూర్చుకోవాలి.
- నల్లరేగడి మట్టి మొక్కల పెంపకానికి అనువైనది. ఎర్రనేలలు తేమను నిలుపుకోవు. కాబట్టి ఈ నేల రకాలు అంత అనువైనవి కావు. అయితే ఈ నేలలో సారవంతమైన మట్టిని తెచ్చిపోయడం ద్వారా మొక్కలకు అనువైనదిగా మార్చుకోవచ్చు. వర్మీ కంపోస్ట్, ఎరువులు కలుపుకోవడం ద్వారా నేలలో మొక్కలకు కావలసినంత పోషకాలు లభించేలా చేయవచ్చు.
- మొక్కలు ఎంపిక చేసుకునే ముందు మొక్కలు పెరిగే ఎత్తును దృష్టిలో ఉంచుకోవాలి. వాతావరణ పరిస్థితులనుకూడా దృష్టిలో పెట్టుకోవాలి. పూలమొక్కలు, పొదల్లా పెరిగే మొక్కలు, తీగలతో అల్లుకుపోయే మొక్కల్లో మీ స్థలం, అభిరుచిని బట్టి ఎంచుకోవాలి. పూల మొక్కలు గార్డెన్‌ను ఆకర్షణీయంగా మారుస్తాయి. పూల మొక్కలు పెంచుకోవడానికి కుండీలు ఎంపిక చేసుకోవాలి. టొమాటో, పాలకూర, ముల్లంగి, అల్లం, వెల్లుల్లి, కొత్తిమీర వంటి ఆకుకూరలు, దుంపలను వెడల్పాటి టబ్బుల్లో పెంచుకోవచ్చు. స్థలం ఎక్కువగా ఉంటే బీర, కాకర, చిక్కుడు వంటి తీగలు పారే మొక్కలను పెంచుకోవచ్చు.
- మొక్కలు నాటిన మొదటి వారంలో రోజూ నీరు పట్టాలి. రెండవ వారం నుంచి రెండు రోజులకొకసారి నీరు పడితే సరిపోతుంది. మొక్కలు బాగా పెరిగాక వారానికొకసారి నీరు పట్టొచ్చు. అయితే ఇది అన్ని మొక్కలకు వర్తించదు. కొన్ని రకాల పూల మొక్కలకు ప్రతి రోజూ నీరు పట్టాల్సి ఉంటుంది.
- కుండీలో మొక్కను నాటే ముందు దాని అడుగు భాగాన చిన్న రంధ్రం ఉండేలా చూసుకోవాలి. రంధ్రం లేకపోతే చేయాలి. కుండీలో నీరు నిల్వ ఉండడం వల్ల మొక్క చనిపోయే ప్రమాదముంటుంది. కుండీలో మట్టిని అదమకుండా బోలుగా ఉండేలా చూసుకోవాలి. మొక్కను నాటేటప్పుడు వేర్లు పూర్తిగా మట్టిలో కూరుకునేలా పెట్టాలి.



రాగయుక్తంగా పాడితే... గొంతు మగాడిలా ఉందన్నారు. అందుకు ఆమె చిన్నబుచ్చుకోలేదు. ఆ విమర్శను ఒక ప్రశంసగా తీసుకుని... ఆ గొంతునే తన ప్రత్యేకతగా మలుచుకుంది. ఆపై... 'ధూమ్ మచాలే' లాంటి దుమ్ము లేపే బీటైనా... 'డ్యాన్స్ పే చాన్స్' అంటూ హుషారెత్తించినా... 'షీలా కీ జవానీ'తో 'ఫిలిమ్‌ఫేర్ అవార్డు' పట్టినా... ఆమెకే చెల్లింది. గమకాల గమ్మత్తుల 'నిధి'... ఎంతటి క్లిష్టమైన బాణీ అయినా అలవోకగా ఆలపించగల గాయని... సునిధి చౌహాన్ జర్నీ ఇది.



సుస్వర నిధి

పాట ఏదైనా సునిధి చౌహాన్ గొంతులో పడితే... సుస్వరాల సంగమంలా వీనుల విందు చేస్తుంది. నాలుగేళ్లకే వేదికలెక్కి తన గాత్రాన్ని వినిపించిన ఆమె... తరువాత ఎన్నో మరపురాని గీతాలకు గొంతుగా మారింది. ప్రసిద్ధ గాయని, దివంగత లతామంగేష్కర్ మాటల్లో చెప్పాలంటే... 'సునిధి ఏ పాటనైనా అలవోకగా పాడగలదు. తన గాత్రం, శైలిలో సంగీతాభిమానులను మెప్పించగల హంగులన్నీ ఉన్నాయి. నేటి తర అత్యుత్తమ గాయని సునిధి'. ప్రముఖ సంగీత దర్శకుడు అనూ మాలిక్‌దీ అదే మాట. దాదాపు మూడు దశాబ్దాల ఆమె కెరీర్‌లో జనరంజకమైన మధుర గీతాలు ఎన్నో. ఢిల్లీలో పుట్టి పెరిగిన సునిధి... అసలు పేరు నిధి. అక్కడి 'గ్రీన్‌వే మోడ్రన్ స్కూల్'లో చదివింది. ఆమె తండ్రి దుష్యంత్ కుమార్ చౌహాన్‌ది ఉత్తరప్రదేశ్. రంగస్థల కళాకారుడు. తల్లి గృహిణి. ఆమె ప్రోద్బలం, ప్రోత్సాహంతోనే సునిధి సంగీత సాధన మొదలుపెట్టింది. నాలుగేళ్ల వయసులో స్థానిక పాటల పోటీల్లో పాల్గొంది.

చదువు ఆపేసి...

తండ్రి స్నేహితుల సలహాతో కాలక్షేపంగా కాకుండా సంగీతానికి ప్రత్యేకంగా సమయం కేటాయించింది సునిధి. ఎంతగా అంటే... దాని కోసం పాఠశాల విద్య పూర్తవగానే చదువుకు స్వస్తి చెప్పింది. ఒక పక్క లైవ్ షోలు చేస్తూనే... మరోవైపు తన గాత్రానికి మెరుగులు అద్దుకుంది. లతామంగేష్కర్‌కు వీరాభిమాని. ఆమె పాటలే సునిధికి ప్రేరణ. ఖాళీ సమయాల్లో ఇంట్లో ప్రముఖ గాయకుల పాటల కేసెట్లు, సీడీలు పెట్టుకొని వినడం, వాటిని సాధన చేయడం ఆమెకు బాల్యంలో అతి పెద్ద వ్యాపకం. అదే ఇప్పుడు ఆమెను విభిన్న గాయనిగా నిలబెట్టింది. ఓ వేదికపై సునిధి పాట విని ముగ్ధురాలైన నటి తబుస్సుమ్... తన షో 'తబుస్సుమ్ హిట్ పరేడ్'లో అవకాశం కల్పించారు. తనకు మంచి భవిష్యత్తు ఉందని, ముంబయిలో ఉంటే మరిన్ని అవకాశాలు వస్తాయని సునిధి తల్లితండ్రులకు తబుస్సుమ్ సూచించారు. దాంతో ఆమె కుటుంబం ముంబయికి వచ్చి స్థిరపడింది. అప్పుడు సునిధి వయసు పదకొండేళ్లు.

తొలి అవకాశం అలా...

సునిధికి తన షోలో అవకాశం ఇవ్వడంతోనే తబుస్సుమ్ ఆగిపోలేదు. సంగీత దర్శకులు కల్యాణ్‌జీ, ఆనంద్‌జీలకు ఆమెను పరిచయం చేశారు. సునిధి గాత్రానికి ఫిదా అయిన కల్యాణ్‌జీ... ఆమెకు మంచి భవిష్యత్తు ఉందంటూ అభినందించారు. 'నిధి' పేరును సునిధిగా మార్చింది ఆయనే. ఆ పేరు తనకు అదృష్టాన్ని తీసుకువచ్చిందని అంటుంది సునిధి. ముంబయి వచ్చిన తొలి రోజుల్లో ఆమె కుటుంబం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. ఎప్పుడైతే కల్యాణ్‌జీ అకాడమీలో సభ్యురాలైందో... అప్పటి నుంచి సునిధి కెరీర్ పుంజుకుంది. కల్యాణ్‌జీ బృందం 'లిటిల్ వండర్స్'లో ప్రధాన గాయనిగా కొన్నేళ్లపాటు అనేక ప్రదర్శనలు ఇచ్చింది. అయితే తన కూతురు ఎక్కడ స్టేజీ షోలతోనే ఆగిపోతుందోననే ఆందోళన ఆమె తండ్రిని వేధించింది. కానీ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంపైనే సునిధి దృష్టి పెట్టింది. అదే ఆమెకు కలిసివచ్చింది. 1995 ఫిలిమ్‌ఫేర్ అవార్డ్స్ వేడుకలో 'లిటిల్ వండర్స్' ట్రూపు తరుపున గీతాలు ఆలపించింది. అది అక్కడే ఉన్న సంగీత దర్శకుడు ఆదేశ్ శ్రీవాస్తవకు ఎంతో నచ్చింది. వెంటనే పిలిచి తన చిత్రం 'శాస్త్రా'లో పాడించారు. పదకొండేళ్ల వయసులో 'లడకీ దివానీ దేఖో' అంటూ ఉదిత్ నారాయణ్‌తో కలిసి ఆ చిత్రంలో ఆలపించిన గీతంతో సునిధి పాటల ప్రయాణం ప్రారంభమైంది.

దశ తిరిగింది...

అదే సంవత్సరం డీడీ నేషనల్ చానల్ మొట్టమొదటి సింగింగ్ రియాలిటీ షో 'మేరీ ఆవాజ్ సునో' విజేతగా నిలిచి, లతామంగేష్కర్ ట్రోఫీ గెలుచుకుంది సునిధి. దాంతోపాటు తొలి సోలో ఆల్బమ్ 'అయిరా గెయిరా నాతు క్తైరా' విడుదలైంది. అయితే అది చిల్డ్రన్స్ ఆల్బమ్‌గా ప్రాచుర్యం పొందడంతో సునిధి ఆలోచనలో పడింది. తన ప్రతిభకు మెరుగులు అద్దుకోవాలన్న ఉద్దేశంతో గౌతమ్ ముఖర్జీ వద్ద శాస్త్రీయ సంగీతం అభ్యసించింది. రెండేళ్లపాటు బ్యాగ్రౌండ్ వోకలిస్ట్‌గా పని చేసింది. ఈ క్రమంలోనే గాయకుడు సోనూ నిగమ్... ఆమెను సంగీత దర్శకుడు సందీప్ చౌతాకు పరిచయం చేశాడు. ఆయన అప్పుడు రామ్‌గోపాల్‌వర్మ 'మస్త్' చిత్రానికి బాణీలు సమకూర్చే పనిలో ఉన్నారు. రెండు వారాల్లో సునిధితో టైటిల్ ట్రాక్‌తో పాటు 'రుకి రుకిసీ జిందగీ', 'సునా థా' పాటలు పాడించారు. 'రుకి రుకిసీ జిందగీ' పాటకు ఆమెకు 'ఆర్డీ బర్మన్ ఫిలిమ్‌ఫేర్ అవార్డు' దక్కింది. ఉత్తమ గాయనిగా నామినేట్ అయింది. దాంతో సునిధి దశ తిరిగిపోయింది. ఆ ఏడాది చివరలో ఆనంద్‌మిలింద్ 'జాన్వర్', శ్రీవాస్తవ 'దహేక్', 'బడే దిల్‌వాలే'లో అవకాశాలు వచ్చాయి. మరుసటి ఏడాది, అంటే 2000లో అనూమాలిక్ స్వరకల్పనలో విడుదలైన 'ఫిజా'లో 'మెహబూబ్ మేరే' విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆ నాటి నుంచి నేటి వరకు ఆమె పాటల ప్రవాహం కొనసాగుతూనే ఉంది.

> **పెళ్లి... విడాకులు... పెళ్లి...**
>
> పద్దెనిమిదేళ్లకే బాబీ ఖాన్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్న సునిధి... ఏడాది తరువాత అతడి నుంచి విడిపోయింది. అది తన జీవితంలో చేసిన అతిపెద్ద తప్పుగా అభివర్ణించింది. 'అయితే ఆ అనుభవం నాలో ఎంతో పరిణతి తీసుకువచ్చింది. అయితే ఇలాంటి విషయాల్లో సమాజం ఎప్పుడూ మహిళలనే తప్పు పడుతుంది. పెళ్లయ్యాక మా ఇద్దరి దారులు వేరని తెలిసింది. ఒకరికి ఒకరం సరిపోమని అర్థమైంది. దాంతో విడిపోవాలనుకున్నాం. అంతకుమించి మా వైవాహిక బంధంలో ఎలాంటి గొడవలు, గందరగోళాలూ లేవు. మేం విడిపోయాక కొందరు నన్ను కించపరిచేలా మాట్లాడారు. కాలం మారుతోంది. కానీ దాంతో పోటీపడలేక ఆగిపోయినవారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారు. వాటికి నేను విలువ ఇవ్వను' అంటూ నాటి రోజులు గుర్తు చేసుకున్న సునిధి... 2012లో సంగీత దర్శకుడు హితేష్ సోనిక్‌తో కలిసి ఏడడుగులు వేసింది. వారికి ఒక కుమారుడు.

వందల గీతాలు...


రెండు ఫిలిమ్‌ఫేర్ అవార్డులు గెలుచుకున్న సునిధి... ఇప్పటివరకు పద్నాలుగు వందలకు పైగా సినీ గీతాలు ఆలపించింది. వాటిల్లో పదుల సంఖ్యలో సూపర్‌హిట్ తెలుగు పాటలు కూడా ఉన్నాయి. ఒక్క హిందీలోనే కాకుండా తమిళం, కన్నడ, మళయాళం, అస్సామీ, బెంగాలీ, భోజ్‌పురీ తదితర భాషల్లో తన గాత్ర మాధుర్యంతో అలరించింది. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్‌చేంజర్'లో 'జరగండి జరగండి' పాటతో తెలుగు ప్రేక్షకులను మరోసారి పలుకరించింది సునిధి.

సవాళ్లను అధిగమించి...

పాటల ప్రపంచంలో అప్రతిహతంగా సాగిపోతున్న సునిధి... వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొంది. సవాళ్లను అధిగమించింది. కెరీర్ ఆరంభంలో కొందరు మగాడి గొంతులా ఉందని తనను విమర్శించినా దాన్ని ఆమె ఒక అభినందనగా తీసుకుంది. 'అందుకు నేను బాధపడలేదు. ఈ గొంతు నాకు భగవంతుడు ఇచ్చిన వరంగా భావించాను. దానికి తగిన పాటలు ఇచ్చి సంగీత దర్శకులు నన్ను ప్రోత్సహించారు' అంటూ ఓ సందర్భంలో చెప్పింది ఈ గాయని. అయితే క్లిష్ట సమయంలో తనపై నమ్మకం ఉంచి, తనకు మద్దతుగా నిలిచిన అనూమాలిక్‌ను ఎప్పటికీ మర్చిపోనంటుంది. "అజ్‌నబీ' చిత్రం కోసం నాతో 'మేరీ జిందగీ మే' పాట పాడించాలని అనూమాలిక్ అనుకున్నారు. అప్పటివరకు ఐటిమ్ సాంగ్స్ పాడిన నాతో రొమాంటిక్ సాంగ్ పాడించడానికి చిత్ర దర్శకులు అబ్బాస్-మస్తాన్ ఒప్పుకోలేదు. కానీ అనూమాలిక్ పట్టు విడవలేదు. 'సునిధి మాత్రమే ఈ పాటు పాడుతుంది' అని వారికి తెగేసి చెప్పారు. చివరకు ఆయన మాటే గెలిచింది. ఆ పాట సూపర్‌హిట్ అయింది. వాస్తవానికి ఓ పేరున్న గాయకునితో పాడించాలనుకున్న గీతం అది. ఇక అక్కడి నుంచి నాకు వరుసపెట్టి రొమాంటిక్ సాంగ్స్ కూడా వచ్చాయి" అంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది సునిధి.

వన్ ఉమన్ ఆర్మీ

"నవ్వులపాలు కావడం సులువే. కానీ నవ్వించడం అంత సులభం కాదు. నవ్వులపాలు కాకుండా నవ్వించడమే నేను రోజూ ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్" అంటారు కరిష్మా గంగ్వాల్. 'ఆర్జే కరిష్మా'గా ప్రసిద్ధురాలైన ఈ 31 ఏళ్ళ జమ్మూ మహిళ భారతీయ కుటుంబాలకు అద్దంపట్టే రీల్స్‌తో కోట్లాది అభిమానుల్ని సంపాదించుకున్నారు. ఈ ఏడాది 'కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్'లో రెడ్ కార్పెట్‌పై మెరిశారు. పారిస్ ఒలింపిక్స్‌కు 'యూట్యూబ్' తరఫున హాజరైన మొదటి ఇండియన్ కంటెంట్ క్రియేటర్‌గా చరిత్రకెక్కారు.





నిరంతరం కోడల్ని సతాయించే అత్తగారు. నేర్పుగా పరిస్థితుల్ని ఎదుర్కొనే కోడలు, దారితప్పిన కొడుకు, అతిగా ఆలోచించే తండ్రి, ఎప్పుడూ ఉచిత సలహాలిచ్చే బామ్మ. అణకువగా ఉండే మేనత్త... భారతీయ కుటుంబాల్లోని ఈ పాత్రలన్నిటినీ ఏకకాలంలో అభినయించి నవ్విస్తారు కరిష్మా గంగ్వాల్. అనేక పాత్రలను పోషించడం మాత్రమే కాదు, స్క్రిప్ట్ రాయడం, ఎడిట్ చెయ్యడం లాంటి బాధ్యతలు కూడా ఆమెవే. "ఇవన్నీ ఎలా కుదురుతున్నాయ్?" అనే ప్రశ్నకు... "నేను వన్ ఉమన్ ఆర్మీ" అంటారామె చిరునవ్వుతో. "నాకు చిన్నవయసు నుంచి పరిశీలనా శక్తి ఎక్కువ. ఎవరినైనా సులువుగా అనుకరించేదాన్ని. నా తోటి పిల్లలందరూ బొమ్మలతో ఆడుకుంటూ ఉంటే నేను మా అమ్మ దుస్తులు ధరించి, అద్దం ముందు నటించేదాన్ని. నటనను కెరీర్‌గా చేసుకోవాలనే ఆలోచన ఎప్పుడూ లేదు" అంటారు కరిష్మా.

ట్రోలింగ్ ఎదుర్కొన్నా...

కరిష్మా స్వస్థలం జమ్ము. అయిదేళ్ళ వయసులోనే ఆమె తండ్రి చనిపోయారు. కరిష్మాను, ఆమె అక్క నేహాను తల్లే పెంచి పెద్ద చేశారు. "మాది దిగువ మధ్య తరగతి కుటుంబం. స్థిరమైన ఉద్యోగం చేస్తే తప్ప కుటుంబం సజావుగా గడవదనే సంగతి తెలుసు. అయితే కళలు, సృజనాత్మకత అంటే నాకు ఇష్టం. అందుకే ఇండోర్‌లో మాస్ కమ్యూనికేషన్స్ డిగ్రీ చేశాను. 2015లో 'మై ఎఫ్‌ఎం'లో రేడియో జాకీ (ఆర్జే)గా చేరాను. కొన్నాళ్ళ తరువాత 'రెడ్ ఎఫ్‌ఎం'లో ఆఫర్ వచ్చింది. సాధారణంగా నేను లేట్‌నైట్ షోలు చేసేదాన్ని. ప్రేమ, అనుబంధాలు లాంటి వాటి గురించి ఎక్కువగా మాట్లాడేదాన్ని" అని గుర్తు చేసుకున్నారు కరిష్మా. రొటీన్‌గా సాగిపోతున్న ఆమె జీవితం కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో కొత్త మలుపు తిరిగింది. "ఇంటి నుంచి బయటకు వెళ్ళే పరిస్థితి లేకపోవడంతో నాకు ఏమీ తోచేది కాదు. పుస్తకాలు చదివినా, సినిమాలు చూసినా ఇంకా ఏదో వెలితిగానే అనిపించేది. క్రియేటివ్‌గా ఏదైనా చేద్దామనుకున్నాను. అత్తా కోడళ్ళ సంభాషణతో ఒక షార్ట్ రీల్ తీశాను. దాన్ని మా అక్కకు చూపించాను. "దీన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చెయ్యొచ్చుగా" అంది. "నేను సరదాగా చేశాను. దాన్ని పోస్ట్ చెయ్యాలనుకోవట్లేదు" అన్నాను. "నువ్వు చెయ్యకపోతే నేనే చేస్తాను" అనడంతో, చివరికి అయిష్టంగానే పోస్ట్ చేశాను. 'దీన్నెవరు పట్టించుకుంటార్లే' అనుకున్నాను. కానీ మూడు రోజుల్లో ముప్పై లక్షల వ్యూస్ వచ్చాయి. ప్రశంసలతో పాటు 'ఈ రోజుల్లో అత్తా కోడళ్ళు ఇలా ఉన్నారా? కాలంతో పాటు మీరు మారరా?' అనే విమర్శలు కూడా వచ్చాయి. ట్రోలింగ్‌ను ఎదుర్కోవాల్సి వచ్చింది. దాంతో 'ఇక మీదట కొనసాగిద్దామా? లేదా?' అనే సందిగ్ధంలో ఉండగా... ఒక అమ్మాయి నుంచి మెసేజ్ వచ్చింది. "పది రోజుల తరువాత మొదటిసారిగా నవ్వాను. మీకు థ్యాంక్స్ చెబుదామని ఈ మెసేజ్ చేస్తున్నాను" అని! తన సోదరుడు కొవిడ్‌తో మరణించాడనీ, ఆ విషాదంలో ఉన్న తనకు నా రీల్ కాస్త ఊరట కలిగించిందనీ ఆమె తెలిపింది. నా చిన్న ప్రయత్నం మరొకరికి సంతోషం కలిగించిందని తెలిశాక... ఇక తగ్గేదిలే! అనుకున్నాను. ఆ తరువాత వెనుతిరిగి చూడలేదు" అని చెబుతారు కరిష్మా.

వారి ఆశీస్సులే అమ్మను బతికించాయి...


ఈలోగా ఆమె తల్లి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. కేన్సర్ ఉన్నట్టు వైద్య పరీక్షల్లో తేలింది. తల్లి సంరక్షణ కోసం ఎవరో ఒకరు పక్కనే ఉండాల్సి వచ్చింది. "ఆ సమయంలో మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా నేనూ, మా అక్కా బాగా కుంగిపోయాం. ఇద్దరూ ఉద్యోగం చేస్తున్నా ఇల్లు గడపడం, మా అమ్మ వైద్య ఖర్చులు భరించడం కష్టమైపోయింది. నాన్నను చిన్నప్పుడే పోగొట్టుకున్నాం. అమ్మయినా దక్కుతుందో లేదో అనుకున్నాం. సరిగ్గా ఆ సమయంలోనే నా కంటెంట్‌కు పాపులారిటీ పెరిగింది. ప్రమోషన్లు, ప్రకటనలు, బ్రాండ్లతో భాగస్వామ్యాలు వెతుక్కుంటూ వచ్చాయి... వాటితో పాటే డబ్బు కూడా. అమ్మకు వైద్యం చేయించగలిగాం. అమ్మ ఇప్పుడు జీవించి ఉందంటే... వీక్షకులు నామీద చూపించిన ప్రేమే కారణం. "మీ వీడియోలతో మమ్మల్ని ఎంతగానో నవ్విస్తున్నారు. మీరు ఎప్పుడూ బాధ పడకూడదు" అని ఎంతోమంది కోరుకున్నారు. వారందరి ఆశీస్సులే అమ్మను బతికించాయి" అంటారు కరిష్మా ఉద్వేగంగా.

నా జీవితంలో అద్భుతాలు జరిగాయి...

ఈ ఏడాది జూలై-ఆగస్ట్ మధ్య ప్యారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌కు తమ తరఫున అతిథిగా 'యూట్యూబ్' ఆమెను ఎంపిక చేసింది. ఈ గౌరవం దక్కిన మొదటి భారతీయ కంటెంట్ క్రియేటర్ కరిష్మా. ప్రస్తుతం ఆమెకు పదిహేను లక్షల మందికి పైగా సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. 'ఫోర్బ్స్ ఇండియా- టాప్ 100 డిజిటల్ స్టార్స్- 2024' లో ఆమెది పద్దెనిమిదో స్థానం. ఆమె పోస్ట్ చేసే ప్రతి వీడియోను కొన్ని లక్షల మంది చూస్తూ ఉంటారు. "నాలుగేళ్ళ క్రితం "మనిషి జీవితంలో అద్భుతాలు జరుగుతాయా?" అని నన్ను ఎవరైనా అడిగితే... 'మీకేమైనా పిచ్చా?' అన్నట్టు చూసేదాన్నేమో! కానీ నా జీవితంలోనే అద్భుతాలు జరిగాయి. చిత్తశుద్ధితో, అంకితభావంతో నచ్చిన పని చేస్తే... విజయం సాధించగలమనడానికి నేనే ఉదాహరణ" అంటున్న కరిష్మా... ప్రస్తుతం ఒక టీవీ షో కోసం స్క్రిప్ట్ రాసే పనిలో ఉన్నారు. "ప్రధాన పాత్రలో కలిపించాలన్నది ప్రస్తుతం నాకున్న పెద్ద కల. అది త్వరలోనే నెరవేర్చుకోబోతున్నాను" అని చెబుతున్నారామె.

> **"నీకు ఆ అవసరం రాదు" అన్నారు...**
>
> ఏడాది గడిచేసరికి ఉద్యోగాన్నీ, కంటెంట్ క్రియేషన్‌నూ బ్యాలెన్స్ చేసుకోవడం ఆమెకు కష్టమయింది. ఆర్జే ఉద్యోగానికి రాజీనామా చేశారు. "ఆ సమయంలో... "నా ఆదాయం తగ్గిపోతే... మళ్ళీ ఉద్యోగం ఇస్తారా?" అని మా సీఈఓను అడిగాను. "నీకు ఆ అవసరం రాదు" అన్నారాయన. ఆ మాటే నిజమయింది. నా వీడియోలకు వ్యూస్ పెరిగాయి, సబ్‌స్క్రైబర్స్ పెరిగారు. రణబీర్ కపూర్, విద్యా బాలన్ తదితర బాలీవుడ్ నటులతో, సచిన్ టెండుల్కర్, హార్దిక్ పాండ్యా లాంటి క్రీడాకారులతో కలిసి పని చేసే అవకాశం దక్కింది. అంతేకాదు... ఈ ఏడాది మే నెలలో జరిగిన కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్‌లో... రెడ్ కార్పెట్‌పై నడిచాను. ఒక అంతర్జాతీయ స్థాయి వేడుకలో పాల్గొనడం, ఎంతోమంది చలనచిత్ర రంగ ప్రముఖులతో వేదిక పంచుకోవడం అదే తొలిసారి. దాన్ని జీవితాంతం ఒక మధురమైన జ్ఞాపకంగా నా గుండెల్లో దాచుకుంటాను అని చెప్పారు కరిష్మా.

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. మేరీ మెహబూబ్ (విక్కీ విద్యా కా ఓ వాలా వీడియో)
4. ఆయీ నై (స్త్రీ-2)
5. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
6. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
7. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
8. భూల్ భులాయా (భూల్ భులాయా3)
9. అపనా బనాలే (భేడియా)
10. మిలియనీర్ (గ్లోరీ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

పేరెంటింగ్

పిల్లలకు అర్థమయ్యేలా..!



క్రమశిక్షణ పేరుతో పిల్లలపై ఎన్నో ఆంక్షలు పెడుతుంటారు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలకు మితిమీరి స్వేచ్ఛనిస్తే మరికొంతమంది తాము చెప్పినట్టే వినాలని కట్టడి చేస్తుంటారు. దీనివల్ల పిల్లలు పెడదారి పట్టే అవకాశం ఉంది. అలాకాకుండా పిల్లలను ఎలా పెంచాలో తెలుసుకుందాం!

- పిల్లల పట్ల తల్లిదండ్రులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి. పిల్లల ఆసక్తిని గమనించి అనుకున్నది సాధించేలా ప్రోత్సహించాలి.
- ఇతరులకు సహాయ సహకారాలు అందించడం అలవాటు చేయాలి. దీనివల్ల పిల్లలు ప్రతిఒక్కరితో స్నేహంగా మెలగడం నేర్చుకుంటారు. సామాజిక కార్యక్రమాల్లో పిల్లలను భాగస్వాములను చేస్తే వారిలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి.
- తల్లిదండ్రులు ప్రతిరోజూ పిల్లలతో కొంత సమయం గడిపేలా ప్లాన్ చేసుకోవాలి. పిల్లలు చదువుతున్న పాఠశాల, ఉపాధ్యాయులు, స్నేహితుల విషయాలన్నీ అడిగి తెలుసుకోవాలి. పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను అడగాలి. వాటి పరిష్కారాలను చర్చించాలి. అప్పుడే పిల్లలు తమ భావాలను పంచుకోవడం నేర్చుకుంటారు.
- పిల్లలకు లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం నేర్పించాలి. ఆ క్రమంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా స్వీకరించాలో వివరించాలి. ఏ పనినైనా కష్టమనుకోకుండా ఇష్టంతో పూర్తిచేసేలా ప్రోత్సహిస్తే పిల్లల్లో పోరాడే సామర్థ్యం అలవడుతుంది.
- పిల్లలు ఏమి అడిగినా వాటిని వెంటనే తెచ్చివ్వాలని అనుకోవద్దు. తల్లిదండ్రులు 'నో' చెప్పడానికి వెనకాడకూడదు. ఆర్థిక పరిస్థితి, ప్రత్యామ్నాయాలను సరళంగా వివరిస్తూ పిల్లలకు ఆలోచించే అవకాశం కల్పించాలి.

మహిళలకు లక్షకోట్ల వడ్డీ లేని రుణాలు

» ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎంఎస్‌ఎంఈ పార్కులు: భట్టి



ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలకు ఈ ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలను అందించనున్నట్లు డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మహిళలకు వడ్డీలేని రుణాలు నిలిపివేశారన్నారు. ఇందిరమ్మ రాజ్యం రాగానే మహిళలకు వడ్డీలేని రుణాల కార్యక్రమాన్ని పునఃప్రారంభించామని చెప్పారు. ప్రతి ఏటా మహిళా సంఘాలకు రూ.20వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ రుణాలకు ప్రభుత్వమే పూర్తిస్థాయిలో వడ్డీ చెల్లిస్తుందన్నారు. మహిళలు తీసుకున్న రుణాలతో పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేయాలని, దీనికోసం అవసరమైన శిక్షణ, తోడ్పాటును కూడా ప్రభుత్వమే అందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి శాసనసభ నియోజకవర్గ పరిధిలో మహిళలకు ప్రత్యేకంగా చిన్న, చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంఘాలు చేసే ఉత్పత్తులకు ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ మహిళల అభివృద్ధి దేశానికి ఆదర్శంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు.

బుద్ధుని బోధనలతో సమాజ రుగ్మతలు దూరం: జూపల్లి

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొన్న రుగ్మతల నివారణకు గౌతమ బుద్ధుని బోధనలే శరణ్యమని పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గౌతముని బోధనలను ఆచరించడం ద్వారా మానవ జీవితానికి పరిపూర్ణత సిద్ధిస్తుందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ మహాబోధి బుద్ధ విహార్‌లో ఆదివారం మహాబోధి దయక మండలి, మహాబోధి బుద్ధవిహార్ ఆధ్వర్యంలో జరిగిన కఠినచీవర దానోత్సవంలో మంత్రి జూపల్లి పాల్గొన్నారు. ప్రాచీన బౌద్ధ సంస్కృతీసంప్రదాయాల ప్రకారం వర్షావాసం ముగించిన బౌద్ధ భిక్షువులకు వస్త్రాలను దానం చేశారు. అనంతరం శివనాగిరెడ్డి పాళీ భాష నుంచి తెలుగులోకి అనువదించిన బుద్ధ వంశం అనే గ్రంథాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుద్ధిస్ట్ సాంస్కృతిక, వారసత్వ ఉత్సవాలు, త్రిపిటిక పఠన వేడుకలు, త్రిపిటికలను తెలుగులో అనువదించడానికి ప్రభుత్వం నుంచి నాలుగు కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

మా నాన్నను ప్రభుత్వమే హత్య చేసింది

» ప్రొ. సాయిబాబా కూతురు మంజీర

సుభాష్‌నగర్(కరీంనగర్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ సాయిబాబాను ప్రభుత్వమే హత్య చేసిందని ఆయన కూతురు మంజీర ఆరోపించారు. ఆదివారం కరీంనగర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రొ.సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంజీర మాట్లాడుతూ.. 90% అంగవైకల్యం, పోలియో, ఇతర 19 రకాల వ్యాధులతో బాధపడుతున్న తన తండ్రికి ప్రభుత్వం అత్యవసర మందులు ఇవ్వలేదని ఆరోపించారు. అరెస్టు చేసినప్పుడు కావాలనే ఆయన వీల్ చైర్‌ను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఆదివాసీలపై ప్రభుత్వాల దమనకాండకు వ్యతిరేకంగా, దళితులు, పీడిత ప్రజల పక్షాన మాట్లాడినందుకు ఆయనపై ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు, కార్పొరేటీకరణకు, ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా సభలు, సమావేశాలు నిర్వహించినందుకే ప్రభుత్వం సాయిబాబాపై అక్రమంగా ఉపా కేసు పెట్టి ఆయనను జైల్లో నిర్బంధించిందని విమర్శించారు. ఎందరో ఆదివాసీ యువకులను చేయని నేరాలకు జైల్లో అక్రమంగా నిర్బంధించారని, వారి కోసం ఒక విద్యాసంస్థను నెలకొల్పే ఆలోచన సాయిబాబాకు ఉండేదని ఆమె తెలిపారు. విరసం నాయకుడు బాలసాని రాజయ్య, పౌర హక్కుల సంఘం బాధ్యులు శ్రీపతి రాజగోపాల్, నారా వినోద్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన కుమారస్వామి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె విశ్వనాథ్, పాల్గొన్నారు.

బాసర విద్యార్థులపై బకాయిల భారం!

ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామంటున్న అధికారులు.. మినహాయింపు ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలూ బేఖాతరు

» చెల్లించలేక విద్యార్థుల అవస్థలు
» సర్టిఫికెట్లు తీసుకోలేని దైన్యంలో వేలాదిమంది పట్టభద్రులు
» హైకోర్టును ఆశ్రయించిన మాజీ విద్యార్థి
» నేటి సాయంత్రంలోగా సర్టిఫికెట్లు ఇచ్చేయాలని వర్సిటీకి హైకోర్టు ఆదేశాలు



బాసర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా బాసరలోని ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో ఫీజుల బకాయిల వసూలుకు అధికారులు అమలు చేస్తున్న నిబంధన.. పేద విద్యార్థులకు శాపంగా మారుతోంది. చదువు పూర్తయిన విద్యార్థులకు.. బకాయిల పేరు చెప్పి అధికారులు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీంతో, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ విషయమై పలుమార్లు ప్రభుత్వాలు జీవోలు విడుదల చేసినా కూడా.. యూనివర్సిటీ అధికారులు మాత్రం వాటిని ఖాతరు చేయడం లేదన్న విమర్శలున్నాయి. ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ ప్రైవేటు సంస్థల్లో మాదిరిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో న్యాయం కోసం ఓ మాజీ విద్యార్థి హైకోర్టు మెట్లెక్కాడు. సదరు విద్యార్థి పేరు సామల ఫణికుమార్. నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండలం తేరాటుపల్లి గ్రామానికి చెందిన ఫణికుమార్.. గతేడాది ట్రిపుల్ ఐటీలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ప్రస్తుతం సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో బీటెక్ సర్టిఫికెట్ల కోసం ట్రిపుల్ ఐటీకి వస్తే.. అధికారులు రూ.86 వేల ఫీజు బకాయి ఉందని, ఆ మొత్తం చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పటంతో కోర్టులో పిటిషన్ వేశాడు. దీంతో న్యాయస్థానం అతనికి అనుకూలంగా తీర్పునిచ్చింది.

ఉచితమంటూనే.. ఫీజుల మోత

ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులకు ఉన్నత స్థాయి సాంకేతిక విద్యను ఉచితంగా అందించేందుకు ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసినట్లు చెబుతుంటారు. వీటిలో చేరే విద్యార్థుల్లో 95 శాతం మంది నిరుపేద, గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే వారే ఉంటారు. భవిష్యత్తుపై బోలెడన్ని ఆశలతో వచ్చే ఈ విద్యార్థులపై.. అధికారులు ఫీజుల భారం మోపుతున్నారు. విద్యార్థులు ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత కలిగి వున్నా.. ఫీజులో 60-70 శాతమే రీయింబర్స్ అవుతోంది. దీంతో నాలుగేళ్ల బీటెక్ కోర్సులో ఏటా రూ.20 వేలు ఫీజు బకాయి ఉన్నా.. నాలుగేళ్లలో అది రూ.80 వేలకు పెరిగిపోతోంది. ఈ బకాయి అంతా విద్యార్థిపైనే మోపుతున్నారు. దీంతోపాటు పరీక్షల ఫీజులంటూ విద్యార్థుల నుంచి ఏటా రూ.వేలల్లో రుసుం వసూలు చేస్తున్నారు. ఒక్కో విద్యార్థిపై చదువు పూర్తయ్యేసరికి సగటున రూ.50 వేల నుంచి లక్ష వరకు బకాయి ఉంటోంది. ఇది పేద విద్యార్థులకు తలకు మించిన భారంగా మారుతోంది.

సర్టిఫికెట్లను తొక్కిపెట్టొద్దు : హైకోర్టు తీర్పు

ఈ నెల 22న మాజీ విద్యార్థి ఫణికుమార్.. హైకోర్టులో కేసు వేశాడు. విచారించిన న్యాయస్థానం ఈ నెల 25న ఆ విద్యార్థికి అనుకూలంగా తీర్పునిచ్చింది. సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదని పేర్కొంది. సోమవారం నాటికి ఆ విద్యార్థికి సర్టిఫికెట్లు అందివ్వాలని ఈ విషయాన్ని మంగళవారం హైకోర్టుకు తెలపాలని న్యాయస్థానం వర్సిటీ అధికారులను ఆదేశించింది. దీంతో ఫణికుమార్ లాంటి 5 వేల మందికి న్యాయం జరిగింది.

సర్టిఫికెట్లు లేక... ఉద్యోగాలకు దూరంగా..

బకాయిలు కట్టలేక వేలాది మంది విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోవటం లేదు. అధికారులకు మొరపెట్టుకున్నా వారు కనికరించడం లేదు. భారీ మొత్తాలే కాదు.. రూ.ఐదారు వేల లోపు ఫీజు బకాయి ఉన్న వారిది కూడా ఇదే పరిస్థితి. సర్టిఫికేట్లు చేతికి అందకపోవటంతో మంచి ఉద్యోగాలకు దూరమై టీ స్టాల్‌లో పనికి చేరిన విద్యార్థులు కూడా ఉన్నారు. దీనిపై ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు జారీ చేసి.. విద్యార్థులకు సర్టిఫికేట్లు ఇవ్వకుండా అడ్డుకోవద్దని స్పష్టం చేసింది. అయినప్పటికీ, వర్సిటీ అధికారులు పట్టించుకోవటం లేదన్న ఆరోపణలున్నాయి. కష్టపడి చదివి కోర్సు పూర్తి చేసినప్పటికీ.. బకాయిలు చెల్లించక సర్టిఫికేట్లు పొందని విద్యార్థులు ఇప్పటి వరకు దాదాపు 5 వేల మంది ఉన్నట్లు సమాచారం.

ఇష్టానుసారం వికలాంగుల ఆశ్రమాలు కుదరదు

» స్వచ్ఛంద సంస్థలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి
» లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం
» వికలాంగుల సంక్షేమ శాఖ

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇక నుంచి వికలాంగుల సంక్షేమం కోసమంటూ స్వచ్ఛంద సంస్థలు.. ఆశ్రమాలను ఏర్పాటు చేయాలంటే కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే. ఈ మేరకు నిబంధనను తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన కసరత్తు ఇప్పటికే పూర్తయిందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఆశ్రమాలు, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలను అనేక మంది ఏర్పాటు చేసి యథేచ్ఛగా నిర్వహిస్తున్నారని, ఆ నిర్వహణలో పలు సమస్యలు తెరమీదకు వచ్చిన నేపథ్యంలో ఇక నుంచి ఆయా సంస్థలు, ఆశ్రమాల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఆ రిజిస్ట్రేషన్‌ను సాదాసీదాగా కాకుండా 2016 వికలాంగుల చట్టంలోని చాప్టర్ 9 సెక్షన్ 50 ప్రకారం చేయాలని సూచించనున్నారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం గడువు విధించనున్నారు. కాగా, 1987 మానసిక ఆరోగ్య చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం అనుమతి ఉన్న సంస్థలు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.

పెద్దపల్లి జిల్లాలో కస్తూర్బా విద్యార్థినులకు అస్వస్థత

ముత్తారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ముత్తారంలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలలో 30 మంది విద్యార్థినులు ఆదివారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆరు, ఏడు తరగతులు చదువుతున్న వీరంతా దగ్గుతో ఇబ్బంది పడడం గమనించిన ఉపాధ్యాయులు వెంటనే వారిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షల అనంతరం వారంతా జలుబు, దగ్గుతో ఇబ్బంది పడుతున్నారని వైద్యులు తెలిపారు. ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం లేదని నిర్ధారించారు. కాసేపటికి విద్యార్థినులు కోలుకున్నారు.

కాంగ్రెస్-లెఫ్ట్ మధ్య సీట్ల చిచ్చు!

» జార్ఖండ్‌లో సీపీఎం, సీపీఐలను పట్టించుకోని జేఎంఎం-కాంగ్రెస్
» మహారాష్ట్రలో కుదరని సర్దుబాటు
» బెంగాల్ ఉప ఎన్నికల్లో ఎవరికి వారే

న్యూఢిల్లీ, అక్టోబరు 27: జార్ఖండ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికల్లో 'ఇండియా' కూటమిలో చిచ్చురేగింది. కాంగ్రెస్ ఏకపక్ష వైఖరి వామపక్షాలను ఆగ్రహానికి గురిచేస్తోంది. జార్ఖండ్‌లో 81 అసెంబ్లీ సీట్లకు గాను జేఎంఎం-కాంగ్రెస్ 70 చోట్ల బరిలోకి దిగుతున్నాయి. మిగతా 11లో సీపీఐ-ఎంఎల్, ఆర్జేడీలకు చెరో నాలుగు సీట్లు కేటాయించాయి. మిగతా మూడింటిపై స్పష్టత ఇవ్వలేదు. కార్మిక వర్గాల ప్రాబల్యం ఉన్న కొన్ని నియోజకవర్గాల్లో సీపీఎం, సీపీఐలకు కూడా చెప్పుకోదగిన బలం ఉంది. కానీ కాంగ్రెస్ వాటికి ఒక్కసీటు కూడా ఇవ్వలేదు. దీంతో సీపీఎం 9 స్థానాల్లో ఒంటరి పోరుకు దిగుతోంది. సీపీఐ 4 సీట్లలో పోటీకి సమాయత్తమైంది. చెరో నాలుగు దక్కిన సీపీఐ-ఎంఎల్, ఆర్జేడీ కూడా అసంతృప్తిగా ఉన్నాయి. తనకు కేటాయించిన స్థానాల్లో ధన్వార్‌లో జేఎంఎం తన అభ్యర్థిని నిలపడంపై ఎంఎల్ మండిపడుతోంది. దీంతో తాను కూడా ఐదు చోట్ల పోటీకి సిద్ధమైంది. 288 సీట్ల మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, పవార్ ఎన్సీపీ, ఉద్ధవ్ శివసేన ప్రస్తుతానికి తలో 85స్థానాలపై ఏకాభిప్రాయానికి వచ్చాయి. మిగతా 33 సీట్లపై ఇప్పటికీ నిర్ణయానికి రాలేకపోతున్నాయి. ఇక్కడ కూడా సీపీఐ ఒకటి, సీపీఎం రెండు సీట్లు కోరుతుండగా పై 3 పార్టీలూ అందుకు సుముఖంగా లేవు. ఇక బెంగాల్లో 6అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరుగనున్నాయి. లెఫ్ట్ ఫ్రంట్‌తో జట్టుకట్టేందుకు కాంగ్రెస్ అంగీకరించలేదు. దీంతో ఎవరికివారు అభ్యర్థులను ప్రకటించేశారు.

ఉజ్వల పథకం ద్వారా 10 కోట్ల మందికి లబ్ధి

» కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బోయిన్‌పల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేశంలో 10 కోట్ల మందికిపైగా పేద వర్గాల మహిళలకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా వెనుకబడిన పేద వర్గాల మహిళలకు స్వచ్ఛమైన వంట ఇంధనాన్ని అందించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల శిఖరాగ్ర సమావేశం ఆదివారం సికింద్రాబాద్ బోయిన్‌పల్లి డైమండ్ పాయింట్‌లో గల గాయత్రి గార్డెన్‌లో జరిగింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురు ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లను సత్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... దేశంలో ప్రతి కుటుంబంతో ఎల్‌పీజీ భాగస్వామ్యం అయిందని పేర్కొన్నారు. ఎల్‌పీజీ అంటే 'లైఫ్‌లైన్ ఫర్ ప్రాస్పరిటీ అండ్ గ్రోత్' అని అన్నారు. మారుమూల ప్రాంతాలకూ ఎల్‌పీజీని అందించడంలో డిస్ట్రిబ్యూటర్లు కీలకపాత్ర వహిస్తున్నారన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృత్రిమ మేధ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు, పలువురు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లను సత్కరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నవ్య | చిత్రజ్యోతి


మహిళలను తక్కువ చేస్తున్నారు

- సుహాసిని



చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు నటి సుహాసిని. సినిమాల్లో హీరోయిన్లను చూపించే తీరు మారిందని ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. కమర్షియల్ చిత్రాలకు సంబంధించి 2010 నుంచి ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. 'పాశ్చాత్య పోకడలను అవలంబించడం ఎక్కువైంది. ఈ క్రమంలోనే స్కిన్ షో, ఇంటిమేట్ సీన్స్‌లో నటించడానికి ఇబ్బందిపడటం లేదు. గతంలో ఇలాంటి సీన్లలో నటించడానికి హీరోయిన్లు అరుదుగా అంగీకరించేవారు. కానీ, ఇప్పుడు అలా కాదు. ఏదైనా చేస్తున్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో సినిమాల్లో మహిళలను తక్కువ చేసి చూపిస్తున్నారు. హీరోలకు స్ట్రాంగ్ రోల్స్ రాస్తున్నారు. హీరోయిన్లకు మాత్రం ప్రాధాన్యం లేని పాత్రలు ఇస్తున్నారు' అని సుహాసిని అన్నారు. ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

డబ్బింగ్ పనుల్లో...



హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. వీరిద్దరి కలయికలో రూపొందుతున్న ఈ మూడో చిత్రానికి వర్కింగ్ టైటిల్ 'వెంకీ అనిల్ 03'. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లు. ఈ చిత్ర షూటింగ్ దాదాపు 90% పూర్తైంది. ప్రస్తుతం డబ్బింగ్ పనులను ఆరంభించారు. ఈ మేరకు ఓ వీడియోను కూడా విడుదల చేశారు. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ ట్రయాంగ్యులర్ క్రైమ్ డ్రామాలో రాజేంద్రప్రసాద్, సాయికుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: సమీర్‌రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

త్వరలోనే టీజర్



దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌లో కియారా అడ్వాణీ కథానాయిక. దిల్‌రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా..వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. ఈ చిత్రం విడుదలకు సరిగ్గా 75 రోజుల సమయమే ఉందంటూ చిత్రబృందం విడుదల చేసిన ఓ పోస్టర్ అభిమానుల్లో ఆనందాన్ని నింపింది. త్వరలోనే టీజర్ కూడా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇటీవలే విడుదలైన పోస్టర్స్, రెండు పాటలు సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. మరోవైపు హీరోలు బాలకృష్ణ, వెంకటేశ్, అజిత్, సందీప్ కిషన్ నటిస్తున్న చిత్రాలు కూడా సంక్రాంతి బరిలో ఉన్నాయి.

కొత్తగా..

సరిహద్దులు లేని సినిమా



అజిత్ దాల్మియా నిర్మాణంలో ప్రమోద్ కుమార్ తెరకెక్కించిన హిందీ చిత్రం 'ఫౌజా'. కార్తీక్ దమ్ము, ఐశ్వర్యా సింగ్, పవన్ మల్హోత్ర ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మూవీని ప్రత్యేకంగా ప్రదర్శించారు. చిత్ర కథానాయకుడు కార్తీక్ దమ్ము, హీరో విజయ్ ధరన్ దాట్ల తదితరులు పాల్గొన్నారు. హీరో కార్తీక్ దమ్ము మాట్లాడుతూ 'సినిమాకి భాషా సరిహద్దులు ఉండవు. మరీ ముఖ్యంగా ఇలాంటి చిత్రానికి భాషతో సంబంధం ఉండదు. త్వరలోనే తెలుగు, తమిళ భాషల్లోకి ఈ చిత్రం రానుంది' అని తెలిపారు. దర్శకుడు ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ..'దేశం అంటే ప్రేమ, భక్తి ఉన్న ప్రతీ ఒక్కరికీ 'ఫౌజా' నచ్చుతుంది' అని అన్నారు.

మన సైన్యాన్ని అవమానిస్తారా?



శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన దేశభక్తి చిత్రం 'అమరన్' ఈ నెల 31న విడుదలకానుంది. మేజర్ ఉన్నిముకుందన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రమిది. ఈ నేపథ్యంలో సాయిపల్లవి పాత వీడియోను వైరల్ చేస్తూ నెటిజన్లు ఆమెను విమర్శిస్తున్నారు. ఆ వీడియోలో సాయిపల్లవి మాట్లాడుతూ 'అసలు హింసకు సరైన నిర్వచనం ఏమిటో అర్థం కావడం లేదు. మనుషుల దృష్టికోణాన్ని బట్టే ఏదైనా ఉంటుంది. ఇండియన్ ఆర్మీ అంటే మనకు ఎంతో గౌరవం. కానీ పాకిస్థాన్ ప్రజలు మన సైనికులను ఉగ్రవాదుల్లా చూస్తారు. వాళ్లకు చేటు చేస్తామని అనుకుంటారు. దృక్పథాలు ఇలా మారిపోతుంటాయి' అంటూ ఆమె మాట్లాడారు. ఈ వీడియో క్లిప్‌ను షేర్ చేస్తూ కొంతమంది సాయిపల్లవి భారత సైనికులను తీవ్రవాదులు అనే అర్థం వచ్చేలా మాట్లాడారని ప్రచారం చేస్తున్నారు. ఇండియా, పాకిస్థాన్ ఆర్మీలు రెండూ ఒకటే అనేలా మాట్లాడడం సరికాదని విమర్శిస్తున్నారు. సాయిపల్లవి భారత సైన్యం గురించి తప్పుగా మాట్లాడలేదు, ఇరు దేశాల ప్రజల దృక్పథాలను గురించి మాత్రమే ఆమె మాట్లాడారని మరికొందరు సమర్థిస్తున్నారు.

సినీ నిర్మాత రాధాకృష్ణమూర్తి మృతి



సినీ నిర్మాత జాగర్లమూడి రాధాకృష్ణమూర్తి (85) మృతి చెందారు. వయోభారంతో మూడు రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఆయన శనివారం రాత్రి స్వగ్రామమైన బాపట్ల జిల్లా కారంచేడులో తుదిశ్వాస విడిచారు. రాధాకృష్ణమూర్తి పలు చలన చిత్రాలను నిర్మించారు. 'ఒక దీపం, వియ్యాలవారి కయ్యాలు, శ్రీ వినాయక విజయం, కోడళ్లు వస్తున్నారు జాగ్రత్త, కోరుకున్న మొగుడు, ప్రతిబింబాలు' లాంటి పలు చిత్రాలకు ఆయన నిర్మాతగా వ్యవహరించారు. రాధాకృష్ణమూర్తి భార్య శాంతమ్మ మూడేళ్ల క్రితం మరణించారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాధాకృష్ణమూర్తి మృతి పట్ల పలువురు ప్రముఖులు, రాజకీయ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ఆయన అంత్యక్రియలు కారంచేడులో నిర్వహించారు.

- కారంచేడు (ఆంధ్రజ్యోతి)

ఆ వార్తలు చూసి షాకయ్యా

కృతిసనన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'దో పత్తి'. ఇందులో ఆమె ద్విపాత్రాభినయం చేశారు. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. కవలలైన అక్కా చెల్లెళ్ల రహస్యాలను వెలికితీసే పోలీసు అధికారి పాత్రలో కాజోల్ నటించారు. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఆమె ఒక ఇంటర్వ్యూ ఇచ్చారు. మీ గురించి మీరు చదివిన వింత వార్తలు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నించగా.. 'చాలా ఉన్నాయి. ఏకంగా నేను చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. వాటిని చూసి షాకయ్యా. ఇలా ఎన్నో సార్లు జరిగింది. దాదాపు ఐదేళ్లకో సారి ఇలాంటివి వస్తుంటాయి. ఇంటర్నెట్ లేని రోజుల్లో గుర్తు తెలియని వ్యక్తి మా అమ్మకు ఫోన్ చేసి... విమాన ప్రమాదంలో నేను చనిపోయినట్లు చెప్పాడు. ఇంట్లోవాళ్లు కంగారుపడ్డారు. ఇటీవల యూట్యూబ్‌లో నేను మరణించినట్లు వార్తలు కనిపించాయి. నా గురించి ఎలాంటి వార్తలు వచ్చాయి? ఎవరు ఎలా మాట్లాడుకుంటున్నారు? అని గూగుల్‌లో సెర్చ్ చేయను. నాపై ఏదైనా సంచలన కథనాలు వస్తే...స్నేహితులు నాకు పంపిస్తుంటారు. వాటిని చదివినప్పుడు ఇలా ఎలా రాస్తారు? అనిపిస్తుంది' అని కాజోల్ చెప్పారు.



ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయే సినిమా



'క' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమయ్యారు 'గం గం గణేశా', 'ఆయ్' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న **నయన్ సారిక, తన్వీ రామ్.** కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని దర్శక ద్వయం సుజీత్, సందీప్ తెరకెక్కించారు. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరోయిన్లు నయన సారిక, తన్వీరామ్ మీడియాతో ముచ్చటించారు.

నయన్ సారిక మాట్లాడుతూ "నేను ఇది వరకు చేసిన చిత్రాల్లోకంటే ఇందులో భిన్నమైన పాత్రను పోషించా. సినిమాలో సత్యభామ అనే సంప్రదాయబద్ధమైన యువతిగా నటించా. క్లైమాక్స్‌ను చాలా కాలం గుర్తు పెట్టుకుంటారు. ఇది యూనివర్సల్ పాయింట్‌తో తెరకెక్కిన చిత్రం. అందుకే పాన్‌ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయే సినిమా ఇది" అని చెప్పారు.

తన్వీరామ్ మాట్లాడుతూ "ఇందులో రాధ అనే ఓ స్కూల్ టీచర్ పాత్రలో నటించాను. సినిమాలో నా పాత్ర చాలా కీలకంగా ఉండబోతోంది. సినిమాలో కిరణ్ అబ్బవరం, తన్వీరామ్, నేను పోషించిన పాత్రలకూ ఉన్న సంబంధం ఏంటనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో బోలెడు ట్విస్టులు ఉంటాయి. ఈ టైటిల్ ఎందుకు పెట్టామనేది థియేటర్లో సినిమా చూసినప్పుడు తెలుస్తుంది" అని అన్నారు.

సినిమాల్లో నటించడం మానేస్తా

ఇటీవలే పీరియాడికల్ థ్రిల్లర్ 'క' చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "ఇది టైమ్ ట్రావెల్ నేపథ్యమున్న చిత్రం కాదు.. వాసుదేవ్ అనే వ్యక్తి ప్రయాణం. స్క్రీన్ ప్లే చాలా అద్భుతంగా ఉంటుంది. తప్పకుండా మీ అందరికీ సరికొత్త భావోద్వేగాన్ని పంచే చిత్రమిది. మల్టీప్లెక్స్‌ల కోసం రాసిన కథ కాదిది. బీ,సీ సెంటర్ల కోసమే సిద్ధం చేసిన కథ ఇది. ఇలాంటి కాన్సెప్ట్‌తో మునుపెన్నడూ సినిమా రాలేదు. ఒక వేళ వచ్చిందని నిరూపిస్తే.. సినిమాలు తీయడం మానేస్తాను" అని తెలిపారు.

రవిశంకర్ బయోపిక్‌లో...



ఆధ్యాత్మిక వేత్త, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ బయోపిక్ తెరకెక్కనుందని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఈ చిత్రంలో రవి శంకర్ పాత్రను విక్రాంత్ మాసే పోషించనున్నారని టాక్. గతేడాది సిద్ధార్థ్ ఆనంద్, మహావీర్ జైన్ ఈ చిత్రాన్ని ప్రకటించారు. హిందీతో పాటు ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో ఈ చిత్రం తెరకెక్కనుందని సమాచారం. కొన్ని రోజుల క్రితం విక్రాంత్‌మాసే రవిశంకర్‌ను కలసి ఆశీస్సులు అందుకున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ఈ చిత్రంపై అధికారిక ప్రకటన రావొచ్చని భావిస్తున్నారు.

ఆగని 'పోలీసు' పోరు

- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు
- పోలీసుల సస్పెన్షన్‌తో ఉద్రిక్తం
- కానిస్టేబుళ్ల సస్పెన్షన్ ఎత్తివేయండి: హరీశ్
- నేడు కోమటిరెడ్డి దృష్టికి పోలీసుల సమస్యలు?

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో 'ఒకే పోలీస్' విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం వివిధ బెటాలియన్ పోలీసులతో పాటు వారి కుటుంబసభ్యులు, చిన్నారులు నిరసనలు చేపట్టారు. సస్పెండ్ చేసిన 39 మంది సిబ్బందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని 17వ బెటాలియన్ పోలీసులు ఆందోళన చేపట్టారు. లేనిపక్షంలో తమను కూడా సస్పెండ్ చేయాలని ధర్నా చేశారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పోలీసు వ్యవస్థను ఇక్కడ కూడా అమలు చేయాలని కోరడం తప్పా అని ఆవేదన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా గుడిపేట 13వ బెటాలియన్‌లోని నలుగురు కానిస్టేబుళ్లు, ఒక హెడ్ కానిస్టేబుల్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కమాండెంట్ రాములుకు వినతిపత్రం అందించారు. తమిళనాడు, కర్ణాటకలో ఉన్న పోలీస్ విధానాన్ని అమలు చేయాలని వరంగల్ 4వ బెటాలియన్ సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రధాన ద్వారం ముందు బైఠాయించి ధర్నా చేశారు. 'టీజీఎస్పీ వద్దురా... ఏక్ పోలీసు ముద్దురా' అంటూ ఆదివారం రాత్రి నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి 7వ బెటాలియన్ కానిస్టేబుళ్లు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. నల్లగొండలోని అన్నెపర్తిలో గల 12వ బెటాలియన్ పోలీసుల నిరసనలు నాలుగో రోజూ కొనసాగాయి. బెటాలియన్ ప్రధాన ద్వారం వద్ద పోలీసులు, కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్ విగ్రహం ముందు 3వ బెటాలియన్ కానిస్టేబుళ్లు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. సోమవారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు టీజీఎస్పీ సిబ్బంది తెలిపారు. కాగా, యూనిఫామ్‌తో నిరసనలో పాల్గొన్న పోలీసులపై రాష్ట్ర పోలీసు యంత్రాంగం చర్యలకు పూనుకుంది. శనివారం 39 మందిని సస్పెండ్ చేసింది. కాగా, బెటాలియన్ కానిస్టేబుళ్లపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డీజీపీ జితేందర్‌ను మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదివారం ఎక్స్ వేదికగా కోరారు. ఇప్పటికే ఉన్న నిబంధనలను ప్రభుత్వం ఆకస్మికంగా సవరించడం, తెలంగాణ స్పెషల్ పోలీసుల అభ్యర్థనలు పరిగణనలోకి తీసుకోకపోవడం తగదన్నారు. మానవతా దృక్పథంతో వారి సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పోలీసు కుటుంబాలు రోడ్డెక్కడం చరిత్రలో మొదటిసారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. టీజీఎస్పీ కానిస్టేబుళ్ల పనిభారాన్ని పెంచుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్ చేశారు.



ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న 3వ బెటాలియన్ కానిస్టేబుళ్లు

నేడు మంత్రి కోమటిరెడ్డి దృష్టికి సమస్యలు?

నల్లగొండలోని 12వ బెటాలియన్ పక్కనే ఉన్న మహాత్మ గాంధీ వర్సిటీ ప్రధాన క్యాంపస్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం రానున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు కుటుంబాలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నాలుగేళ్లలో మెట్రో రెండో దశ పూర్తి!

- రూ.24,269కోట్ల వ్యయంతో ప్రాజెక్టు
- డీపీఆర్‌లకు మంత్రి వర్గం ఆమోదం

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మెట్రో రెండో దశ ప్రాజెక్టును నాలుగేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. సుమారు రూ. 24,269 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు రుణాల ద్వారా 52శాతం నిధులను సమీకరించాలని నిర్ణయించింది. పెరుగుతున్న హైదరాబాద్ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రెండవ దశ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌కు శనివారం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే పనులు మొదలు పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. 76.4కిలోమీటర్ల మేర మెట్రో నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే డీపీఆర్‌లు కూడా పూర్తయ్యాయి.

మొదటి దశలో మూడు కారిడార్లు ఉండగా, రెండో దశలో కొత్తగా 5 కారిడార్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 36.8 కిలో మీటర్లు, రాయదుర్గ్ నుంచి కోకాపేట నియో పోలీస్ వరకు 11.6 కిలో మీటర్లు, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలో మీటర్లు, మియాపూర్ నుంచి పటన్‌చెర్వు వరకు 13.4 కిలో మీటర్ల మేర, ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలో మీటర్ల మేర మెట్రోను నిర్మించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతోపాటు పీపీపీ విధానంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ప్రాజెక్టు వ్యయంలో 30 శాతం అంటే రూ.7313 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం, 18 శాతం అంటే రూ.4,230 కోట్లను కేంద్ర ప్రభుత్వం భరించనున్నాయి. మిగిలిన 52 శాతం నిధులను రుణాలతోపాటు పీపీపీ విధానంలో సమకూర్చనున్నారు. ప్రస్తుతం రోజూ దాదాపు 5 లక్షల మంది మెట్రోలో ప్రయాణిస్తుండగా... రెండో దశ అందుబాటులోకి వస్తే మరో 8 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నారు.

మూసీ ప్రక్షాళన ఆగదు

ఎన్ని శక్తులు అడ్డుపడినా ఆ బాధ్యత కాంగ్రెస్‌దే.. పునరుజ్జీవానికి యాదవులు సహకరించాలి

- ఇకపై అధికారికంగా సదర్ సమ్మేళనం
- సదర్ సమ్మేళనంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ సిటీ/కవాడిగూడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మూసీ నదిని ప్రక్షాళన చేసి హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తుందని, ఎన్ని శక్తులు అడ్డుపడినా ప్రక్రియ పూర్తి చేసే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని, ఇందుకు యాదవ సోదరులు సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సదర్ సమ్మేళనానికి రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇకపై ప్రతి ఏడాది సదర్ సమ్మేళనాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ఆయన ప్రకటించారు. కులీ కుతుబ్ షాహీ, నిజాంల కాలం నుంచి నగర నిర్మాణం, అభివృద్ధిలో యాదవులు మూల పురుషులుగా ఉన్నారని, మూసీలో గడ్డి చేలు యాదవ సోదరులవే అని ఆయన గుర్తు చేశారు. మూసీ పరీవాహక ప్రాంతం మురికి కూపంగా మారి.. హైదరాబాదీలకు విష వాయువులు అందిస్తుందని, దుర్భరంగా మారిన వారి జీవన విధానం మార్చేందుకు మూసీని ప్రక్షాళన చేసి, పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మూసీ వెంట నరకం అనుభవిస్తోన్న పేదవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాబోయే రోజుల్లో యాదవులకు అత్యధికంగా సీట్లు ఇస్తామని, కార్పొరేటర్లు, ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాప్రతినిధులుగా అవకాశాలు పెంచి నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని రేవంత్ చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్‌లో అంజన్ కుమార్ యాదవ్ ఓడిపోయినా యాదవ సోదరుల నాయకత్వం ఉండాలని, ఆయన కుమారుడు అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు పంపామని రేవంత్ తెలిపారు. యాదవులకు రాజ్యసభలో ప్రాతినిధ్యం ఉండాలని, సోనియా, రాహుల్‌ను ఒప్పించి అనిల్‌కు అవకాశం కల్పించామన్నారు. మున్ముందు యాదవ సోదరులకు రాష్ట్ర ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని, కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు. యాదవులకు ఏ అవసరం వచ్చినా.. ప్రభుత్వం అండ అవసరమని భావించినా.. స్వేచ్ఛగా తన దగ్గరకు రావాలని రేవంత్ సూచించారు. లక్ష్మీపూజ సందర్భంగా సదర్ ఉత్సవాలు నిర్వహించడం తెలంగాణ రాష్ట్రానికి గర్వ కారణమన్నారు. పశు సంపదను దేవుళ్లతో సమానంగా పూజిస్తోన్న సంస్కృతి దేశానికి ఆదర్శమని రేవంత్ చెప్పారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి రఘువీరా రెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సదర్ సమ్మేళనంలో హాకీ స్టిక్‌లతో స్టెప్పులేస్తున్న సీఎం రేవంత్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం

స్టెప్పులేసిన రేవంత్‌రెడ్డి

సదర్ సమ్మేళనంలో రేవంత్‌రెడ్డి స్టెప్పులేశారు. యాదవ సోదరుల విజ్ఞప్తి మేరకు అంజన్‌కుమార్‌యాదవ్, అనిల్‌కుమార్ యాదవ్‌లతో కలిసి చేతిలో హాకీ స్టిక్ పట్టుకొని నృత్యం చేశారు. సమ్మేళనంలో పాల్గొన్న వారు కూడా హుషారుగా స్టెప్పులేశారు.

ధర్నాచౌక్‌లో సదర్ ఉత్సవాలు

ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో డప్పు వాయిద్యాలకు అనుగుణంగా దున్నపోతుల విన్యాసాలు, యాదవ సోదరుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యాదవుల పాటలు, నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ఇందిరా పార్కు ధర్నా చౌక్ హోరెత్తింది.

ఏఆర్ ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్ సహా 10 మంది తొలగింపు!

- ఉద్యోగాల నుంచి తప్పించిన టీజీఎస్పీ

హైదరాబాద్/సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ రోడ్డెక్కిన పోలీసు సిబ్బందిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. నిరసనల పేరుతో నిబంధలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ 39 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను శనివారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఓ ఏఆర్ ఎస్సై, మరో హెడ్ కానిస్టేబుల్ సహా ఏకంగా 10 మందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. క్రమశిక్షణగా ఉండాల్సిన పోలీసు శాఖలో నిబంధనలకు విరుద్ధంగా నిరసనలు తెలిపారన్న కారణంతో వీరిని తొలగిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ)లో సెలవులతో పాటు ఇతర అంశాలకు సంబంధించి అదనపు డీజీపీ ఇటీవల జారీ చేసిన సర్క్యులర్‌ను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని బెటాలియన్ల సిబ్బంది, కుటుంబ సభ్యులు నిరసనలకు దిగారు. ఆర్డర్లీ వ్యవస్థ, సెలవులు ఇవ్వకపోవడం, ఇతర సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ క్రమంలో కొందరు పరిధి దాటి వ్యవహరించినట్లు పోలీసు శాఖ అంతర్గత విచారణలో తేల్చారు. దీంతో ఉన్నతాధికారులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇబ్రహీంపట్నంలోని 3వ బెటాలియన్‌లో కానిస్టేబుల్ జి.రవికుమార్; భద్రాద్రి కొత్తగూడంలోని ఆరో బెటాలియన్‌లో కానిస్టేబుల్ కె.భూషణ్‌రావు; అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్ వి.రామకృష్ణ, కానిస్టేబుల్ ఎస్.కె.షఫీ; సిరిసిల్లలోని 17వ బెటాలియన్‌లో ఏఆర్ ఎస్సై సాయిరామ్; కానిస్టేబుళ్లు కె.లక్ష్మీనారాయణ, ఎస్.కరుణాకర్‌రెడ్డి, టి.వంశీ, బి.అశోక్, ఆర్.శ్రీనివాస్‌లను విధుల నుంచి తప్పించారు. వీరందరిపై ఆర్టికల్ 311(2)(బి) ప్రకారం చర్యలు తీసుకున్నట్లు ఉన్నతాధికారులు ప్రకటించారు. నిరసనల పేరుతో బెటాలియన్లలో చోటు చేసుకున్న పరిణామాలపై విచారణ కొనసాగుతోందని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. నిరసనలు తెలిపిన మరికొందరిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. బెటాలియన్ సిబ్బంది తమ సమస్యలను దర్బార్లలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఉన్నతాధికారులు సూచించారు.

హైదరాబాద్‌లో చంపేసి.. కర్ణాటకలో కాల్చేసి!

- ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య
- కొడుగు జిల్లాలోని కాఫీ తోటలో శవం దహనం

ఘట్‌కేసర్ రూరల్/భువనగిరి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా చంపేసిన భార్య ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లో అతడిని చంపి ఏకంగా కర్ణాటకకు తీసుకెళ్లి ఓ కాఫీ తోటలో శవాన్ని దహనం చేశారు. అయితే దీనిపై అక్కడి పోలీసులు ఫిర్యాదు అందగా.. విచారణలో అసలు విషయం బయటపడింది. సికింద్రాబాద్ తుకారాంగేట్‌కు చెందిన బజారు రమేశ్ కుమార్ (54) కుటుంబ కలహాలతో భార్య, కూతురును వదిలి మేడ్చల్-మల్కాజిగిరి పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంస్కృతిటౌన్‌షిప్‌లో మూడేళ్లుగా ఉంటున్నాడు. అయితే రమేశ్ 2018లో భువనగిరికి చెందిన నిహారికను బెంగళూరులో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయితే అప్పటికే నిహారికకు కూడా పెళ్లయి విడిగా ఉంటున్నట్లు సమాచారం. అయితే వ్యసనపరురాలైన నిహారిక.. రమేశ్‌కు అబద్ధాలు చెబుతూ డబ్బులు తీసుకునేది. తను పనిచేస్తున్న ఐటీ సంస్థ ఏడాదిన్నరగా జీతం చెల్లించట్లేదని చెప్పి.. గూగుల్ కంపెనీలో పని చేయడానికి జర్మనీ వెళ్లాల్సి ఉందని, అందుకోసం డబ్బులు కావాలని రూ.2.65 కోట్లు తీసుకుని వాడేసుకుంది. దీంతో అనుమానం వచ్చిన భర్త.. ఆరా తీయగా అదంతా అబద్ధమని తేలింది. దీంతో రమేశ్ నిహారికను దూరం పెడుతూ.. తీసుకున్న డబ్బులు తిరిగివ్వాలని ఆమెపై ఒత్తిడి చేశాడు. అప్పటికే ఏపీలోని కడపకు చెందిన నిఖిల్‌రెడ్డితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న నిహారిక అతడికి విషయం చెప్పిం ది. రమేశ్‌ను చంపితే అతడి ఆస్తి కూడా దక్కించుకోవచ్చనడంతో నిఖిల్ కూడా అందుకు అంగీకరించాడు. అతడి మిత్రుడు రాణాకు కూడా చెప్పి ఒప్పించాడు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌కు వచ్చిన రమేశ్‌ను కలిసేందుకు ఈనెల 4న సంస్కృతిటౌన్ షిప్‌కు ప్రియుడు నిఖిల్, రాణాతో కలసి నిహారిక చేరుకుంది. అందరూ కలిసి మద్యం తాగారు. అనంతరం పీర్జాదిగూడ స్పార్క్ ఆస్పత్రి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి కారులో చేరుకున్నారు. అక్కడ డబ్బుల విషయమై గొడవ జరగ్గా.. కారు వెనుక సీట్లో కూర్చున్న నిఖిల్, రాణా ముందు సీట్లో ఉన్న రమేశ్ గొంతుకు తాడు బిగించి చంపారు. శవాన్ని కారు డిక్కీలో వేసుకోని కర్ణాటకలోని కొడుగు జిల్లా కేంద్రం శివారులో కాల్చేశారు పోలీసులకు ఫిర్యాదు రావడంతో.. నిందితులను విచారించగా నేరం అంగీకరించారు.

మూసీ ప్రక్షాళనతోనే భావితరాలకు మనుగడ

దీనికయ్యే ఖర్చు పర్యాటకంతో తిరిగొస్తుంది

- వ్యతిరేకించే బీఆర్ఎస్, బీజేపీ నేతలను గ్రామాల్లోకి రాకుండా తరిమికొట్టాలి
- మూసీ పునరుజ్జీవానికే భగీరథ యత్నం
- భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి
- మానాయికుంటలో రైతుల సమ్మేళనం

మోత్కూరు/శాలిగౌరారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మూసీ నదిని ప్రక్షాళన చేస్తేనే భావితరాలకు మనుగడ ఉంటుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళనకు మద్దతుగా యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం మానాయికుంటలోని మూసీ వంతెనపై తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు అధ్యక్షతన నిర్వహించిన రైతుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశంతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళనను బీఆర్ఎస్, బీజేపీలు రాజకీయ కుట్రతో అడ్డుకోవడానికి చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. భావితరాల మనుగడ కోసం ఆత్మవిమర్శ చేసుకుని ప్రక్షాళనకు మద్దతుగా ఉండాలన్నారు. ప్రభుత్వం చేస్తున్నది మూసీ నది సుందరీకరణ కాదని, మూసీ పునరుజ్జీవం కోసం, మూసీ మురికి నుంచి ప్రజలను విముక్తి చేయడానికి భగీరథ ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతుంటే దరిద్రపు ఆలోచనలతో బీఆర్ఎస్, బీజేపీ విషప్రచారం చేస్తున్నాయన్నారు. సోషల్ మీడియాలో చిల్లర ప్రసంగాలు, ప్రచారాలు మానుకోవాలన్నారు. తాము ముగ్గురం ఈ ప్రాంతానికి చెందినవారమేనని, తమ చిన్నతనంలో మూసీలో చెలిమెలు తీసుకుని మంచినీరు తాగేవారమని, ఈ నీటిలో ఈత కొట్టేవారమని, ఇప్పుడు దుస్తులు కూడా ఉతకలేని దుస్థితి ఏర్పడిందన్నారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళనకు సిద్ధమయ్యారన్నారు. మూసీ ప్రక్షాళనకు మద్దతుగా తాము ఇక్కడి నుంచే (మూసీ ఒడ్డు నుంచే) శంఖం పూరిస్తున్నామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తన హయాంలో 'హైదరాబాద్‌ను ఇస్తాంబుల్ చేస్తా, న్యూయార్క్ చేస్తా, లండన్ చేస్తా'నన్నాడు.. ఎందుకు చేయలేదు... ఇంట్ల పడుకుంటే అవుతాయా' అని కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత అందరూ అభివృద్ధికి సహకరించాలన్నారు. మూసీ ప్రక్షాళనకు చేస్తున్న వ్యయం పర్యాటకం ద్వారా ప్రభుత్వానికి తిరిగివస్తుందన్నారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటుచేసిన మూసీ రివర్ ప్రాజెక్టు, దానికి కేటాయించిన నిధులు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన చేస్తానంటే తప్పు పడుతున్న కేటీఆర్, హరీశ్... కేసీఆర్ మూసీని ప్రక్షాళన చేస్తానన్నప్పుడు ఒప్పెలా అయ్యిందో చెప్పాలన్నారు. మోదీ గంగా నది ప్రక్షాళన చేస్తే మంచి, రేవంత్‌రెడ్డి మూసీని ప్రక్షాళన చేస్తే చెడు ఎలా అవుతుందో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్ చెప్పాలన్నారు. మూసీ ప్రక్షాళనను వ్యతిరేకించే బీఆర్ఎస్, బీజేపీ నాయకులను గ్రామాల్లోకి రాకుండా తరిమికొట్టాలన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లా ప్రజలు గొంతువిప్పి మద్దతు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ మూసీని ప్రక్షాళన చేయడం ఈ ప్రాంత రైతుల అదృష్టమన్నారు. ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మూసీ ప్రక్షాళనకు రూ.16కోట్లు ఖర్చు పెట్టినట్లు లెక్కలు చూపించి ప్రజలను మోసం చేసిందన్నారు.



యాదాద్రి జిల్లా మానాయికుంటలో నిర్వహించిన రైతు సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి



రైతు సమ్మేళనానికి హాజరైన స్థానికులు, రైతులు

రియల్ వ్యాపారం కోసమే మూసీ డ్రామా

పునరుజ్జీవం పేరిట కాంగ్రెస్ దోపిడీ
పథకాలకు పైసల్లేవంటున్న సర్కార్‌కు
'మూసీ'కి లక్షన్నర కోట్లు ఎక్కడివి?: కేటీఆర్

మల్లాపూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): "రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే మూసీ పునరుజ్జీవం పేరిట డ్రామా ఆడుతున్నారు. మూసీ పేరు చెప్పి కాంగ్రెస్ దోపిడీకి సిద్ధమైంది. మూసీ బ్యూటిఫికేషన్‌కు మేము వ్యతిరేకం కాదు.. లూటిఫికేషన్‌కు మాత్రమే వ్యతిరేకం" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆదివారం నాచారం ఎస్టీపీని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. హైదరాబాద్ విశ్వనగరంగా ఎదగడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ కృషి ఎంతో ఉందని, రూ.20వేల కోట్లతో మూసీ అభివృద్ధికి ప్రణాళికలు రచించామని చెప్పారు. ఇప్పుడు రేవంత్ సర్కార్ లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ అంటోందని, దీని వెనుక ఢిల్లీకి మూటలు పంపడమే లక్ష్యంగా ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎస్టీపీల (మురుగు నీటి శుద్ధి కేంద్రాలు) వల్ల మురుగు నీరు శుద్ధి అవుతోందన్నారు. అప్పుడు ఎస్టీపీల కోసం సుమారు రూ.4వేల కోట్లు నిధులు కేటాయించామని, ఆనా డు నిర్మించిన ఎస్టీపీలనే ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నారన్నారు. రుణమాఫీకి, రైతుబంధుకు ప్రభుత్వం వద్ద పైసలు లేవని మంత్రులు అంటున్నారని, అలాంటప్పుడు మూసీ పునరుజ్జీవనానికి రూ.లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెచ్చి ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల అమలుపై నోరెత్తని కాంగ్రెస్ ప్రభుత్వం.. మూసీ అభివృద్ధి గురించి ప్రయత్నాలు చేస్తోందని, దీని వెనక ఉన్న విషయమేంటో ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

జైన మందిరానికి పూర్వవైభవం


పురావస్తు శాఖ అధికారుల ప్రణాళిక

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో శిథిలావస్థలోని పురాతన జైన మందిరాన్ని(గొల్లతగుడి) పునరుద్ధరించేందుకు పురావస్తు శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. క్రీ.శ 6-7శతాబ్దాల్లో రాష్ట్ర కూటుల కాలంలో కాల్చిన ఇటుకలు, సున్నంతో 65 అడుగుల ఎత్తులో దీన్ని నిర్మించడం విశేషం. వందల ఏళ్ల క్రితం జడ్చర్ల ప్రాంతం జైనుల ఆవాస ప్రాంతంగా, విలసిల్లినట్లు పలు ఆధారాలున్నాయి. 35 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన ఆలయం గొల్లతగుడితో పాటు పరిసర ప్రాంతాల్లో పలు చిన్న ఆలయాల ఆనవాళ్లు ఉన్నాయి. దశాబ్దాల క్రితం ఇక్కడ లభ్యమైన అయిదు అడుగుల ఎత్తైన జైనతీర్థంకరుల విగ్రహాన్ని పబ్లిక్ గార్డెన్స్‌లోని మ్యూజియానికి తరలించి భద్రపరిచారు. ఈ మేరకు గొల్లతగుడిని పరిరక్షించేందుకు ఇప్పటికే రూ.36 లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మించారు. కేంద్ర ప్రభుత్వం, జైనమత సంస్థలు పునరుద్ధరణ పనులకు నిధులు సమకూర్చడానికి ముందుకు వచ్చాయి.

'సాగర్' రెండు గేట్ల నుంచి నీటి విడుదల

589.70 అడుగులున్న ప్రాజెక్టు నీటిమట్టం
'పులిచింతల' 2 గేట్ల నుంచి నీటి విడుదల
కృష్ణా, తుంగభద్ర నదులకు తగ్గిన వరద

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, గద్వాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు రెండు గేట్ల నుంచి రెండ్రోజులుగా నీరు విడుదలవుతోంది. ఎగువనున్న శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 67,403 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 589.70 అడుగులుగా ఉంది. సాగర్ కుడి, ఎడమకాల్వలు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, ఎస్ఎల్‌బీసీ, వరదకాల్వ, రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 64,472 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 67,403 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఇక 645 అడుగుల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.80 అడుగులు ఉంది. ఆదివారం సాయంత్రానికి 702.69 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రెండు రోజులుగా ఒక గేటు నుంచి నీటిని విడుదల చేస్తుండగా.. ఆదివారం మూడో నంబర్ గేటును అడుగుమేర ఎత్తి 650.34 క్యూసెక్కుల నీటిని.. సీపేజీ, లీకేజీలు, ఆవిరి రూపంలో 53.35 క్యూసెక్కుల నీరు కలిసి మొత్తం 703.69 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతుంది. కాగా పులిచింతల ప్రాజెక్టు 2 గేట్ల ద్వారా 28,222 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 173.52అడుగులు ఉంది. మరోవైపు కర్ణాటకలో వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణా, తుంగభద్ర నదులకు వరద తగ్గుతోంది. ఆదివారం జూరాలకు 47వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, 4గేట్ల ద్వారా 16వేల క్యూసెక్కులు, జల విద్యుదుత్పత్తి ద్వారా 38,043క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్‌కు 17వేలక్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, గేట్లను మూసివేసి జల విద్యుదుత్పత్తి ద్వారా 5వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 72వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, జల విద్యుదుత్పత్తి ద్వారా 67వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



వక్ఫ్ బిల్లును ఎట్టిపరిస్థితిల్లోనూ అడ్డుకుంటాం

» ముస్లిం పర్సనల్ లా బోర్డు చీఫ్ రెహ్మానీ ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబరు 27: వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యతిరేకిస్తామని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు(ఏఐఎంపీఎల్‌బీ) అధ్యక్షుడు మౌలానా ఖాలిద్ సైఫుల్లా రెహ్మానీ ప్రకటించారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఏఐఎంపీఎల్‌బీ హక్కులను పరిమితం చేసే లక్ష్యంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తెచ్చిందని ఆరోపించారు. ఇప్పటికే దేశంలోని వక్ఫ్ ఆస్తులు పెద్ద మొత్తంలో ఆక్రమణలకు గురయ్యాయన్నారు. 'ఇది మాకు జీవన్మరణ సమస్య. ఎట్టి పరిస్థితుల్లోనూ బిల్లును అడ్డుకుంటాం. అవసరమైతే నేరస్థులను ఉంచేందుకు ఖాళీ లేనంతగా జైళ్లను నింపేందుకు దేశంలోని ముస్లింలు సిద్ధంగా ఉన్నారు. ప్రాణాలు ఇచ్చేందుకు సైతం వెనుకాడబోం' అని అన్నారు.

ఆలయ భూములను స్వాధీనం చేసుకున్న వక్ఫ్ బోర్డు

» దర్గాకు చెందినవని వెల్లడి.. అభ్యంతరం తెలిపిన ఆలయ ట్రస్టీ

అహ్మద్‌నగర్, అక్టోబరు 27: మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో దేవాలయం సమీపంలోని 40 ఎకరాల స్థలాన్ని వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకోవడంతో వివాదం నెలకొంది. కానిఫ్‌నాథ్ ఆలయం సమీపంలో ఉన్న ఈ స్థలం దర్గాకి చెందినదని పేర్కొంటూ బోర్డు పెట్టింది. ఇందుకు ఆధారాలుగా కొన్ని పత్రాలను పేర్కొంది. ఈ స్థలాన్ని 2005లో వక్ఫ్ చట్టం కింద రిజిస్టర్ చేశారు. అప్పటి నుంచి చట్టపరమైన వివాదం నడుస్తోంది. ఈ చర్యను ఆలయ ట్రస్టీ శ్రీహరి అంబేకర్ ఖండించారు. బ్రిటిష్ కాలం ముందు నుంచే ఆ స్థలం ఆలయ పరిధిలో ఉందని, ఇందుకు సంబంధించిన పత్రాలను కోర్టు కూడా అంగీకరించిందని తెలిపారు. ఆలయ ట్రస్టీలకు సమాచారం ఇవ్వకుండానే, తగిన నిబంధనలను పాటించకుండానే ఈ స్థలాన్ని వక్ఫ్ చట్టం ప్రకారం రిజిస్టర్ చేశారన్నారు.

ఉగ్రదాడుల్ని ఇంకెంత మాత్రమూ సహించం

» ముంబై ఉగ్రదాడిపై నాడు స్పందన లేదు

» మళ్లీ జరిగితే ప్రతిస్పందన ఉంటుంది: ఎస్.జైశంకర్

ముంబై, అక్టోబరు 27: ఉగ్రవాదంపై భారత వైఖరి బలంగా ఉందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. 26/11 ముంబై ఉగ్రదాడి తరహా ఘటనలు మళ్లీ జరిగితే గనుక ప్రతిస్పందన ఉంటుందని తేల్చిచెప్పారు. మహారాష్ట్రలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్ఠను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముంబైలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'ముంబైలో జరిగినది(26/11) మరో మారు జరగకూడదు. అప్పుడు ఉగ్రదాడి జరిగింది. దానిపై స్పందన లేదు. దీన్ని భారత్ ఆమోదించదు. వచ్చిన మార్పు ఇదే. నేడు ఉగ్రవాదంపై పోరులో మేం నాయకులం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ బలంగా నిలిచిందని ప్రజలకు తెలుసు' అన్నారు. పగటి పూట సాధారణ కార్యకలాపాలు నిర్వహిస్తూనే, రాత్రి వేళ ఉగ్రవాదాన్ని పెంచిపోషించే దేశాలను భారత్ సహించబోదని ఆయన తేల్చిచెప్పారు.

రేపు సీనియర్ సిటిజన్ల ఆరోగ్య పథకం ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టోబరు 27: ఆదాయంతో సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లందరికీ అమలు చేయనున్న ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన(ఏబీ పీఎంజేఏవై)ను ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 29న ప్రారంభించనున్నట్లు సమాచారం. అలాగే తల్లీబిడ్డల టీకాల కార్యక్రమాన్ని నమోదు చేసే యూ-విన్ పోర్టల్‌ని కూడా ప్రధాని అదే రోజు ప్రారంభిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. కాగా పేదలు, మధ్య తరగతి, ఉన్నత మధ్య తరగతి, ఉన్నత.. ఇలా అన్ని వర్గాల్లో 70 ఏళ్లు నిండిన లేదా ఆపైన వయస్సు ఉన్న వారందరూ ఆయుష్మాన్ భారత్ కార్డు పొందడానికి అర్హులు.

శ్రీశ్రీ రవిశంకర్‌కు ఫిజీ అత్యున్నత పౌర పురస్కారం



న్యూఢిల్లీ, అక్టోబరు 27: ప్రపంచ ఆధ్యాత్మిక గురువు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్‌ను ఫిజీ ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించింది. మనుషుల్లో స్ఫూర్తిని పెంపొందించడానికి, విభిన్న సమాజాలను శాంతి, సామరస్యంతో ఒక చోటికి తీసుకురావడానికి ఆయన అవిశ్రాంతంగా చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేసింది. 'హానరరీ ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ' పురస్కారాన్ని శ్రీశ్రీ రవిశంకర్‌కు ఫిజీ అధ్యక్షుడు రతు విలియం ఎం కటోనివెరె ప్రదానం చేశారు. దీంతో శ్రీశ్రీ రవిశంకర్‌కు అత్యున్నత పౌర పురస్కారాన్ని అందించిన ఆరో దేశంగా ఫిజీ నిలిచింది.

'ఉపాధి'లో తగ్గుదల అవాస్తవం

» ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతుందనడాన్ని తోసిపుచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ, అక్టోబరు 27: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతుందన్న వార్తలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఖండించింది. ఆర్థిక సంవత్సరం పూర్తి కాకుండానే ఇప్పుడే దానిపై ఒక అంచనాకు రావడం సరైంది కాదని వ్యాఖ్యానించింది. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం ఉపాధి హామీ పథకం కింద ప్రయోజనం పొందే కార్మికుల సంఖ్య తగ్గిందని పేర్కొంటూ కథనాలు వెలువడిన నేపథ్యంలో ఆ శాఖ స్పందించింది. అయితే, లిబ్‌టెక్ ఇండియా వెలువరించిన నివేదిక ప్రకారం గతంతో పోలిస్తే ఉపాధి పథకంలో కార్మికుల సంఖ్య 8% తగ్గినట్లు తెలుస్తోంది. దాదాపు 39 లక్షల కార్మికులను సదరు పథకం నుంచి తొలగించారని ఇది ఆందోళనకరమైన విషయమని ఆ నివేదిక పేర్కొంది. దీనిని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తోసిపుచ్చింది.

కాన్పూర్‌లో మరో 'దృశ్యం'

» మహిళను చంపి నిర్మాణంలో ఉన్న కలెక్టర్ భవనంలో ఖననం

కాన్పూర్, అక్టోబరు 27: ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో 'దృశ్యం' సినిమా తరహా ఘటన జరిగింది. ఓ మహిళతో వివాహేతర సంబంధంలో ఉన్న జిమ్ ట్రైనర్.. ఇద్దరి మధ్య మనస్పర్ధలు రావడంతో ఆమెను చంపి సినిమా తరహాలో నిర్మాణంలో ఉన్న కలెక్టర్ భవంతిలో పాతిపెట్టాడు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, కాన్పూర్‌కు చెందిన ఓ మహిళ (32)కు ఆమె నిత్యం వెళ్లే జిమ్‌లోని ట్రైనర్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. జూన్ 24న జిమ్‌కెళ్లిన మహిళ ట్రైనర్‌తో కలిసి కారులో బయటకెళ్లింది. ఈ క్రమంలో జిమ్ ట్రైనర్‌కు వేరొకరితో పెళ్లి నిశ్చయమైన విషయం గురించి వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన జిమ్ ట్రైనర్ ఆమె మెడపై గట్టిగా గుద్దడంతో స్పృహ తప్పి పడిపోయింది. అనంతరం ఆమెతో ఎప్పటికైనా ప్రమాదమని భావించి హతమార్చాడు. దృశ్యం సినిమా తరహాలో ఆమె శవాన్ని తీసుకెళ్లి నిర్మాణంలో ఉన్న కలెక్టర్ భవంతిలో పాతిపెట్టాడు. జిమ్‌కెళ్లిన తన భార్య ఇంటికి తిరిగి రాలేదని వివాహిత భర్త పోలీసులను ఆశ్రయించడంతో వారు జిమ్ ట్రైనర్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా హత్య విషయం బయటపడింది.

ఆగని బాంబు బెదిరింపులు

» ఎయిర్‌పోర్టులతో పాటు తిరుపతి, లక్నో హోటళ్లకు కూడా..

» పౌరవిమానయాన చట్టాల సవరణపై కసరత్తు

» కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

న్యూఢిల్లీ, తిరుపతి, లక్నో, అక్టోబరు 27: దేశవ్యాప్తంగా బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. ఆదివారం 50కిపైగా విమానాలతోపాటు తిరుపతి, లక్నోలోని పలు హోటళ్లకు బెదిరింపులు వచ్చాయి. భద్రతా నిబంధనల మేరకు రెండు విమానాలను దారి మళ్లించారు. మిగిలిన వాటిలో తనిఖీలు చేపట్టి ఎటువంటి ప్రమాదం లేదని తేల్చారు. దీంతో గత రెండు వారాల్లో బెదిరింపులు వచ్చిన విమానాల సంఖ్య 350 దాటింది. తిరుపతిలో మూడు రోజులుగా హోటళ్లకు వస్తున్న బాంబు బెదిరింపులు ఆదివారం కూడా కొనసాగాయి. ఇప్పటి వరకూ ఆరు హోటళ్లకు హెచ్చరికలు రాగా ఆయా హోటళ్లకు వెళ్లి, వాటిని ఖాళీ చేయించి, బాంబు నిర్వీర్య దళంతో తనిఖీలు చేసి ఏమీ లేవని తేల్చారు. ఆదివారం తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం సహా ఇస్కాన్ టెంపుల్‌కు కూడా బాంబులు పెట్టినట్టు సమాచారం రావడంతో అధికారులు పరుగులు పెట్టారు. ఎటువంటి ప్రమాదకరమైన వస్తువులు కనిపించకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. మరోవైపు యూపీ రాజధాని లక్నోలోని 10 ప్రముఖ హోటళ్లకు ఈమెయిళ్ల ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. తనిఖీల్లో ఎటువంటి పేలుడు పదార్థాలు లేవని వెల్లడైంది. బెదిరింపు మెయిల్స్ కోల్‌కతాకు చెందిన మిత్ర అనే వ్యక్తి నుంచి వచ్చాయని ప్రాథమికంగా గుర్తించి అతడిని బెంగళూరుకు తరలించారు. తిరుపతి విమానాశ్రయానికి కూడా అదే వ్యక్తి నుంచి బెదిరింపులు అందినట్టు విచారణలో తేలితే ఏర్పేడు పోలీసులకు మిత్రను అప్పగించే అవకాశముందని తెలిసింది. కాగా, నకిలీ బెదిరింపులను అడ్డుకోవటానికి దర్యాప్తు, నిఘా సంస్థలతోపాటు అంతర్జాతీయ సంస్థల సహకారాన్నీ తీసుకుంటున్నామని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు తెలిపారు. రెండు పౌర విమానయాన చట్టాలను కూడా సవరించే కసరత్తు జరుగుతోందన్నారు.

యుద్ధమా? దాడులతో సరా?

(మొదటి పేజీ తరువాయి)



రుచిచూపిస్తామని ప్రకటించారు! అయితే.. ఎలాంటి దాడులు చేయాలనే అంశంపై సైన్యం ప్రణాళికలు రచిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో.. రెండు దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధం జరిగే ప్రమాదం ఉందా? అనే ఆందోళన చాలామందిలో వ్యక్తమవుతోంది. కానీ.. ఖమేనీ వ్యాఖ్యలను, ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన ప్రతీకార దాడుల తీరును పరిశీలిస్తే రెండు దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధం జరిగే ముప్పు తక్కువనే అభిప్రాయాన్ని రక్షణ రంగ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే.. పూర్తిస్థాయి యుద్ధానికి వెళ్తే దెబ్బ తింటామనే విషయం రెండు దేశాలకూ తెలుసు. మరీ ముఖ్యంగా.. నిరుడు అక్టోబరులో హమాస్ కిరాతకదాడితో మొదలైన యుద్ధంలో తాము ఏడుగురు శత్రువులతో పోరాడుతున్నామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కొద్దిరోజుల క్రితమే అన్నారు! ఆ ఏడుగురు శత్రువులూ.. గాజాలో హమాస్, లెబనాన్‌లో హెజ్బొల్లా, యెమెన్‌లో హౌతీలు, వెస్ట్‌బ్యాంక్‌లో ఉగ్రవాదులు, ఇరాన్, ఇరాక్, సిరియాలకు చెందిన షియా మిలిటెంట్లు. వారిలో హెజ్బొల్లా, హౌతీ, షియా మిలిటెంట్లు ఇరాన్ ప్రాక్సీలే. ఒకవైపు వీరందరితో పోరాడుతూ మరోవైపు ఇరాన్‌తో నేరుగా యుద్ధంలోకి దిగడం ఇజ్రాయెల్‌కు అంతమంచిది కాదు. అందునా.. ఇప్పటికే ఏడాదికాలంగా నెలకొన్న యుద్ధవాతావరణంతో ఇజ్రాయెలీలు విసిగిపోయి ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పూర్తిస్థాయి యుద్ధమంటే ప్రజల మద్దతు ఉండదు. ఇక, ఇజ్రాయెల్‌తో పోలిస్తే.. సంఖ్యలో ఇరాన్ వద్ద భారీగా క్షిపణులు, డ్రోన్లు ఉన్నా, పటిష్ఠమైన ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ ముందు వాటి శక్తి తక్కువే. అక్టోబరు 1న జరిపిన దాడితోనే ఇరాన్‌కు ఆ విషయం అర్థమైంది. కాబట్టి.. రెండు దేశాలూ ఇలాగే అప్పుడప్పుడూ ప్రతీకార దాడులతో సరిపెట్టే అవకాశం ఉందని అంచనా! అలాగని పూర్తిస్థాయి యుద్ధం జరిగే ప్రమాదాన్నీ కొట్టిపారేయలేం. అదే జరిగితే అందులో ఎవరు గెలిచే అవకాశం ఉంది? ఎవరి బలం, బలగం ఎంత? పరిశీలిస్తే..

బాలిస్టిక్ క్షిపణులు

ఇరాన్ వద్ద 2000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలపైన కూడా దాడులు చేయగలిగే పలు శ్రేణుల క్షిపణులు 3,500 దాకా ఉన్నాయి. అందులో కొన్ని 500 కిలోల బరువున్న ఆయుధాలను కూడా మోసుకెళ్లగలవు. ఇటీవలే.. ఫతా పేరుతో హైపర్‌సానిక్ క్షిపణులను కూడా రంగంలోకి దించింది. వేల సంఖ్యలో డ్రోన్లను కూడా అభివృద్ధి చేసుకుంది. ఇరాన్ క్షిపణుల్లో చాలావరకూ ఇజ్రాయెల్‌లోని వివిధ ప్రాంతాలపై దాడులు చేయగల సామర్థ్యం ఉన్నవి. మరోవైపు, ఇజ్రాయెల్ వద్ద.. 4,800 నుంచి 6,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగల అత్యంత అధునాతనమైన, శక్తిమంతమైన క్షిపణులున్నాయి. ఇజ్రాయెల్ వద్ద ఉన్న హెరాన్ డ్రోన్లు నిరంతరాయంగా 30 గంటలపాటు ప్రయాణించగలవు.


అణ్వాయుధాలు

ఇజ్రాయెల్ వద్ద 90 న్యూక్లియర్ వార్‌హెడ్స్ ఉన్నట్టు సమాచారం. ఇరాన్ వద్ద ప్రస్తుతానికి అణ్వాయుధాలు లేవుగానీ.. వారి అణు కార్యక్రమం చాలా అడ్వాన్స్‌డ్ దశలో ఉంది. పౌర అవసరాల నిమిత్తమే అణు కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెబుతున్న ఇరాన్ వద్ద నాలుగు అణ్వాయుధాలు తయారుచేయడానికి సరిపడా అణు పదార్థం (నియర్ వెపన్స్ గ్రేడ్ మెటీరియల్) ఉన్నట్టు ఐక్యరాజ్య సమితి అణు సంస్థ చెబుతోంది. అయితే.. అణ్వాయుధాలు తయారీకి అవసరమైన పరిజ్ఞానం తమ వద్ద ఉందని.. జనహనన ఆయుధాలను తయారుచేయబోమన్న తమ వైఖరిని అవసరమైతే ఏ క్షణమైనా మార్చుకుంటామని ఇరాన్ ఇటీవలికాలంలో హెచ్చరించడం గమనార్హం.

గగనతల రక్షణ వ్యవస్థలు

ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన గగనతల రక్షణ వ్యవస్థలను కలిగి ఉన్న దేశం ఇజ్రాయెల్. ఆ దేశ 'ఐరన్ డోమ్', 'డేవిడ్స్ స్లింగ్', 'యారో' వ్యవస్థల సత్తా గురించి ప్రపంచం మొత్తానికీ తెలుసు. గతంలో ఇరాన్ కురిపించిన క్షిపణులు, డ్రోన్ల వర్షాన్ని ఇజ్రాయెల్ వీటి ద్వారానే సమర్థంగా ఎదుర్కొంది. ఇక, ఇరాన్ విషయానికి వస్తే.. ఆ దేశం రష్యన్లు రూపొందించిన ఎస్-200, ఎస్-300లతోపాటు, స్థానికంగా అభివృద్ధి చేసుకున్న బవర్-373లపై ఆధారపడింది. కానీ, తాజా దాడితో ఇజ్రాయెల్.. ఆ వ్యవస్థలను ఛేదించి మరీ ఇరాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లేలా చేయగలిగింది. ఇక.. ఇరు దేశాల సైనికశక్తి, యుద్ధ ట్యాంకులు, శతఘ్నుల వంటివాటిని చూస్తే.. అంకెలపరంగా అన్నింటా ఇరాన్‌దే పైచేయిగా కనిపించవచ్చుగానీ, టెక్నాలజీ, రక్షణ ఖర్చు, వైమానిక శక్తి, బాలిస్టిక్ క్షిపణులు, అణ్వాయుధాల పరంగా చూస్తే ఇజ్రాయెల్ శక్తి చాలా ఎక్కువ. రెండువేల కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న ఈ రెండు దేశాల సైన్యాలూ తలపడడం కల్ల! ఇక మిగిలింది వైమానిక, క్షిపణి దాడులే. ఆ విషయంలో ఇజ్రాయెల్‌కు స్పష్టమైన ఆధిక్యం ఉంది. ఇరాన్ వద్ద ఎఫ్-4, ఎఫ్-14, సుఖోయ్-24, మిగ్-29ఎస్ యుద్ధవిమానాలున్నాయి (అమెరికాకు ప్రస్తుతం బద్ధశత్రువుగా ఉన్న ఇరాన్‌కు ఎఫ్-14 యుద్ధవిమానాలు ఎలా వచ్చాయంటే.. 1972లో ఇరాన్ రాజు షాతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 80కిగాను.. 79 ఎఫ్-14 యుద్ధవిమానాలను అమెరికా సరఫరా చేసింది. మరో ఎఫ్-14ను సరఫరా చేసే సమయానికి అక్కడ ఇస్లామిక్ విప్లవం రావడంతో దాన్ని విరమించుకుంది). వీటిలో ఎఫ్-4, ఎఫ్-14, సుఖోయ్ 24 యుద్ధవిమానాలు చాలా పాతవి. వాటితో పోలిస్తే.. ఇజ్రాయెల్ వద్ద అత్యంత అధునాతనమైన ఎఫ్-15, ఎఫ్-16, ఎఫ్-35లున్నాయి. కాబట్టి ఇరాన్ ఆచితూచి స్పందిస్తుందనే ఆశించవచ్చు. ఇజ్రాయెల్ కూడా పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధంగా లేదు కాబట్టి రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత ముదరకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లోకం తీరు



	ఇరాన్	ఇజ్రాయెల్
సైన్యం	6,10,000	1,69,500
రిజర్వ్ బలగాలు	3,50,000	4,65,000
యుద్ధ ట్యాంకులు	10,513	1,650
శతఘ్నులు	6798	530
కవచం కలిగిన వాహనాలు	640	1,190
యుద్ధవిమానాలు	312	345
దాడి చేసే హెలికాప్టర్లు	57	43
టాక్టికల్ జలాంతర్గాములు	17	5
గస్తీ నౌకలు	68	49
రక్షణ ఖర్చు		
ఇరాన్	రూ. 86,625 కోట్లు	
ఇజ్రాయెల్	రూ. 2.31 లక్షల కోట్లు	



ఇరాన్‌పై దాడిలో లక్ష్యాలన్నీ సాధించాం

» ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటన

» ఇరాన్ సత్తా చూపాలన్న ఖమేనీ

టెల్ అవీవ్, బీరుట్, గాజా, టెహ్రాన్: ఇరాన్‌లోని టెహ్రాన్, ఇలాం, కుజెస్థాన్‌లో ఉన్న సైనిక స్థావరాలు, క్షిపణి, డ్రోన్ తయారీ, ప్రయోగ కేంద్రాలపై శనివారం తెల్లవారుజామున చేసిన దాడిలో లక్ష్యాలన్నీ పూర్తి చేశామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. దాడిలో ఇరాన్ క్షిపణి తయారీకి ఉపయోగించే ఘన ఇంధన మిశ్రమం ఉత్పత్తి కేంద్రాన్ని ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఈ కారణంగా ఇరాన్ క్షిపణి కార్యక్రమం కోలుకోవడానికి కనీసం ఏడాది కాలం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ఇరాన్ ఎస్-300 గగనతల రక్షణ వ్యవస్థను కూడా దెబ్బతీసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. 2023 అక్టోబరు ఏడున హమాస్ దాడిలో మరణించినవారి సంస్మరణార్థం నిర్వహించిన కార్యక్రమంలో నెతన్యాహు ప్రసంగిస్తుండగా బందీల బంధువులు కొందరు అడ్డుకున్నారు. సిగ్గుపడు అంటూ నినాదాలు చేశారు. దీంతో నెతన్యాహు తన ప్రసంగాన్ని ప్రారంభించిన కాసేపటికే ముగించాల్సి వచ్చింది. మరోవైపు.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన ప్రతిదాడిపై సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్పందించారు. ఇరాన్ సత్తా ఏంటో ఇజ్రాయెల్‌కు చూపాలని పిలుపునిచ్చారు. అయితే ఎలా స్పందించాలనేదానిపై ఇరాన్ అధికారులు నిర్ణయిస్తారని చెప్పారు. ఇజ్రాయెల్ దాడులను తక్కువ చేసి చూడొద్దని, అలాగని అతిగా కూడా ఊహించుకోవద్దన్నారు. ఇజ్రాయెల్ జరిపిన దాడిని తాము తిప్పికొట్టామని, అందువల్లే నష్టం పరిమిత స్థాయిలో జరిగిందని ఇరాన్ ప్రకటించింది. నలుగురు సైనికులు మరణించారని వెల్లడించింది. ఇజ్రాయెల్‌పై సరైన సమయంలో దాడి చేస్తామనీ హెచ్చరించింది.

గాజాలో ఇజ్రాయెల్ దాడులు

గాజాలో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. బేట్ లహియాలో ఆరు భవనాలపై కురిపించిన బాంబుల వర్షంలో 47 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. కాగా, ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ సమీపంలోని ఓ బస్టాప్‌లోకి ట్రక్కు దూసుకుపోయిన ఘటనలో ఒకరు చనిపోయారు. 35 మంది గాయపడ్డారు. వీరిలో ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇజ్రాయెల్ ఇంటలిజెన్స్ ఏజెన్సీ మొసాద్ ప్రధాన కార్యాలయానికి అతి సమీపంలో ఈ ఘటన జరగడం, ట్రక్కు నడిపిన వ్యక్తి అరబ్ ఇజ్రాయెలీ కావడంతో ఉగ్రదాడిగా అనుమానిస్తున్నారు. నిందితుడిని కాల్చి చంపారు. మరోవైపు.. హెజ్బొల్లా సంస్థ లాటిన్ అమెరికా దేశాల ఆపరేషనల్ చీఫ్.. హుస్సేన్ అహ్మద్ కరాకీ ఆచూకీని గుర్తించామని అర్జెంటీనా రక్షణ మంత్రి ప్యాట్రికా బలారిచ్ ప్రకటించారు.

డిజిటల్ అరెస్టు.. అబద్ధం

చట్టంలో ఆ ప్రక్రియ లేనేలేదు.. ఏ ప్రభుత్వ సంస్థా ప్రజల్ని బెదిరించదు

» ఆన్‌లైన్ మోసగాళ్ల బారిన పడొద్దు

» 'మన్ కీ బాత్'లో ప్రజలకు ప్రధాని సూచన

» సైబర్‌నేరాలపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేసిన ట్వీట్‌ను ప్రస్తావించిన మోదీ

» చేర్యాల నకాశీ కళాకారుడు ధనాలకోట వైకుంఠంపై ప్రశంసల జల్లు



ధనాలకోట వైకుంఠం



న్యూఢిల్లీ, హైదరాబాద్ సిటీ, చేర్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ రోజుల్లో సైబర్ నేరాలు ప్రధాన సమస్యగా మారాయని ప్రధాని నరేంద్రమోదీ ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు మరింత అవగాహన అవసరమన్నారు. మోసగాళ్లు తాము పోలీసులుగా, సీబీఐ, ఆర్‌బీఐ, నార్కోటిక్స్ అధికారులుగా పరిచయం చేసుకొని వ్యక్తిగత సమాచారాన్ని రాబడతారని, తర్వాత ఆలోచించే సమయం కూడా ఇవ్వకుండా నిర్ణీత సమయంలోగా డబ్బులు చెల్లించాలని భయపెడుతూ ఒత్తిడి చేస్తారని తెలిపారు. ఆదివారం ప్రసారమైన 115వ 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ సైబర్ నేరాల అంశాన్ని ప్రస్తావించారు. సైబర్ దాడుల నుంచి ప్రజలను కాపాడేందుకు అనేక సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ మోసాల బారిన పడకుండా ఉండేందుకు 'ఆగి.. ఆలోచించి.. ఆ తర్వాత నిర్ణయించండి..' అనే మూడు అంచెల విధానాన్ని పాటించాలని ప్రజలకు సూచించారు. 'చట్టంలో డిజిటల్ అరెస్టు వంటి ప్రక్రియ లేనేలేదు. ఇది నేరగాళ్ల ముఠా చేసే మోసం. ఏ ప్రభుత్వ సంస్థా మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేయదు. ఫోన్లు చేసి డబ్బులు చెల్లించాలని బెదిరించదు. ప్రశాంతంగా ఆలోచించండి... వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దు.. వీలైతే స్క్రీన్ షాట్ తీసుకోండి. ఆ కాల్‌ను రికార్డు చేయండి. ప్రభుత్వ సంస్థలు ఎవరినీ బెదిరించవని గుర్తుంచుకోండి... ఇలాంటి పరిస్థితి ఎదురైతే వెంటనే నేషనల్ సైబర్ హెల్ప్‌లైన్ (1930)కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయండి' అని మోదీ సూచించారు. ఈ సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ గతంలో సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా చేసిన ఒక ట్వీట్‌ను ప్రధాని ప్రస్తావించారు. కర్ణాటకకు చెందిన సందీప్ పాటిల్.. తనకు వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాళ్ల బారినపడకుండా తప్పించుకోవటమే గాక వారి ప్రయత్నాన్ని వీడియో రికార్డ్ చేశాడు. ఈ వీడియోను సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేసి ఈతరహా మోసాల గురించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆ ట్వీట్‌ను ప్రధాని ప్రస్తావించటమే గాక పాటిల్ ధైర్యాన్ని మెచ్చుకున్నారు. దీనిపై ప్రధానికి సజ్జనార్ ధన్యవాదాలు తెలిపారు.

యానిమేషన్ పవర్‌హౌస్‌గా భారత్

యానిమేషన్ ప్రపంచంలో కొత్త విప్లవానికి నాంది పలికేదిశగా భారత్ ముందుకెళ్తోందని ప్రధాని చెప్పారు. దేశాన్ని యానిమేషన్ పవర్ హౌస్‌గా మార్చేందుకు సహకరించాలన్నారు. భారత్‌లోని యానిమేషన్ సిరీస్‌లకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉందంటూ.. 'చోటా భీమ్', 'హనుమాన్', 'మోటు-పట్లూ..'వంటి సిరీస్‌లను గుర్తుచేశారు. యానిమేషన్ ప్రపంచంలో 'మేడిన్ ఇండియా', 'మేడ్ బై ఇండియన్స్' ప్రతిచోటా కనిపిస్తాయన్నారు.

50 ఏళ్లుగా ధనాలకోట వైకుంఠం కృషి...

చేతివృత్తుల కళారంగాల్లో కృషి చేస్తున్న పలువురిని ప్రధాని ప్రశంసించారు. సిద్దిపేట జిల్లా చేర్యాల నకాశీ చిత్రకళను ప్రస్తావించారు. నకాశీ కళాకారుడైన ధనాలకోట వెంకటరామయ్య చిన్నకుమారుడు ధనాలకోట వైకుంఠం 50ఏళ్లుగా చేర్యాల జానపద, చిత్రకళను ప్రాచుర్యంలోకి తీసుకువస్తున్నారని, అరుదైన కళ పరిరక్షణలో ఆయన కృషి అద్భుతమని మోదీ కొనియాడారు. చేర్యాల పెయింటింగ్స్ ప్రత్యేకమని, స్క్రోల్ రూపంలో కథలను కళ్లకు కట్టినట్లుగా ముందుకు తీసుకువస్తాయని, వీటిలో మన చరిత్ర, పురాణాల గురించి ఉంటుందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌కు చెందిన బుట్లూరామ్ మాత్రాజీ అబూజ్ మాడియా తెగకు చెందిన జానపద కళలను సంరక్షించటానికి ఎంతో కృషి చేస్తున్నారని ప్రధాని ప్రశంసించారు.

'డిజిటల్' కండోమ్!

» యాప్ రూపొందించిన జర్మనీ సంస్థ బిల్లీ బాయ్

» శృంగార సమయంలో రహస్య రికార్డింగ్‌లకు చెక్

» బ్లూ టూత్‌తో కెమెరా, మైక్రో ఫోన్‌లకు అడ్డుకట్ట

» సెక్స్‌లో పాల్గొనేముందు యాక్టివేట్ చేస్తే చాలు

» కామ్‌డొమ్‌గా పేరు.. 30 పైగా దేశాల్లో విడుదల

బెర్లిన్, అక్టోబరు 27: వ్యక్తుల శరీరంలో ఓ భాగమై.. ప్రైవేటు జీవితంలోకి చొచ్చుకెళ్లింది సెల్ ఫోన్. పైగా సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిన కాలం ఇది. ఇక కొందరు.. సన్నిహిత సందర్భాలను స్మార్ట్ ఫోన్లలో రహస్యంగా రికార్డు చేస్తూ ఆ తర్వాత వాటిని చూపి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటివాటికి అవకాశం లేకుండా జర్మనీకి చెందిన లైంగిక ఆరోగ్య సంస్థ బిల్లీ బాయ్ ఓ యాప్‌ను తీసుకొచ్చింది. దీని పేరు కామ్‌డొమ్. రహస్య రికార్డింగ్‌లకు చెక్ పెట్టేలా రూపొందించిన ఈ యాప్‌ను.. సన్నిహిత సందర్భాల్లో, శృంగారంలో పాల్గొనేముందు మొబైల్ ఫోన్లను ఒకదగ్గరకు చేర్చి యాక్టివేట్ చేయాల్సి ఉంటుంది. వర్చువల్ బటన్ స్వైప్ చేస్తే.. బ్లూ టూత్ ద్వారా కెమెరా, మైక్రోఫోన్‌లు రికార్డు చేయకుండా చూస్తుంది. ఏదైనా ఫోన్‌ను అన్ బ్లాక్ చేసేందుకు ప్రయత్నిస్తే అలర్ట్ సైరన్ మోగుతుంది. ఈ యాప్ ద్వారా పలు డివైజ్‌లను ఒకేసారి నియంత్రించడం సాధ్యమని బిల్లీ బాయ్ తెలిపింది. కాగా, కామ్‌డొమ్‌ను డిజిటల్ కండోమ్‌గా వ్యవహరిస్తున్నారు. నిజమైన కండోమ్‌లను వినియోగించినంత సులభం అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. బిల్లీ బాయ్ దీనిని 30 పైగా దేశాల్లో విడుదల చేసింది.

పంజాబ్‌లో 105 కిలోల హెరాయిన్ పట్టివేత

» పాక్ నుంచి జలమార్గం ద్వారా భారత్‌లోకి.. ఇద్దరి అరెస్టు

అమృత్‌సర్, అక్టోబరు 27: పంజాబ్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. పాకిస్థాన్ నుంచి జలమార్గం ద్వారా భారత్‌కు తరలిస్తున్న దాదాపు 105 కిలోల హెరాయిన్‌ను ఆ రాష్ట్ర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో దీని విలువ వందల కోట్లలో ఉంటుందని అంచనా. సముద్ర మార్గంలో పెద్ద మొత్తం లో డ్రగ్స్‌ను తరలిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు ఉప్పందటంతో నిఘా పెట్టి శనివారం అర్ధరాత్రి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. డ్రగ్ స్మగ్లర్ నవ్ బుల్లర్ అనుచరులైన నవ్‌జ్యోత్‌సింగ్, లవ్‌ప్రీత్ కుమార్‌లను బాబా బకాల ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నట్లు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. డ్రగ్స్ సరఫరాకు స్మగ్లర్లు జలమార్గాన్ని ఎంచుకున్నారని, వారి నుంచి పెద్ద పెద్ద రబ్బరు ట్యూబులు, 6 తుపాకులు, 32 కేజీల కెఫిన్ అన్‌హైడ్రస్, 17 కేజీల డీఎమ్మార్(డెక్స్‌మెథార్ఫన్) స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరిపి ఈ ముఠాతో సంబంధం ఉన్న వారిని అరెస్టు చేస్తామని డీజీపీ చెప్పారు.

రాజకీయాల్లో పిల్లాడినే.. బరిలో భయపడేదే లేదు

» బీజేపీ మాకు సైద్ధాంతిక ప్రత్యర్థి.. డీఎంకే రాజకీయ ప్రత్యర్థి

» ద్రావిడ, తమిళ జాతీయవాద సిద్ధాంతాలను పాటిస్తాం

» కుటుంబ పాలనను అంతం చేస్తాం

» టీవీకే అధినేత విజయ్ వ్యాఖ్యలు

చెన్నై, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): 'రాజకీయాలు పాములాంటివి. నేను రాజకీయాల్లో చిన్న పిల్లాడినే కావచ్చు. నాకు అనుభవం కూడా లేకపోవచ్చు. అయినా బరిలోకి దిగిన తర్వాత ఎవ్వరికీ భయపడేదే లేదు' అని తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత, సినీనటుడు విజయ్ వ్యాఖ్యానించారు. తమ పార్టీకి బీజేపీ సైద్ధాంతిక ప్రత్యర్థి అయితే డీఎంకే రాజకీయ ప్రత్యర్థిగా ఆయన అభివర్ణించారు. తమిళనాడులోని విల్లుపురం జిల్లా విక్రవాండి వద్ద ఆదివారం సాయంత్రం భారీఎత్తున నిర్వహించిన టీవీకే తొలి మహానాడులో లక్షలాది మంది కార్యకర్తల సమక్షంలో విజయ్ ప్రసంగించారు. ఇప్పటి వరకూ ఆడియో లాంచ్ ప్రోగ్రామ్‌లలో ప్రసంగించిన తాను తొలిసారిగా ఇంతమంది ప్రజల ముందు, వారి సంక్షేమమే ధ్యేయంగా ప్రసంగించడం ఎంతో గర్వంగా ఉందని చెప్పారు. "ఈవీఆర్ పెరియార్, కె.కామరాజ్, బీఆర్ అంబేడ్కర్, రాణి వేలు నాచియార్, అంజలి అమ్మాళ్ వారసత్వాన్ని కొనసాగిస్తాం. వారి ఆశయాలతో పార్టీని ముందుకు తీసుకెళ్తాం. లౌకిక, సామాజిక న్యాయ సిద్ధాంతాల ప్రాతిపదికగా పనిచేస్తాం. నీట్ నిర్వహణకు మా పార్టీ వ్యతిరేకం. జాతీయ స్థాయిలో మెడికల్ ఎంట్రన్స్ పరీక్ష అవసరం లేదు. సమాజంలో విభేదాలు సృష్టించేవారు, అవినీతిపరులు మనకు మొదటి శత్రువులు. ద్రావిడ భావజాలాన్ని కాపాడుతున్నామని చెప్పుకొంటూ రాష్ట్రాన్ని కుటుంబ సంస్థలా



మహానాడుకు హాజరైన జనసందోహం

వాడుకుంటున్న వారు తదుపరి శత్రువులు' అని విజయ్ పేర్కొన్నారు. ద్రవిడ, తమిళ జాతీయవాద సిద్ధాంతాలు పాటిస్తామని, పుట్టుకతో అందరూ సమానులే అన్నది తమ పార్టీ సిద్ధాంతమని అన్నారు. కెరీర్‌ను పీక్స్‌లో వదిలేసి, తమిళనాడు ప్రజలపై తిరుగులేని విశ్వాసం, నమ్మకంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తమిళనాడు రాజకీయ ముఖచిత్రంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని, రాజీపడే ప్రసక్తే లేదని, సర్దుబాటు రాజకీయాలుండబోవని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజకీయాల్లోకి రాలేదని, సామాజిక నిబద్ధతతో వచ్చానని చెప్పారు.

ఈ ప్రభుత్వం ఉంటే ఏంటి.. ఊడితే ఏంటి?

తమిళనాట ద్రావిడ తరహా సుపరిపాలన అందిస్తున్నామంటూ ఓ కుటుంబ పరిపాలన కొనసాగుతోందని, దాన్ని అంతమొందించడమే తన కర్తవ్యమని విజయ్ ధ్వజమెత్తారు. పెరియార్, అన్నాదురై పేర్లు చెప్పుకుని రాష్ట్రంలో ఓ గుంపు కుటుంబ పాలన కొనసాగిస్తోందని పరోక్షంగా డీఎంకేపై విరుచుకుపడ్డారు. పేదలకు ఇల్లు, ఆహారం, ఉపాధి కల్పించడంలో విఫలమైన ఈ ప్రభుత్వం ఉంటే ఏంటి, ఊడితే ఏమిటంటూ అంటూ విరుచుకుపడ్డారు. తమ పార్టీకి ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ ఆదర్శమని, అయితే దేవుడు లేడంటూ ఆయన బలపరచిన నాస్తికవాదాన్ని మాత్రం తమ పార్టీ అంగీకరించే ప్రసక్తేలేదని విజయ్ స్పష్టం చేశారు.

కేటీఆర్ బావమరిది పార్టీలో డ్రగ్స్!

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తులు కొందరు శనివారం రాత్రి 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో మోకిల, శంకర్‌పల్లి, నార్సింగి, ఎస్‌వోటీ పోలీసులు నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ ఆధ్వర్యంలో జన్వాడలోని రాజ్ పాకాల ఫాంహౌస్‌పై దాడులు నిర్వహించారు. పోలీసుల సోదాల్లో విదేశీ మద్యంతో పాటు క్యాసినో ఆట వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురికి డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. పార్టీలో అనుమతి లేకుండా వినియోగిస్తున్న విదేశీ మద్యం 7.6 లీటర్లు, ఐఎంఎఫ్‌ఎల్ మద్యం 8.1 లీటర్లు, బీర్లు 6 లీటర్లను స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో 22 మంది పురుషులు, 16 మంది మహిళలు పాల్గొన్నారు. వీరందరికీ అక్కడే డ్రగ్ టెస్టులు చేసేందుకు ప్రయత్నించగా మహిళలు నిరాకరించారు. అయితే పురుషులందరికీ డ్రగ్ టెస్టులు నిర్వహించగా విజయ్ మద్దూరికి పాజిటివ్ వచ్చింది. విజయ్ తొలుత మూత్ర పరీక్షకు సహకరించలేదు. పోలీసులను ముప్పతిప్పలు పెట్టారు. తర్వాత పోలీసులు మూత్రంతో పాటు రక్తపరీక్షలు కూడా నిర్వహించారు. చివరకు పాజిటివ్ రావడంతో తాను ఇటీవలే విదేశాల నుంచి వచ్చానని, అక్కడ కొకైన్ తీసుకుని ఇండియాకు వచ్చానని విజయ్ పోలీసులను తప్పుదోవ పట్టించే యత్నం చేశాడు. మూత్ర పరీక్షలో పాజిటివ్ రావడంతో అతని గుట్టురట్టయింది. డ్రగ్స్ తీసుకుంటే 24 గంటల్లోపు అయితేనే మూత్ర పరీక్షలో తేలుతుంది. అంతకు మించితే రక్తపరీక్షలు చేస్తారు. గోళ్లు, వెంట్రుకల్లో డ్రగ్స్ ఆనవాళ్లు 3 నుంచి 6 నెలల దాకా ఉంటాయని నిపుణులు తెలిపారు.మూత్ర పరీక్షలోనే పాజిటివ్‌గా రావడంతో విజయ్‌ను అదుపులోకి తీసుకున్న మోకిల పోలీసులు.. ఎన్‌డీపీఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. మిగిలిన వారి వివరాలు తీసుకొని వదిలేశారు.

రాజ్ పాకాల ఇస్తేనే కొకైన్ తీసుకున్నా..

రాజ్ పాకాల కోరిక మేరకే తాను కొకైన్ తీసుకున్నట్లు విజయ్ చెప్పినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కొత్తగా నిర్మించిన ఫాంహౌస్‌లో దీపావళి పార్టీకి రమ్మని రాజ్ పాకాల తనను ఆహ్వానించాడని విజయ్ తెలిపారు. ఆయనే కొకైన్ ఇచ్చినట్లు చెప్పారు. అలాగే తరచూ తాము వీకెండ్ పార్టీల్లో డ్రగ్స్ తీసుకుంటామని కూడా వెల్లడించారు. అలాగే పోకర్ కాయిన్స్‌తో ఆడుకుంటామని తెలిపారు. దీంతో విజయ్ ఇచ్చిన వాంగ్మూలం కేసులో కీలకంగా మారనుంది. వీరికి కొకైన్ ఎలా వచ్చింది? ఎవరి దగ్గర నుంచి కొనుగోలు చేశారనే దానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఆ పార్టీలో ఇంకా ఎవరైనా పాల్గొని, దాడులకు ముందే అక్కడి నుంచి పరారయ్యారా? అనే కోణంలోనూ విచారిస్తున్నారు.

క్యాసినో ఆట వస్తువుల స్వాధీనం..

ఫాంహౌస్‌లో నిర్వహించిన పార్టీలో క్యాసినో ఆట ఆడేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. క్యాసినో ఆటకు ముంబై, గోవా నగరాలతో పాటుగా నేపాల్, థాయిలాండ్ దేశాలు ప్రముఖమైనవి. తెలంగాణలో ఇలాంటి ఆటలపై నిషేధం ఉంది. ఫాంహౌస్ పార్టీలో క్యాసినో ఆట వస్తువులను స్వాధీనం చేసుకోవడం ఆందోళన కలిగించే విషయం. ప్లేయింగ్ కార్డులు, క్యాసినో ఆట వస్తువులు ఉండడంతో ఫాంహౌస్ యజమాని రాజ్ పాకాలతో పాటు విజయ్ మద్దూరిపై గేమింగ్ యాక్టు కింద కేసు నమోదైంది.

రాజ్ పాకాల ఎక్కడ?

కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న రాజ్ పాకాల పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఆదివారం ఆయన్ని మోకిల పోలీస్ స్టేషన్‌కు రావాలని ఫోన్‌లో విచారణకు పిలిచారు. అలాగే ఎక్సైజ్ పోలీసులు కూడా విచారణకు రావాలని ఆదేశించారు. కానీ, ఆయన ఫోన్ స్విచ్చాఫ్ చేసుకొని.. విచారణకు రాలేదు. దీంతో పోలీసులు వారెంట్ జారీ చేయాలని నిర్ణయించారు.







ఫాంహౌస్; ఫాంహౌస్‌లో దొరికిన మందు సీసాలు, ఆట వస్తువులు



క్యాసినో ఆట వస్తువులు



ఎవరీ విజయ్?

విజయ్ మద్దూరి.. రాజ్ పాకాలకు అత్యంత సన్నిహితుడు. ఫ్యూజన్ ఏఐఎక్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ చైర్మన్‌గా ఉన్నారు. రాజ్ పాకాలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ కంపెనీ (ఈటీజీ గ్లోబల్ సర్వీసు)కి సీఈవోగా ఉన్నారు. పలు కంపెనీలకు ప్రపంచవ్యాప్తంగా బిజినెస్, మార్కెటింగ్‌లు చేసిన అనుభవం ఉంది. దీంతో ఆయన ఇక్కడ కొన్ని కంపెనీలకు సలహాదారుడిగా ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే హైదరాబాద్ ఫుట్‌బాల్ ఐఎస్‌ఎల్ టీమ్‌కు సహ యజమానిగా కొనసాగుతున్నారు. సినీ, రాజకీయ ప్రముఖులతో విస్తృత సంబంధాలు ఉన్నాయి. రాజ్ పాకాల నిర్వహించే వీకెండ్ పార్టీల్లో తరచూ విజయ్ పాల్గొంటాడని పోలీసులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే రాజ్ పాకాల గడిచిన 12 ఏళ్లలో మొత్తం 20 కంపెనీల్లో డైరెక్టర్‌గా ఉన్నారు. ఇందులో మూడు మినహా మిగతావన్నీ 2014 తర్వాత ఏర్పాటైనవే కావడం గమనార్హం. ప్రస్తుతం ఆయన 8 కంపెనీల్లో డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఈ కంపెనీల నిర్వాహణ, వ్యాపార కార్యకలాపాల్లో విజయ్ కీలకంగా ఉన్నట్లు తెలుస్తోంది.



నందిహిల్స్‌లోని నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

ఫంక్షన్‌ను రేవ్ పార్టీగా చిత్రీకరించే కుట్ర

కుటుంబ ఫంక్షన్లు చేసుకునే స్వేచ్ఛ కూడా లేదా?

- రేవ్ పార్టీ జరిగినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారు
- రేవంత్ అవినీతి ఎత్తిచూపినందుకే అక్రమ కేసులు
- రేవంత్ రెడ్డి కుట్రపూరిత చర్యకు పాల్పడ్డారు
- డ్రగ్స్ దొరకకుండానే కేసులు ఎలా పెడతారు?
- జైళ్లకు పంపినా.. ప్రజల కోసం పోరాటం ఆపం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బంధువులు, కుటుంబ సభ్యులతో జరుపుకున్న ఫంక్షన్‌ను రాజకీయ కక్షతో రేవ్ పార్టీగా చిత్రీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆదివారం నందినగర్‌లోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, రేవంత్‌రెడ్డి చేస్తున్న అక్రమాలు, అవినీతిని ఎత్తి చూపుతున్నందుకే బీఆర్‌ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టి భయపెడుతున్నారని చెప్పారు. తన బావమరిది రాజ్ పాకాల జన్వాడలో సొంత ఇల్లుకట్టుకొని అక్కడికి నివాసం మార్చిన సందర్భంగా జరిగిన ఫంక్షన్‌పై రేవంత్‌రెడ్డి కుట్రపూరిత చర్యకు పాల్పడ్డారన్నారు. ఒక కుటుంబం తమ బంధువులతో దావత్ చేసుకోవడానికి కూడా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలా? కుటుంబ ఫంక్షన్‌లు చేసుకునేందుకు కూడా ఈ రాష్ట్రంలో స్వేచ్ఛ లేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. జన్వాడలో ఫంక్షన్ జరిగిన ప్రదేశం ఫామ్ హౌస్ కాదని తన బావమరిది రాజ్ పాకాల ఇల్లు అని ఆయన వెల్లడించారు. శనివారం రాత్రి 11గంటల నుంచి అక్కడ రేవ్‌పార్టీ జరిగినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని, అసలు రేవ్ పార్టీ అర్థం తెలుసా? అని ఆయన ప్రశ్నించారు. ఆ ఫంక్షన్‌లో 70 ఏళ్ల తన అత్తమ్మ, రెండేళ్ల, నాలుగేళ్ల, ఏడేళ్ల పిల్లలు, భార్యభర్తలు, కుటుంబ సభ్యులు ఉన్నారని, పురుషులు, మహిళలు అంటూ వేరు చేసి దాన్ని మరో రకంగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్, సీఐ.. స్నిఫర్ డాగ్స్‌తో సహా అక్కడికి వెళ్లామని, తనిఖీల్లో ఎటువంటి డ్రగ్స్ లభించలేదని చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. అక్కడ మూత్ర పరీక్షలు చేశారని, తన బావమరిదితో సహా.. 14 మందికి టెస్ట్ చేస్తే ఒకరికి పాజిటివ్ వచ్చిందన్నారు. ఆ వ్యక్తి ఎక్కడ డ్రగ్స్ తీసుకున్నారో తేల్చాల్సింది సంబంధిత విభాగాలేనన్నారు. డ్రగ్స్ కూడా లభించని ప్రదేశంలో.. 4 విదేశీ మద్యం బాటిళ్లు ఉండాల్సిన చోట 8 బాటిళ్లు ఎక్కువగా ఉన్నాయని కేసు పెట్టామన్నారని కేటీఆర్ చెప్పారు. సాయంత్రానికే మొత్తం మారిపోయిందంటున్నారని, డ్రగ్స్‌కు సంబంధించి 25, 27, 29 సెక్షన్ల కింద కేసులు పెట్టినట్లు తెలుస్తోందన్నారు. అక్కడ డ్రగ్స్ దొరకకుండానే ఈ కేసులు ఎలా పెడతారని కేటీఆర్ ప్రశ్నించారు. ఆ ఫంక్షన్ నుంచి 5 నిమిషాల ముందే తాను అక్కడి నుంచి వెళ్లినట్లు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, తాను అక్కడే ఉన్నానని కొన్ని ప్రసార మాధ్యమాల్లో అసత్య ప్రచారం జరుగుతోందని, తన భార్యపై, కుటుంబ సభ్యులపై ఇష్టం వచ్చినట్లు ప్రసారం చేయడం ఏమాత్రం తగదన్నారు. శనివారం సాయంత్రం 7గంటలకు తాను మాజీ సీఎం కేసీఆర్ దగ్గర ఎర్రవెల్లిలో ఉన్నానని, ఆ తర్వాత హైదరాబాద్‌కు చేరుకొని తన ఇంట్లో కుమార్తెతో కొద్దిసేపు మాట్లాడి.. ఆ తర్వాత ఇంట్లోనే పడుకొని పోయానని.. ఆ ఫంక్షన్‌కు వెళ్లలేకపోయానని కేటీఆర్ వివరణ ఇచ్చారు. పొలిటికల్ బాంబులు పేలుతాయని కాంగ్రెస్ నాయకులు అంటే ఏదో అనుకున్నానని, ఇలా కుట్రపూరితమైన చర్యలకు పాల్పడతారని అనుకోలేదని కేటీఆర్ చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీని, తనను ఎదుర్కొలేక చివరకు తన బంధువులు, కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతున్నారని ఇది వారి చేతగానితనానికి నిదర్శనమన్నారు. తమను జైల్లో పెట్టినా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంతరం పోరాటం చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

కేటీఆర్.. ఇప్పుడు ఏం సమాధానం చెబుతారు?

- పార్టీలో ఎంతటి వారున్నా శిక్షించాలి
- కేటీఆర్ సహా అందరికీ పరీక్ష చేయాలి
- విప్ శ్రీనివాస్, కాంగ్రెస్ నేతల డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మూడేళ్ల క్రితం డ్రగ్స్ వాడకానికి సంబంధించి 'వైట్ చాలెంజ్' విసిరితే వెనుకాడిన కేటీఆర్.. ఆయన బావమరిది రాజ్ పాకాల ఫాంహౌస్‌లో రేవ్ పార్టీపై ఏం సమాధానం చెబుతారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆ పార్టీలో ఎవరెవరు పాల్గొన్నారో సాంకేతికతను ఉపయోగించి పోలీసులు తెలుసుకోవాలని, వాస్తవాలు బయటపెట్టాలన్నారు. యువతను మత్తులో ఉంచి తొమ్మిదిన్నరేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ పార్టీ.. రాష్ట్రాన్ని ధ్వంసం చేసిందన్నారు. రాజ్ పాకాల తన ఫామ్ హౌస్‌లో డ్రగ్స్, విదేశీ మద్యంతో పార్టీ ఇవ్వడం రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాను ప్రోత్సహించేలా ఉందని కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. దీనిపై లోతైన విచారణ జరపాలని, ఇందులో ఎంత పెద్దవారు ఉన్నా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తు కోసం రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తుంటే.. కేటీఆర్ అండ్ కో రాష్ట్రాన్ని 'డ్రగ్స్ స్టేట్‌'గా మారుస్తున్నారన్నారు. పోలీసుల దాడి జరిగినప్పుడు ఫాంహౌస్‌లో బడాబాబులు ఉన్నారన్న వార్తలు వస్తున్నాయని, ఎట్టి పరిస్థితుల్లో ఎవర్నీ వదలొద్దని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఈ పార్టీకి ఎవరెవరు హాజరయ్యారో వారందరి వివరాలను, సీసీటీవీ ఫుటేజ్‌ని బయటపెట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతోందన్న విషయాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ గుర్తుంచుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో చేసిందంతా రేవ్ పార్టీలేనని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. యువతను మత్తుకు బానిసలుగాచేసి వారి జీవితాలను నిర్వీర్యం చేశారన్నారు. కేటీఆర్‌తో సహా అందరికీ డ్రగ్స్ పరీక్షలు చేయాలని ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్ కోరారు. రాజ్ పాకాల ఫాంహౌస్‌లో రేవ్ పార్టీపై సమగ్ర విచారణ జరిపించాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత, మహిళా ప్రతినిధులు సైబరాబాద్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఈ పార్టీలో కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన విజయ్ కొకైన్ వాడినట్లు నిర్ధారణ అయిందని, దీనిపై కేటీఆర్ స్పందించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్ డిమాండ్ చేశారు.

జన్వాడ ఫాంహౌస్‌లో అనుమతి లేకుండా మందు పార్టీ

- ఎక్సైజ్ మంత్రి జూపల్లి



హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జన్వాడ ఫాంహౌస్‌లో ఎక్సైజ్ శాఖ నుంచి ఎటువంటి అనుమతి లేకుండా మద్యం పార్టీ జరిగినట్లు అధికారులు గుర్తించారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలు చేయడం పరిపాటి అని తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో ఎస్వోటీ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఫాంహౌస్‌లో తనిఖీలు నిర్వహించారన్నారు. అక్కడ నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ (విదేశీ మద్యం) స్వాధీనం చేసుకున్నారన్నారు. ఆ విదేశీ మద్యానికి ఎలాంటి 'డ్యూటీ ఫ్రీ' బిల్లులు చూపించలేదన్నారు.

తాగి దొరికిన దొంగలు..

ప్రభుత్వాన్ని బద్నామ్ చేస్తున్నారు: పొన్నం



హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జన్వాడ ఫాంహౌస్‌లో పార్టీ వ్యవహారంపై స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు దాడి చేస్తే.. అందులో తాగి దొరికిన దొంగలు తమ తప్పును సమర్థించుకునేందుకు ప్రభుత్వాన్ని బద్నామ్ చేస్తున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిలో పోలీసులను దాడికి పంపలేదని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఎవరూ పోలీసులను ప్రతి ఫాంహౌస్‌లో ఏం జరుగుతుందో చూడమని చెప్పలేదన్నారు. అర్ధ రాత్రి వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ దాడి జరిగిందన్నారు. 'మీరు నిర్దోషులైతే చట్టం ద్వారా నిరూపించుకోవాల'ని కేటీఆర్‌ను ఉద్దేశించి సూచించారు.

రేవ్‌పార్టీపై సమగ్ర దర్యాప్తు జరపాలి

ఫాంహౌస్ ఎవరిదైనా వదలొద్దు.. రాజకీయాలకతీతంగా విచారణ జరపాలి

- సుద్దపూస.. ఇప్పుడేమంటాడో?
- కేటీఆర్ బావమరిది ఫాంహౌస్‌లోనే రేవ్ పార్టీలా?
- పోలీసులే టిల్లును తప్పించారు: బండి సంజయ్
- రేవంత్, కేటీఆర్ కుమ్మక్కయ్యారు: రఘునందన్



హైదరాబాద్/గజ్వేల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జన్వాడ ఫాంహౌస్‌లో రేవ్ పార్టీపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫాంహౌస్ ఎవరిదైనా దర్యాప్తు జరపాల్సిందేనన్నారు. రాజకీయాలకు అతీతంగా దర్యాప్తు జరగాలని, చట్టాన్ని తనపని తాను చేసుకోనివ్వాలని ప్రభుత్వానికి సూచించారు. దొంగ వీడియోలు తీసి దేశవ్యాప్తంగా జడ్జిలకు పంపిన చరిత్ర ఉన్న బీఆర్‌ఎస్ కూడా ఇప్పుడు తమపై డ్రగ్స్ కేసులు అక్రమంగా పెడుతున్నారంటూ పెడబొబ్బలు పెడుతోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఫాంహౌస్ ఫైల్స్ పేరిట ఐదు గంటల పాటు సినిమా చూపించారని గుర్తుచేశారు. నాడు కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకోగా, ఇప్పుడు కాంగ్రెస్ నేతలు సామూహికంగా దోచుకుంటున్నారని, రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం కిషన్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. గడిచిన పది నెలల్లో జరిగిన ఒప్పందాలు, చేసిన అప్పులు, ఆస్తుల వివరాలతో మొత్తం ఆర్థిక పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క హామీని కూడా అమలు చేయలేని దుస్థితిలో ఉన్న ప్రభుత్వం, లక్షా యాభై వేల కోట్లతో మూసీ ప్రక్షాళన చేస్తామంటూ ఎగిరెగిరి పడుతోందని దుయ్యబట్టారు. తెలంగాణకు కేంద్రం అన్యాయం చేసిందంటూ కేసీఆర్ పదేళ్లు మాట్లాడగా.. ఇప్పుడు సీఎం రేవంత్ కూడా అదే పల్లవి ఎత్తుకున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు.

సుద్దపూస.. ఇప్పుడేమంటాడో..?: సంజయ్

జన్వాడ ఫాంహౌస్‌లో రేవ్ పార్టీపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ట్విటర్ టిల్లు సహా ఆయన కుటుంబ సభ్యుల పాస్‌పోర్టులను సీజ్ చేయాలని, ఈ కేసు నుంచి ట్విటర్ టిల్లును, ఆయన కుటుంబ సభ్యులను తప్పించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సీసీ ఫుటేజీలను వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. ట్విటర్ టిల్లు బామ్మర్ది ఫాంహౌస్ 'రేవ్ పార్టీ' కేసును నీరుగార్చే కుట్ర మొదలైందని సంజయ్ ఓ ప్రకటనలో ఆరోపించారు. దేశవ్యాప్తంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న వాళ్లు కూడా ఈ పార్టీలో ఉన్నట్లు తెలిసిందని.. కొందరు పోలీసులు కావాలనే టిల్లును తప్పించారని ఆరోపించారు. హోంశాఖ సీఎం వద్దే ఉన్నా ఎందుకు సమగ్ర విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒక్కటేనని తాము చెబుతున్నది నిజమేనని మరోసారి రుజువైందన్నారు. "తెలంగాణలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుస్తామన్న ప్రభుత్వ ప్రకటనలన్నీ డొల్లేనా? డ్రగ్స్ రహిత రాష్ట్రమంటే కేటీఆర్ కుటుంబ సభ్యులను తప్పించడమేనా?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించారు. "అక్రమ నిర్మాణాలంటూ పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లను కూలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎలాంటి అనుమతుల్లేకుండా నిర్మించిన ట్విటర్ టిల్లు ఫాంహౌస్‌ను ఇంతకాలం ఎందుకు కూల్చలేదు? జన్వాడ ఫాంహౌస్‌లో దాచుకున్న ముఖ్యమైన ఫైళ్లన్నీ ఓ స్టార్ హోటల్‌కు తరలించారు. ఈ విషయం తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? టిల్లు బామ్మర్ది ఫాంహౌస్‌లో జరిగిన రేవ్ పార్టీలో ఆయన కుటుంబ సభ్యులున్నా ఉద్దేశపూర్వకంగా తప్పించారు. డ్రగ్స్ దొంగలు పారిపోయేలా చేశారు. దానికి సహకరించిన వ్యక్తులెవరు? ఇది పక్కా డ్రగ్స్ పార్టీయే. ట్విటర్ టిల్లు.. ఏమీ ఎరగనట్లు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో విచారణ జరిపితే ఆయన చావు తెలివి తేటలు బయటపడతాయి" అని సంజయ్ స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యులతో సహా రేవ్ పార్టీలో పాల్గొన్న వారందరికీ డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాలన్నారు. "మీ సొంత బామ్మర్ది ఇంటి ఫంక్షన్ జరిగితే.. నువ్వు వెళ్లలేదంటే నమ్మేదెలా? ఆ ఫంక్షన్‌కు నీతోపాటు మరో ఇద్దరు ఎమ్మెల్యేలు వెళ్లారా? లేదా? నువ్వే సొంతంగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లింది నిజమా? కాదా?" చెప్పాలంటూ సంజయ్.. కేటీఆర్‌ను ప్రశ్నించారు. కేటీఆర్ తన ఫ్యామిలీని అడ్డుపెట్టుకుని అక్కడి నుంచి తప్పించుకున్నది నిజమా కాదా? చెప్పాలని డిమాండ్ చేశారు. మీ బామ్మర్ది ఫంక్షన్‌కు తెలంగాణవాదానికి ముడిపెడతావేంటి? దీని వెనక మతలబేంటి? మామూలు ఫంక్షన్ అయితే డీజీపీతో మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడాల్సిన అవసరం ఏమొచ్చింది? అని నిలదీశారు.

ఫాంహౌస్ సీసీ ఫుటేజీ బయటపెట్టాలి

జన్వాడ ఫాంహౌస్ సీసీ ఫుటేజీ బయటపెట్టాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. జన్వాడ ఫాంహౌస్‌లో రేవ్ పార్టీనో లేక 'రావు'ల పార్టీనో జరిగినట్లు తెలిసిందని, ఈ ఫాంహౌస్ సీసీ ఫుటేజీని పోలీసులు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ చుట్టూ వారాంతాలు వచ్చాయంటే రేవ్ పార్టీలని, రావు పార్టీలని.. విదేశీ మద్యంతో పాటు కొకైన్, డ్రగ్స్ తీసుకొచ్చి డ్రగ్స్ మాఫియాను పెంపొందిస్తున్నారని ఆరోపించారు. జన్వాడ ఫాంహౌస్‌లో వీఐపీల పిల్లలు ఉన్నారని వార్తలు వస్తున్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి వారితో కుమ్మక్కు కాకపోతే వెంటనే సీసీటీవీ ఫుటేజీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర

ఫాంహౌస్ ఘటన పక్కా స్కెచ్‌తో చేసిందే

- కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకిది పరాకాష్ఠ: హరీశ్
- కేటీఆర్ బావమరిది ఇంట్లో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు
- అడ్డుకున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలు



రాయదుర్గంలోని ఓరియన్ విల్లాస్ వద్ద పోలీసులతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల వాగ్వాదం

హైదరాబాద్/రాయదుర్గం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే జన్వాడ ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీలంటూ రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నానని ఓ ప్రకటనలో తెలిపారు. కేటీఆర్‌పై బురదజల్లడంలో భాగంగానే ఆయన బావమరిదిపై డ్రగ్స్ కేసంటూ కుట్ర చేస్తున్నారని, కాంగ్రెస్ సర్కారు కక్షసాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజ్ పాకాల ఇంట్లో కుటుంబ వేడుక ఉందని ముందుగానే ప్రభుత్వ పెద్దలకు తెలుసన్నారు. రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం శని, ఆదివారాల్లో బాంబులు పేలతాయనడం, చెప్పినట్లుగానే ఇళ్లపై దాడులు చేయడం చూస్తే.. ఇది పక్కా స్కెచ్ అని స్పష్టమవుతోందని చెప్పారు. కేటీఆర్ వ్యక్తిత్వాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు చేస్తున్న ప్రయత్నమిదని ఆరోపించారు. వృద్ధులు, చిన్న పిల్లలు, దంపతులు ఉన్న ఫ్యామిలీ ఫంక్షన్‌ను డ్రగ్స్ పార్టీగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేటీఆర్, ఆయన భార్య ఆ ఫంక్షన్‌కు వెళ్లకపోయినా వెళ్లినట్లు చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. కుటుంబ సభ్యులను అడ్డుపెట్టుకొని చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగవద్దని, నిజాయితీగా ఉండాలని, వ్యవస్థపై అపనమ్మకం కలిగేలా ప్రవర్తించవద్దని హరీశ్ కోరారు. కాగా, రాయదుర్గంలోని ఓరియన్ విల్లాస్‌లో కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల, అతని సోదరుడు శైలేంద్ర నివాసాల్లో ఎక్సైజ్ పోలీసులు ఆదివారం సోదాలు నిర్వహించేందుకు వచ్చారు. ఈ సమాచారం ముందే తెలియడంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, వివేకానంద, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు; బాల్క సుమన్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఓరియన్ విల్లాస్ వద్దకు చేరుకున్నారు. ఎక్సైజ్ పోలీసులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఆ విల్లా కేటీఆర్ బావమరిదిది కాదని, కేటీఆర్ ఉంటున్న ఇల్లని, దాన్ని సెర్చ్ వారెంట్ లేకుండా ఎలా సోదాలు చేస్తారంటూ నిలదీశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాయదుర్గం రహదారిలో ట్రాఫిక్ జామ్ అయింది. బీఆర్‌ఎస్ నేతలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కాగా, ఎవరు ఫిర్యాదు ఇచ్చారని జన్వాడ ఫాంహౌస్‌లో తనిఖీలు చేశారని బాల్క సుమన్, వివేకానందలు ప్రశ్నించారు. అది కుటుంబ సభ్యులు చేసుకుంటున్న పార్టీ అన్నారు. అధికారులు సీఎం చేతిలో కీలు బొమ్మలుగా మారుతున్నారని ఆరోపించారు. ఇక జన్వాడ ఫాంహౌస్‌కు ఓరియన్ విల్లాస్‌కు సంబంధం ఏమిటని, పార్టీ జరిగిన ప్రదేశం వదిలేసి గేటెడ్ కమ్యూనిటీలో ఎలా తనిఖీలు నిర్వహిస్తారని మాజీ మంత్రులు తలసాని, వేముల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు.

జనగామలో భారీ అగ్ని ప్రమాదం

- షాపింగ్ కాంప్లెక్స్‌లో చెలరేగిన కీలలు
- పది దుకాణాలకు వ్యాపించిన మంటలు
- 20 కోట్ల నష్టం వాటిల్లినట్టు అంచనా



ఎగిసిపడుతున్న మంటలు

జనగామ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జనగామలో ఆదివారం తెల్లవారుజామున ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పదికి పైగా దుకాణాలు దగ్ధమై పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానిక సిద్దిపేట రోడ్డులో ఉన్న విజయ షాపింగ్ మాల్‌లో శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటలకు మంటలు చెలరేగాయి. మొదట్లో కొద్దిపాటి పొగలు రావడాన్ని గమించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే మంటలు ఎగిసిపడ్డాయి. ప్రమాదంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి విజయ షాపింగ్ మాల్ షట్టర్లు తెరుచుకోలేదు. దాంతో ప్రమాద తీవ్రత పెరిగింది. మంటలు ఆ కాంప్లెక్స్‌లోని ఆర్‌ఎస్ బ్రదర్స్, శ్రీలక్ష్మీ షాపింగ్ మాల్‌కు వ్యాప్తిచెందాయి. షట్టర్లను జేసీబీ సాయంతో తొలగించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయినా మంటలు అదుపులోకి రాలేదు. మధ్యాహ్నం 1.30తర్వాత కొద్దిగా అదుపులోకి వచ్చాయి. జనగామ జిల్లాలో వేర్వేరుచోట్ల నుంచి రప్పించిన 6 ఫైరింజన్లతో సుమారు 40 మంది అగ్నిమాపక సిబ్బంది ఏడు గంటలకు పైగా శ్రమించారు. షాపింగ్ కాంప్లెక్స్‌కు ఆనుకొని ఉన్న మరో భవనంపైకి ఎక్కి 'ఫైర్ కెమ్' (ఫోమ్) రసాయనాన్ని నీటితో కలిపి చల్లారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. విజయ షాపింగ్ మాల్‌లో షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు.

శత్రువులతో చేతులు కలిపి అన్నపై కుట్రలా?

జగన్ బెయిల్ రద్దు కోసమే ఇదంతా: విజయసాయిరెడ్డి



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శత్రువులతో చేతులు కలిపి అన్న జగన్‌పై కుట్రలు పన్నడం ఎవరి కోసమని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. తండ్రి మరణానికి కారణమైన చంద్రబాబు, కాంగ్రెస్‌తో చేతులు కలపడం అత్యంత బాధాకరమన్నారు. జగన్ బెయిల్‌ను రద్దు చేయించేందుకు ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. అన్నను వేటాడి, వెంటపడి విషపు కాటు వేసే చెల్లెమ్మను ఎక్కడా చూడలేదన్నారు. ఆదివారమిక్కడ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. షర్మిలది ఆస్తి తగాదా కాదని, అధికారం కోసం తగాదా అని అన్నారు. మీడియా సమావేశాలు 95 శాతం జగన్‌ను తిట్టేందుకే పెడుతున్నారని చెప్పారు. శత్రువులకు మేలు చేసేందుకు సొంత అన్నకు అన్యాయం చేసే వాళ్లను తానెక్కడా చూడలేదన్నారు. వైఎస్ చనిపోవడానికి కారకులెవరో గుండెపై చేయి వేసుకుని చెప్పాలని షర్మిలను డిమాండ్ చేశారు. తల్లిని, చెల్లిని కోర్టుకు ఈడ్చారని అంటున్నారని.. దీనికి వంద శాతం కారణం షర్మిల కాదా అని ప్రశ్నించారు. 'మీరు ఎవరి కోసం కన్నీళ్లు పెట్టుకున్నారు..? ఆ కన్నీళ్లకు విలువ లేదు.. వైఎస్ ఆత్మ క్షోభిస్తుంది..' అని వ్యాఖ్యానించారు.

ముగిసిన గ్రూప్-1 పరీక్షలు

- అఖరి రోజు 67.3 శాతం మంది హాజరు
- అన్ని పరీక్షలకు హాజరైంది 67.17 శాతం మంది
- 1:50 నుంచి 1:37కు తగ్గిన పోటీ

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యంత ఉత్కంఠ పరిస్థితుల మధ్య మొదలైన తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 29 వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందంటూ... దాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో తీవ్రరూపం దాల్చిన ఆందోళనలు, మరోవైపు పరీక్షలు నిర్వహించే తీరుతామన్న ప్రభుత్వ ధోరణి, ఇంకోవైపు పరీక్ష రద్దుపై అభ్యర్థులు వేసిన పిటిషన్‌పై సుప్రీంలో విచారణ... వీటన్నిటి మధ్య మరికొన్ని గంటల్లో పరీక్ష ప్రారంభమవుతుందనే వరకు ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఆఖరి ఘడియలో పరీక్ష నిలిపివేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో ఈ నెల 21వ తేదీన పరీక్షలు ప్రారంభమయ్యాయి. అదేరోజు పరీక్ష కావడం, అప్పటికే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నందున వాయిదా వేయడం సాధ్యం కాదని సుప్రీం వెల్లడించడంతో మిగిలిన అభ్యర్థులు పరుగుపరుగున పరీక్ష కేంద్రాలకు తరలివెళ్లారు. 21వ తేదీన మొదలైన పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. వరుసగా ఏడు రోజుల పాటు మూడు జిల్లాల్లోని 46 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఆఖరి రోజున 21,151(67.3 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. అంతకుముందు నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. మెయిన్స్‌కు ఎంపికైన మొత్తం 31,403 అభ్యర్థులకు గాను 21,093 మంది ఏడు పరీక్షలకు హాజరైనట్లు టీజీపీఎస్సీ వెల్లడించింది. దీంతో పూర్తి పరీక్షలకు హాజరైన అభ్యర్థుల శాతం 67.17గా నమోదైంది. ఇందులో హైదరాబాదు జిల్లా కేంద్రాల్లో కేటాయించిన 5,613 మందికి గాను 4,719 మంది అభ్యర్థులు అన్ని పరీక్షలకు హాజరయ్యారు. అలాగే రంగారెడ్డిలో 8,011కు గాను 5,505 మంది, మేడ్చల్- మల్కాజ్‌గిరిలో 17,779కు గాను 10,869 మంది అభ్యర్థులు హాజరైనట్లు కమిషన్ ప్రకటించింది. రాష్ట్రంలో 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జూన్‌లో ప్రిలిమనరీ పరీక్షను నిర్వహించింది. మొత్తం 4.03 లక్షల దరఖాస్తులు రాగా 3.02 లక్షల మంది ప్రిలిమ్స్‌కు హాజరయ్యారు. అందులో కనబరిచిన ప్రతిభ ఆధారంగా 1:50 నిష్పత్తిలో 31,403 అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేశారు. మెయిన్స్ పరీక్షలు మొదలయ్యాక తొలిరోజు హాజరైన అభ్యర్థులు 74శాతం కాగా క్రమంగా అది 67.3 శాతానికి తగ్గింది. దాంతో ఒక్కో పోస్టుకు 37 మంది అభ్యర్థులు పోటీలో నిలిచినట్లు అయింది.

ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీగా ఆమ్రపాలి

ఆరోగ్య శాఖకు వాకాటి కరుణ, కార్మిక శాఖకు వాణీప్రసాద్

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి ఏపీకి వచ్చిన కొందరు ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం పోస్టింగులు ఇచ్చింది. ఇందులో వాకాటి కరుణను ఆరోగ్యశాఖ కమిషనర్‌గా, నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) డైరెక్టర్‌గా నియమించారు. ఆమ్రపాలి కాటా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) వీసీ-ఎండీగా, ఎ.వాణీప్రసాద్ కార్మిక శాఖ, బీమా వైద్య సేవల విభాగం ముఖ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆర్కియాలజీ కమిషనర్‌గా ఉన్న వాణీమోహన్‌ను జీఏడీ (జీపీఎం, ఏఆర్) ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేశారు.

వికలాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు వికలాంగుల పింఛన్‌ను రూ.6వేలకు పెంచాలని, పెంచిన పింఛన్‌ను 2024 జనవరి నుంచే అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం డిసెంబర్‌లో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. కమిటీ రాష్ట్ర 4వ మహాసభలు అక్టోబరు 25-26 తేదీల్లో నిర్వహించామని, వికలాంగులు ఎదుర్కొంటున్న 18 రకాల సమస్యలపై తీర్మానాలు చేసినట్టు పేర్కొన్నారు. కాగా, ఇటీవల జరిగిన మహాసభల్లో 75 మందితో రాష్ట్ర కమిటీని, 23 మందితో రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఎన్నికైనట్టు తెలిపారు. కవిఎటీ గౌరవ అధ్యక్షురాలుగా వరమ్మ, అధ్యక్షులుగా కె.వెంకట్, కోశాధికారిగా ఆర్.వెంకటేశ్ ఎన్నికైనట్లు అడివయ్య తెలిపారు.

బోనకల్‌లో యాచకుడికి ఐపీ నోటీసు

- 50 వేలు అప్పు ఇవ్వగా.. దివాలా పిటిషన్ వేసిన వ్యాపారి
- లబోదిబోమంటున్న యాచకుడి కుటుంబం

బోనకల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా బోనకల్‌లో గుడి ముందు భిక్షాటన చేసుకునే ఓ యాచకుడికి ఐపీ (దివాలా దరఖాస్తు) నోటీసు రావడం చర్చనీయాంశమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లాల అశోక్ దంపతులు బోనకల్‌లోని సాయిబాబా ఆలయం వద్ద బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇంటర్ చదువుతున్న కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ఓణీల కార్యక్రమం సందర్భంగా ఆలయ నిర్వాహకులు కొంత డబ్బు ఇచ్చారు. దాన్ని భిక్షాటన చేసి దాచుకున్న డబ్బుతో కలిపితే మొత్తం రూ.50 వేలు అయింది. అశోక్ టిఫిన్ కోసం స్థానికంగా ఉన్న ఓ హోటల్‌కు వెళుతుంటాడు. ఈ క్రమంలో తనకు అత్యవసరంగా రూ.50 వేలు కావాలని హోటల్ యజమాని నర్సింహారావు కోరగా.. అశోక్ ఇచ్చాడు. ఈ మేరకు ఆయన ప్రామిసరీ నోటు కూడా రాసిచ్చాడు. అయితే సదరు వ్యాపారి నర్సిహారావు వ్యాపారంలో నష్టాలపాలయ్యానంటూ రూ.2.75కోట్లకు ఐపీ దాఖలు చేశాడు. అందులో భాగంగా అశోక్‌కు కూడా ఐపీ నోటీసు వచ్చింది. ఇక తనకు డబ్బులు వచ్చే పరిస్థితి లేదని, తన కుమార్తె భవిష్యత్ ఏంటని అతను ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజిరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అనుబంధ కార్మిక విభాగం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మొగుళ్ల రాజిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయనకు యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి నియామక పత్రం అందజేశారు. జనగామకు చెందిన రాజిరెడ్డి.. ప్రస్తుతం జలమండలి కామ్‌గర్ యూనియన్ అధ్యక్షుడిగా ఉన్నారు.

'మహా' ఎన్నికలకు నియోజకవర్గ సమన్వయకర్తల నియామకం

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్కడి పలు నియోజకవర్గాలకు సమన్వయకర్తలుగా టీకాంగ్రెస్ నేతలను ఏఐసీసీ నియమించింది. వీరిలో పార్టీ ఎమ్మెల్యేలు మెగారెడ్డి, వంశీకృష్ణ, పార్టీ నేతలు అన్వేష్‌రెడ్డి, సంగిశెట్టి జగదీశ్, రాచమళ్ల సిద్ధేశ్వర్, కత్తి వెంకటస్వామి ఉన్నారు.

జగన్ విషనాగు

స్వప్రయోజనం కోసం తల్లిని కోర్టుకు ఈడ్చారు

- అన్నపై మరోసారి షర్మిల నిప్పులు



అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తన అన్న జగన్మోహన్‌రెడ్డిపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మళ్లీ విరుచుకుపడ్డారు. స్వప్రయోజనం కోసం తల్లిని కోర్టుకు ఈడ్చిన విషనాగుగా ఆయన్ను అభివర్ణించారు. తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానికి కారణమైన కాంగ్రెస్, చంద్రబాబుతో షర్మిల చేతులు కలిపారని.. జగన్ మళ్లీ సీఎం కాకూడదని ఆమె కంకణం కట్టుకున్నారని ఎంపీ విజయసాయిరెడ్డి ఆదివారం చేసిన వ్యాఖ్యలపై ఆమె 'ఎక్స్'లో మండిపడ్డారు. రాజశేఖర్‌రెడ్డి మరణానికి చంద్రబాబే కారణమైతే.. ఐదేళ్లు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గాడిదలు కాశారా అని ఆయన్ను నిలదీశారు. 'జగన్ ప్రత్యేక విచారణ ఎందుకు జరిపించలేదు? దర్యాప్తు చేసి నిజానిజాలు ఎందుకు బయటపెట్టలేదు? దోషులను ఎందుకు శిక్షించలేదు? అనుమానం ఉండి.. ఐదేళ్లు అధికారంలో ఉండి.. ఎందుకు ఒక్క ఎంక్వైరీ కూడా వేయలేదు? ఇది మీ చేతకానితనానికి నిదర్శనం కాదా' అని ధ్వజమెత్తారు. రాజశేఖర్‌రెడ్డి మరణానికి కాంగ్రెస్ ముమ్మాటికీ కారణం కాదన్నారు. కాంగ్రెస్‌ను ఆయన రెండు సార్లు అధికారంలోకి తీసుకొచ్చారని.. బంగారు బాతును ఎవరూ చంపుకోరని.. సొంత కళ్లను ఎవరూ పొడుచుకోరని స్పష్టం చేశారు. వైఎస్ మరణం తర్వాత చార్జిషీటులో ఆయన పేరు చేర్పించింది జగన్ కాదా అని ప్రశ్నించారు. 'కేసుల నుంచి బయటపడేందుకు పొన్నవోలు సుధాకర్ రెడ్డి (సీనియర్ న్యాయవాది)తో కలసి ఈ కుట్ర చేయలేదా? కుట్ర చేయకపోతే జగన్ సీఎం అయిన వెంటనే అదనపు అడ్వకేట్ జనరల్ పదవి ఆయనకు ఎందుకిచ్చారు' అని దుయ్యబట్టారు. జగన్‌కు ఇంకా చంద్రబాబు పిచ్చి వీడినట్లు లేదని అన్నారు. 'ఇప్పటికీ అద్దంలో చూసుకున్నా.. బాబే కనిపిస్తున్నట్లుంది' అని ఎద్దేవాచేశారు.

నాన్న పిలిచినట్లే పెళ్లికి నేనూ పిలిచా..

చంద్రబాబుతో తనకు వ్యక్తిగత సంబంధాలూ లేవని షర్మిల స్పష్టం చేశారు. రాజశేఖర్‌రెడ్డి తన బిడ్డ (షర్మిల) పెళ్లికి ఆయన్ను పిలిచారని, అదే విధంగా తానూ తన కుమారుడి వివాహానికి పిలిచానని తెలిపారు. విజయసాయిరెడ్డి చదివింది జగన్ స్క్రిప్టు కాదని ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు. 'ఆస్తుల్లో నలుగురు చిన్న బిడ్డలకు (మనుమడు, మనుమరాళ్లకు) సమాన వాటా ఉంటుందన్న రాజశేఖర్‌రెడ్డి ఆదేశం అబద్ధమని మీ బిడ్డలపై ప్రమాణం చేస్తారా? మీరు కూడా జగన్ మోచేతి నీళ్లు తాగిన వాళ్లే! రాజకీయంగా, ఆర్థికంగా ఆయన వల్ల బలపడినవాళ్లే. ఇలా కాకపోతే ఎలా మాట్లాడుతారులే' అని ఆక్షేపించారు.

జంతర్‌మంతర్ జగన్మాయ!



(మొదటి పేజీ తరువాయి)

పాల్పడటం జగన్ ఘనత. రాజకీయ నాయకులే ముక్కున వేలేసుకునేలా సొంత మీడియా, ఊరికో ప్యాలస్, వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యం నిర్మించుకున్నారు. ఇంతలా అవినీతికి పాల్పడవచ్చని అప్పటి వరకూ మన దేశంలో రాజకీయ వారసులకు బహుశా తెలిసి ఉండకపోవచ్చు. ఆస్తుల కోసం అన్నాచెల్లెళ్లు జగన్, షర్మిల గొడవపడి రోడ్డుకెక్కడం... జగన్ ఏకంగా తల్లి విజయలక్ష్మిపైనే నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో పిటిషన్ వేయడంతో జగన్ అక్రమాస్తుల విషయం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. నాడు తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఏ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారన్నది జనం మరోసారి గుర్తు చేసుకుంటున్నారు. 30 ఏళ్ల రాజకీయాల్లో ఉన్న రాజశేఖర రెడ్డి కుటుంబ ఆస్తులు ఆనాడు రూ.2 కోట్లు దాటలేదు. 2004 నాటికి జగన్ సంపద అంతంతే. కానీ, రాజశేఖర రెడ్డి సీఎం అయ్యాక అనూహ్యంగా జగన్ సంపద పెరిగింది.

ఏ వ్యాపారం చేసి ఇంత సంపాదించారో ఎవరికీ అంతుపట్టదు. తండ్రి ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఐదేళ్లలోనే ఊహించని స్థాయిలో అక్రమార్జనకు పాల్పడ్డారు. నాడు జగన్ క్విడ్ ప్రోకో, అక్రమాలకు పాల్పడిన తీరును సీబీఐ కోర్టుకు సమర్పించిన చార్జిషీట్లలో క్షుణ్ణంగా ప్రస్తావించింది.

20 ఏళ్లలో ఎన్ని రెట్లో...

గత 20 ఏళ్లలో జగన్ ఆస్తులు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. 2004లో సమర్పించిన ఐటీ రిటర్నులో ఆయన నికర ఆస్తుల విలువ రూ.1.74 కోట్లుగా చూపించారు. 2004లో రాజశేఖర రెడ్డి సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ ప్రకారం జగన్ ఆస్తి రూ.9.18 లక్షలు మాత్రమే. అయితే 2009 ఎన్నికల అఫిడవిట్‌లో జగన్ తన ఆస్తిని రూ.77.39 కోట్లుగా చూపించారు. దీన్నిబట్టి తండ్రి అధికారంలో ఉన్నప్పుడు జగన్ భారీగా ఆస్తులు కూడబెట్టినట్టు తెలుస్తోంది. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని బడా వ్యక్తులకు రాష్ట్ర వనరులను దోచిపెట్టి, వారి నుంచి ప్రతిఫలంగా తన కంపెనీల్లోకి పెట్టుబడులు పెట్టించారు. అక్రమ ప్రతిఫలాలతో చేసిన వ్యాపారాలతో ఆస్తుల విలువ 2011 నాటికి రూ.445 కోట్లకు చేరింది. 2014 ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తుల విలువ (416 కోట్లు) స్వల్పంగా తగ్గినట్టుగా చూపించారు. అయితే 2019 అఫిడవిట్‌లో ఆస్తులు రూ.510 కోట్లకు పెరిగినట్టు చూపించారు. ఆ ఏడాది సీఎంగా అధికారం చేపట్టిన తర్వాత ఆస్తుల విలువ రూ.757 కోట్లకు పెరిగింది. జగన్ కుటుంబం మరిన్ని కొత్త కంపెనీల్లో పెట్టుబడులు పెట్టింది. 2008-09లో జగన్ రూ.2.92 కోట్ల ఆదాయ పన్ను చెల్లించారు. 2010-11 ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లో కనీసం రూ.22 కోట్ల పన్ను చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేసి రూ.6.6 కోట్ల అడ్వాన్స్ చెల్లించారు.

అఫిడవిట్లలోని ఆస్తుల వివరాలు

2009 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం జగన్ ఆస్తులు రూ.77.4 కోట్లు. 2011 ఉప ఎన్నికల్లో తన పేరు మీద రూ.365 కోట్లు, భార్య భారతి పేరు మీద రూ.47.25 కోట్లు ఉన్నట్టు పేర్కొన్నారు. 2014లో జగన్ మొత్తం చరాస్తులు రూ.313 కోట్లు, భారతి ఆస్తుల విలువ రూ.57 కోట్లు. జగన్ స్థిరాస్తులు రూ.30 కోట్లు కాగా భారతి ఆస్తుల విలువ రూ.14 కోట్లు. 2011 అఫిడవిట్‌లో జగన్ పేరిట కేజీకి పైన బంగారం, భారతి పేరిట 9 కేజీలకు పైగా బంగారం, వజ్రాభరణాలు ఉన్నట్లు పేర్కొన్నారు. 2014లో జగన్ ఆస్తులు రూ.344 కోట్లుగా, భార్య ఆస్తులు రూ.72 కోట్లుగా చూపారు. భారతి పేరిట రూ.5.86 కిలోల బంగారం (అప్పుడు మార్కెట్ విలువ రూ.3.57 కోట్లు), ఇద్దరు కుమార్తెలు హర్షిణికి 4.19 కిలోల బంగారం, వర్షాకు 3.46 కిలోల బంగారం ఉన్నట్టు వెల్లడించారు. ఇక 2019లో జగన్ పేరిట రూ.375 కోట్లు, భారతి పేరిట రూ.124 కోట్ల ఆస్తులు ఉన్నట్టు పేర్కొన్నారు. ఇద్దరు కుమార్తెల ఆస్తుల విలువ రూ.6.5 కోట్లు, రూ.4.6 కోట్లుగా ఉన్నట్టు వెల్లడించారు.

బంగారం, వజ్రాభరణాలు

2019లో భారతి పేరిట రూ.3.57 కోట్ల విలువైన 5,862.818 గ్రాముల బంగారం, వజ్రాభరణాలు ఉండేవి. 2019 నుంచి 2024 మధ్యకాలంలో అర కిలో పైనే బంగారు, వజ్రాభరణాలు పెరిగాయి. భారతి పేరిట రూ.5.29 కోట్ల విలువ చేసే 6,427.79 గ్రాముల బంగారం, వజ్రాభరణాలు, హర్షిణి పేరిట రూ.4.43 కోట్ల విలువైన 4,187.19 గ్రాములు, వర్షా పేరిట రూ.4.46 కోట్ల విలువైన 3,457.33 గ్రాముల బంగారం, వజ్రాభరణాలున్నాయి. జగన్‌కు బంగారు ఆభరణాలేమీ లేవు.

కుమార్తెల పేరిట పెట్టుబడులు

జగన్ కుమార్తెలు హర్షిణిరెడ్డికి రూ.10.16 కోట్లు, వర్షారెడ్డికి రూ.9.95 కోట్ల పెట్టుబడులున్నాయి. మకరియోస్ ఎల్ఎల్‌పీ, భగవత్ సన్నిధి ఎస్టేట్స్ ఎల్ఎల్‌పీల్లో హర్షిణి, వర్షాలకు చెరో రూ.7.48 కోట్ల విలువైన పరిమిత భాగస్వామ్య పెట్టుబడులున్నాయి. హర్షిణికి కీలాన్ టెక్నాలజీస్‌లో రూ.2.38 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు ఉన్నాయి. ఎస్‌బీఐ, సనోఫి ఇండియా, ఏషియన్ పెయింట్స్, గ్లాక్సో స్మిత్‌క్లైన్ ఫార్మాలో రూ.26.17 లక్షల విలువైన ఈక్విటీ షేర్లున్నాయి. వర్షాకు కీలాన్ టెక్నాలజీస్‌లో రూ.2.38కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు, జెన్సర్ టెక్, సనోఫీ ఇండియా, ఏషియన్ పెయింట్స్, గ్లాక్సోస్మిత్‌క్లైన్ ఫార్మా, రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ఫైనాన్షియల్స్‌లో రూ.19.61 లక్షల విలువైన ఈక్విటీ షేర్లు ఉన్నాయి. హర్షిణికి రూ.1.31 కోట్లు, వర్షాకు రూ.1.54 కోట్ల విలువైన విదేశీ ఆస్తులున్నాయి.

2024 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం జగన్ పేరిటే రూ.529.87 కోట్ల విలువైన స్థిర,చరాస్తులున్నాయి. జగన్ కుటుంబం మొత్తం ఆస్తుల విలువ రూ.757.65 కోట్లు. వీటిలో అత్యధికం వివిధ కంపెనీల్లో వాటాలు, పెట్టుబడుల రూపంలో ఉన్నాయి. 2019లో జగన్ ఆస్తులు రూ.375.20 కోట్లు కాగా, గత ఐదేళ్లలో ఆయన ఆస్తుల విలువ రూ.154.67 కోట్లు అంటే.. 41.22 శాతం పెరిగింది. 2019లో జగన్ కుటుంబం మొత్తం ఆస్తుల విలువ రూ.510.38 కోట్లు ఉండగా, ఐదేళ్లలో రూ.247.27 కోట్లు అంటే 48.45 శాతం పెరిగింది. 2024 అఫిడవిట్‌లో జగన్, ఆయన కుటుంబీకులకు వివిధ కంపెనీల్లో పెట్టుబడులు ఉన్నట్టు పేర్కొన్నారు. జగన్‌కు 7 కంపెనీల్లో, భారతికి 22 కంపెనీల్లో, వాళ్ల కుమార్తెలు హర్షిణి రెడ్డికి 7 కంపెనీల్లో,


జగన్ సీఎం అయ్యాక...

వర్షారెడ్డికి 9 కంపెనీల్లో పెట్టుబడులున్నట్టు చూపారు. వీరందరికీ కలిపి కంపెనీల్లో రూ.344.37 కోట్ల విలువైన పెట్టుబడులున్నాయి. జగన్ పేరిట 7 కంపెనీల్లో 263.64 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు ఉన్నాయి. రిలయన్స్, జియోఫైనాన్స్‌లో భారతికి పెట్టుబడులున్నట్టు చూపారు. ఆమె పేరిట రూ.69.42 కోట్ల పెట్టుబడులు, 11 కంపెనీల్లో రూ.53.84 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు ఉన్నాయి. సండూర్ పవర్, సరస్వతీ పవర్, కీలాన్ టెక్నాలజీస్, క్లాసిక్ రియాలిటీ, సిలికాన్ ఇన్‌ఫ్రా, సిలికాన్ బిల్డర్స్, హరీష్ ఇన్‌ఫ్రా, ఆకాశ్ ఎస్టేట్స్, భారతీ సిమెంట్స్, రేవన్ ఇన్‌ఫ్రా, యుటోపియా ఇన్‌ఫ్రా కంపెనీల్లో షేర్లు ఉన్నాయి. మకరియోస్ ఎల్ఎల్‌పీ, భగవతి సన్నిధి ఎస్టేట్స్ ఎల్ఎల్‌పీల్లో రూ.13.94 కోట్ల విలువైన పెట్టుబడులతో పరిమిత భాగస్వామ్యం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ఫైనాన్షియల్స్, ఎస్ఎండీసీ, ఏషియన్ పెయింట్స్, కోల్గేట్ పామోలివ్, ఓఎన్‌జీసీ, సెయిల్, అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్‌లో రూ.1.52 కోట్ల పెట్టుబడులున్నాయి. రూ.75.01 లక్షల విలువైన సావరిన్ గోల్డ్ బాండ్లు ఉన్నట్టు అఫిడవిట్‌లో చూపారు.

బాబోయ్ బీపీ, షుగర్

30 ఏళ్లు దాటిన వారిలో పెరుగుతున్న ముప్పు

- రాష్ట్రంలో 23.29 లక్షల మందికి బీపీ, 12 లక్షల మందికి షుగర్
- ఎన్‌సీడీ స్క్రీనింగ్‌లో వెల్లడి
- సర్కారుకు వైద్యశాఖ నివేదిక



హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 30 ఏళ్ల వయసు దాటినవారిలో పలువురు రక్తపోటు, మధుమేహం ముప్పును ఎదుర్కొంటున్నారు. ఈ రెండూ శరీరాన్ని రోగాల మయం చేస్తున్నాయి. సైలెంట్ కిల్లర్‌గా మారి ఆస్పత్రుల పాలు చేస్తున్నాయి. 30 ఏళ్లు దాటిన వారికి రాష్ట్ర వైద్యశాఖ అసాంక్రమిక వ్యాధుల (ఎన్‌సీడీ) స్క్రీనింగ్‌ను నిర్వహిస్తోంది. ఇప్పటికే రెండు విడతల స్క్రీనింగ్ పూర్తయ్యింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు చివరి వరకు చేసిన స్క్రీనింగ్‌లో 12.06 శాతం మంది బీపీ, 6.24 శాతం మంది షుగర్‌తో బాధపడుతున్న విషయం బయటపడింది. ఆ వివరాలను తాజాగా సర్కారుకు నివేదిక రూపంలో అందించింది. రాష్ట్రంలో 30 ఏళ్లుదాటిన వారు 1.93 కోట్ల మంది ఉన్నారు. వారందరికీ ఎన్‌సీడీ స్క్రీనింగ్ చేయాలని వైద్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం ఇంటింటి సర్వే చేస్తున్నారు. దీంట్లో భాగంగా జరిపిన స్క్రీనింగ్‌లో 23,29,558 మంది (12.06 శాతం) అధిక రక్తపోటుతో, మరో 12,05,329 మంది (6.24 శాతం) షుగర్‌తో బాధపడుతున్నట్లు వెల్లడైంది. రాష్ట్రంలో 30 ఏళ్లు దాటిన వారిలో 26 శాతం మంది బీపీ, మరో 13 శాతం మంది షుగర్ బాధితులుంటారని వైద్య ఆరోగ్యశాఖ అంచనా. ఇప్పటి దాకా చేసిన స్క్రీనింగ్‌లో 12 శాతం మంది బీపీ బాధితులు బయటపడగా, మరో 14 శాతం మందిని గుర్తించాల్సివుంది. అలాగే షుగర్ బాధితులకు సంబంధించి ఇప్పటి దాకా 6 శాతమే బయటపడగా, మరో 7 శాతం బాధితుల్ని గుర్తించాల్సి వుంది. మున్ముందు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

బీపీ, షుగర్ బాధితుల్లో మెదక్ అగ్రస్థానం

అత్యధిక బీపీ, షుగర్ బాధితులు మెదక్ జిల్లాలో ఉన్నారు. రాష్ట్రంలోనే ఆ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. 30 దాటిన వారిలో ఆ జిల్లాలో 4,22,773 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 89,427 మందికి బీపీ, 54,515 మందికి షుగర్ ఉన్నట్లు తేలింది. అంటే పరీక్షలు చేయించుకున్న వారిలో 22 శాతంమంది రక్తపోటు, 12.89 శాతం మంది షుగర్‌తో బాధపడుతున్నట్లు వెల్లడైంది. ఇక రెండోస్థానంలో నిర్మల్ జిల్లా నిలిచింది. అక్కడ 3,94,803 మందికి టెస్టులు చేయగా, అందులో 19.14 శాతం మందికి బీపీ, 9.68 మందికి షుగర్ ఉందని గుర్తించారు. మూడో స్థానంలో కామారెడ్డి జిల్లా నిలిచింది. ఆ జిల్లాలో 5,38,219 మందికి పరీక్షలు నిర్వహించగా.. 96,288 మందికి బీపీ, 61,117 మందికి షుగర్ ఉన్నట్లు తేలింది. అంటే 18 శాతం మంది బీపీతో, 11.35 శాతం మంది షుగర్‌తో బాధపడుతున్నట్లు వెల్లడైంది. 4వస్థానంలో నల్లగొండ జిల్లా నిలిచింది. అక్కడ 9,09,838 మందికి టెస్టులు చేశారు. అందులో 17.74 శాతం మందికి బీపీ, 9.36 శాతం మందికి షుగర్ ఉందని తేలింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 17 శాతం మంది బీపీతో, 9.77 శాతం మంది షుగర్‌తో బాధపడుతున్నట్లు వెల్లడైంది.

సైలెంట్ కిల్లర్స్

చాలామంది బీపీ, షుగర్ బాధితులకు తాము వాటి బారినపడ్డ సంగతే తెలియడం లేదు. గుర్తించిన వారిలో కూడా చాలామంది నిత్యం ఔషధాలను వాడటం లేదు. కేవలం 40 శాతం మందే రోజూ మందులు వేసుకుంటున్నట్లు వైద్యశాఖ పరిశీలనలో తేలింది. బీపీకి, షుగర్‌కు వేర్వేరుగా ట్యాబ్లెట్స్ వేసుకోవాల్సి రావడంతో కొంతమంది మర్చిపోతున్నట్లు వైద్యశాఖ గుర్తించింది. దీంతోపాటు ప్రతీ ఆరు నెలలకు పరీక్షలు చేసి, ఔషధాలను మార్చాల్సి ఉంటుంది. చాలా మంది రెగ్యులర్‌గా టెస్టులు చేయించుకోవడం లేదు. దీంతో బీపీ, షుగర్ నియంత్రణ కావటం లేదని వైద్య శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయి

ప్రస్తుతం 30లోపువారిలో ఎక్కువగా బీపీ, షుగర్ కనిపిస్తున్నాయి. బీపీ కంటే కూడా షుగర్ మరింత ప్రమాదకరం. మద్యం, ధూమపానంతో పాటు ఇటీవల డ్రగ్స్ తీసుకునే వారి సంఖ్య కూడా బాగా పెరిగింది. అది కూడా ఎన్‌సీడీ జబ్బుల తీవ్రత పెరగడానికి కారణమౌతోంది. గత పదేళ్లతో పోల్చితే వీటి బారినపడేవారి సంఖ్య ఎక్కువవైంది. ప్రతీ ఐదుగురిలో ఒకరు బీపీ బారినపడినట్లు 2022లో మేం నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. వైద్యుల సలహాతో వీటికి నిత్యం ఔషధాలు వాడాలి. సాధ్యమైనంత వరకు జీవనశైలిని ఆరోగ్యవంతంగా మార్చుకునే ప్రయత్నం చేయాలి.

- డాక్టర్ మాదల కిరణ్, గాంధీ ఆస్పత్రి ప్రొఫెసర్

జీవనశైలి కారణంగానే!

ప్రస్తుతం అసాంక్రమిక వ్యాధులు పెరుగుతున్నాయి. జీవనశైలిలో మార్పుల కారణంగానే వీటి ముప్పు పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. బీపీ, షుగర్ మాత్రమే కాదు.. గుండె, కిడ్నీ జబ్బులు, సీవోపీడీ, క్యాన్సర్ కేసులు కూడా తెలంగాణలో బాగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా 30 ఏళ్లలోపే పలువురు వీటి బారినపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఆఫీసుల్లో తీవ్రమైన ఒత్తిడి మధ్య పని చేయడం, సమయానికి తినకపోవడం, ప్యాకేజ్డ్ ఫుడ్స్ ఎక్కువగా తినడం, శారీరక శ్రమ అసలు లేకపోవడం లాంటివి వీటికి ప్రధాన కారణాలుగా వైద్యులు పేర్కొంటున్నారు.

అధికారుల భూదానం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. ఇందులో 129, 130, 161 సర్వే నంబర్లలోని 36 ఎకరాల భూమిని పట్నాల శివరాజు తండ్రి రాజయ్య 1955 ఏప్రిల్ 16న దానంగా ఇచ్చినట్లు భూదాన రికార్డుల్లో ఉంది. అయితే.. సర్వేనంబరు 129లోని 10.29 ఎకరాలు, సర్వేనంబరు 130లోని 13.16, సర్వే నంబరు 161లోని 4.17, సర్వేనంబరు 147లోని 10.36 ఎకరాల భూదాన భూములు ధరణిలో పట్టా భూములుగా మారిపోయాయి. అప్పటి ప్రభుత్వ పెద్దలకు చెందిన బినామీల పేరుతో వీటి క్రయవిక్రయాలు జరిగాయి. కానీ నాడు వ్యవస్థలన్నీ వారి కనుసన్నల్లో ఉండడంతో ఎవరూ నోరువిప్పలేదు. మిగతా 71 ఎకరాల స్వాహాకూ పన్నాగం పన్నినా.. ప్రభుత్వం మారిపోవడంతో వారి ఎత్తుగడ ఫలించలేదు. అయితే.. విఎగతా భూములు కూడా ఎలాగైనా తమ చేతులోకి వస్తాయని భావించిన అక్రమార్కులు ముందస్తుగానే వాటిని కూడా కలుపుకొని ప్రహరీ గోడ నిర్మించడం గమనార్హం.

16 ఏళ్ల కిందటే కిషన్‌రెడ్డి ఫిర్యాదు

తిమ్మాపూర్‌లోని 129, 130, 161లోని 36.23 ఎకరాల భూములను స్వాహా చేసేందుకు 2008లోనే కొందరు ప్రయత్నించారు. దీనిపై అప్పటి బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఉన్న కిషన్‌రెడ్డి 2008 జూన్ 23న ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. భూదానబోర్డుకు కూడా లేఖ రాశారు. దీంతో అప్పటి భూదాన బోర్డు.. జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖ రాసింది. దీనిపై విచారిస్తున్నామని.. అప్పటి వరకు ఈ భూములపై ఎలాంటి లావాదేవీలూ నిర్వహించకుండా నిలిపివేయాలని లేఖలో కోరింది. దీంతో ఈ భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. ఆ తర్వాత ఏళ్లు గడిచాయి. కిషన్ రెడ్డి కేంద్రమంత్రి కూడా అయ్యారు! కానీ.. ఆయన ఫిర్యాదు ఇచ్చిన భూదాన భూములు మాత్రం చేతులు మారిపోయాయి!!



రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌లో భూదాన్ భూముల చుట్టూ ప్రహరీ నిర్మించిన దృశ్యం

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.